www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ర్యాలీలో పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ

నో హెల్మెట్.. నో పెట్రోల్

హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత

తిరుపతిలో కలెక్టర్, ఎస్పీ అవగాహన ర్యాలీ

మంచి ఆలోచన.. సీఎం ప్రశంస 12

మంగళవారం | 16-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 280 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.11:58 తదుపరి త్రయోదశి, నక్షత్రం: స్వాతి మ.2:10 తదుపరి విశాఖ, వర్జ్యం: రా.8:28-10:16, దుర్ముహూర్తం: ఉ.8:53-9:37, రా.9:56-10:47, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:41, సూర్యాస్తమయం: 5:39 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సురేశ్ (పేర్లు మార్చాం), బ్యాంక్ ఉద్యోగిని శైలజల పెళ్లి కుదిరింది. పట్టుచీరలు, బంగారం కొనడం, శుభలేఖలు పంచడం కూడా పూర్తయింది. మరో వారం రోజుల్లోనే ఆ జంటకు పెళ్లి. ఆ సమయంలో.. సురేశ్ తన కాబోయే భార్య శైలజ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను చూశాడు. అందులో కాలేజీ ట్రిప్‌లో స్నేహితులతో సరదాగా ఉన్న ఫొటోలు.. వాటికి వచ్చిన కామెంట్లు చూసి ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. శైలజ ఎంత చెప్పినా వినకుండా పెళ్లి రద్దు చేసుకున్నాడు.

ముహూర్తపు బంధాలపై సోషల్ మీడియా పిడుగు

సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, కామెంట్లు చూసి పెళ్లి రద్దు చేసుకుంటున్న పలువురు

మధ్యప్రదేశ్‌లో 40 రోజుల వ్యవధిలో రద్దయిన పెళ్లిళ్ల సంఖ్య 150కి పైమాటే!

పచ్చటి కాపురాల్లో సైతం డిజిటల్ చిచ్చు

కౌన్సెలింగ్ తీసుకోవాలని నిపుణుల సూచన



(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

పెళ్లంటే నూరేళ్ల బంధం. రెండు కుటుంబాల కలయిక. ఒకప్పుడు.. అనుమానాలు, అపోహలకు తావులేకుండా పెద్దలు కుదిర్చిన వివాహ బంధంలో అమ్మాయి, అబ్బాయి చక్కగా ఇమిడిపోయేవారు. కొండొకచో.. ఆ పెళ్లి జరగడం ఇష్టంలేనివారు ఆకాశరామన్న ఉత్తరాలు రాసేవారు. ఆ ఉత్తరాలను నమ్మి కొంతమంది వివాహం రద్దుచేసుకునేవారు. ఇప్పుడు కాలం మారింది. ప్రపంచం మొత్తాన్నీ అరచేతిలో చూపిస్తున్న సోషల్ మీడియా.. ఆకాశరామన్న పాత్ర పోషిస్తోంది. పచ్చటి బంధాల్లో నిప్పు రాజేస్తోంది. పెళ్లికి ఓకే అనుకుని.. ముహూర్తం కూడా పెట్టుకున్నవారు.. కాబోయే భార్య/భర్త సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసిన ఫొటోలు, వారు చేసే కామెంట్ల ఆధారంగా ఆ పెళ్లిని రద్దు చేసుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఇటీవల 40 రోజుల వ్యవధిలో 150కిపైగా జంటలు తమ పెళ్లిని రద్దు చేసుకున్నాయంటే... పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ పెళ్లిళ్ల రద్దుకు ప్రధాన కారణం (62 శాతం) ఆయా జంటలు తమ తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసిన ఫొటోలు, కామెంట్లేనంటే అతిశయోక్తి కాదు. అక్కడే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇలాంటి కేసులు

మిగతా 11వ పేజీలో...

కుర్రోడు చూడ్డానికి టిప్‌టాప్‌గా ఉన్నాడు! రకరకాల 'లెక్కలు' చెబుతూ గొప్పలకు పోతున్నాడు! కానీ... జేబులో చిల్లిగవ్వ లేదు. క్రెడిట్ కార్డులు, అప్పులతో కాలం నెట్టుకొస్తున్నాడు. అదే సమయంలో... 'పైకి వినిపించకుండా' బీద అరుపులూ అరుస్తున్నాడు. సాయం కావాలంటున్నాడు. మరి... అవతలి వారు నమ్మేదెలా? సాయం చేసేదెలా?

...సాధారణ ప్రజలకు కూడా సులువుగా అర్థమయ్యేలా చెప్పాలంటే, ఏపీ ఆర్థిక పరిస్థితి అచ్చం ఇలాగే ఉంది!

రాష్ట్ర స్థూల ఆర్థిక ఉత్పత్తి రయ్యిమని దూసుకుపోతోందట! తలసరి ఆదాయంలో దేశ సగటును మించి టాప్ లేపుతోందట! కానీ... ఖజానా మాత్రం ఖాళీగా ఉంది. అన్నింటికీ ఆర్థికంగా కటకట!

ఏమిటీ వింత పరిస్థితి అనుకుంటున్నారా? కొన్ని అవసరాలకోసం చెబుతున్న గొప్పల లెక్కలే మరో కోణంలో కొంప ముంచుతున్నాయి. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర సాయం దక్కకుండా చేస్తున్నాయి. మరి... ఆ లెక్కల గొప్పల వల్ల ఏపీకి జరిగేది మేలా? కీడా? అంటే... సూటిగా చెప్పలేని పరిస్థితి. జీఎస్‌డీపీ పెంచి చూపిస్తే... కొన్ని అప్పులు ఎక్కువ తెచ్చుకోవచ్చు. 'అంతా బాగుంది' అని చెబితే 'బ్రాండ్ ఇమేజ్' పెరగవచ్చు. కానీ... అదే సమయంలో కేంద్రం పన్నుల్లో వాటాలు, గ్రాంట్లకు భారీగా కోత పడుతుంది.

అప్పులు, ఆర్థిక పరిస్థితిలో ఏపీ, బిహార్ దాదాపు ఒకటే. కానీ... ఈ ఏడాది కేంద్ర పన్నుల్లో వాటా మన కంటే బిహార్‌కు రూ.10వేల కోట్లు ఎక్కువగా వచ్చాయి. దీనికి ప్రధాన కారణం... 'ఆర్థికంగా బాగున్నాం' అని మనకు మనం చెప్పుకోవడమే!

'ఏం బాగున్నామని!?

'ఎక్కడ తగ్గాలో' తెలియకుండా గణాంకాలు

జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో 'తగ్గేదేలే'

అసలు కష్టాలను దాచి కాగితాలపై గొప్పలు

దీంతో కేంద్ర పన్నుల్లో వాటాలో భారీగా కోత

రెవెన్యూ లోటు గ్రాంట్లలోనూ నష్టమే

కేవలం అప్పుల కోసం జీఎస్‌డీపీకి రెక్కలు

జగన్ హయాంలో అప్పులే ఆలంబన

నేడు.. అప్పులతోపాటు 'ఇమేజ్' కోసం ఆరాటం

ఆర్థిక సంఘం నిబంధనల్లో సవరణకై యత్నాలు

ఢిల్లీ చుట్టూ రాష్ట్ర అధికారుల చక్కర్లు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా వెనుకబడి ఉండటం నిజం! జగన్ హయాంలో రాష్ట్రం బ్రాండ్ పాతాళానికి దిగజారింది. అప్పుడు పరిస్థితి వేరు. 'బటన్ నొక్కితే చాలు... అప్పులు చేసి సొమ్ములు పంచితే చాలు'! ఇప్పుడు పరిస్థితి వేరు! సంక్షేమం జరగాలి. అభివృద్ధి కావాలి. పెట్టుబడులు రావాలి! అన్నీ జరగాలంటే... బోలెడన్ని నిధులు కావాలి. ఇప్పుడు కొత్త పెట్టుబడులు రావాలన్నా, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించాలన్నా... రాష్ట్రం ఆర్థికంగా బాగుండాలి. కనీసం... బాగున్నట్లు కనిపించాలి. దీనికోసం... జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం, ఇతర గణాంకాలను చకచకా నిచ్చెన ఎక్కిస్తున్నారు. గ్రాఫ్‌లో గీత పైపైకి పోతోంది. 'వృద్ధిరేటు'పై

మిగతా 14వ పేజీలో...

మహాత్మా గాంధీకి రామ్ రామ్!

ఉపాధి హామీ పథకంలో మహాత్ముడి పేరు తొలగింపు

లోక్‌సభలో వీబీ-జీరామ్‌జీ పేరుతో ప్రభుత్వం బిల్లు

రాష్ట్రాలూ ఆర్నెల్లలో ఉపాధి హామీ చట్టాలు చేయాలి

వంద రోజుల నుంచి 125 రోజులకు ఉపాధి పెంపు

ఒక్కో రాష్ట్రానికి ఇన్ని నిధులు అని కోటా కేటాయింపు

అంతకు మించితే రాష్ట్రాలే భరించుకోవాలి


పంచాయతీల అవసరాలకూ ఉపాధి హామీ వాడొచ్చు

వ్యవసాయ రద్దీ సీజన్‌లో ఉపాధికి హాలిడే ప్రకటించాలి

లోక్‌సభలో బిల్లు వివరాలు వెల్లడించిన మంత్రి చౌహాన్

గాంధీ పేరు తొలగింపునకు కారణం ఏమిటి: ప్రియాంక

చర్చను దారి మళ్లించేందుకే పేరు ఎత్తేశారు: సీపీఎం



న్యూఢిల్లీ, డిసెంబరు 15: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చేసింది. ఇక నుంచి దాన్ని వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(గ్రామీణ్) అని పిలుస్తారు. యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన ఈ విప్లవాత్మక పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగిస్తున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం పాత చట్టాన్ని వెనక్కి తీసుకుంటూ

మిగతా 2వ పేజీలో...

'ఉపాధి' మేలు ఆవిరి!

ఏపీ గ్రామాల ప్రగతికి కొత్త బిల్లు గండి

ఇప్పటిదాకా లేబర్ కాంపోనెంట్‌లో 100% కేంద్రం నిధులు

మెటీరియల్ కాంపోనెంట్‌లో 75 శాతం కేంద్రం వాటా

ఇకపై కేంద్రం, రాష్ట్రం 60:40 నిధుల వాటా 13

మిగతా కేంద్ర పథకాల స్థాయికి ఈ స్కీమ్ కుదింపు

నిన్నటిదాకా.. పని పథకంతో గరిష్ఠ లబ్ధి పొందుతున్న ఏపీ

స్కీమ్ పేరుతో పాటు ఏపీ ప్రయోజనాలకూ కోత పడినట్లే



హాయ్‌ల్యాండ్‌లోనే మూల్యాంకనం

ఓఎంఆర్‌లపై మార్కుల నమోదు

గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలపై రిటైర్డ్ న్యాయమూర్తి కమిటీ నివేదిక

అప్పీళ్లపై పునర్విచారణకు హైకోర్టు ఓకే 3

3 వారాల్లో 7 కోట్లు కట్టండి

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో జేపీ వెంచర్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశం 12

2 పవర్ ప్రాజెక్టులకు ఓకే

శ్రీసత్యసాయి జిల్లాలో 1700 మె.వా. సోలార్ ప్రాజెక్టు

అనంతపురం జిల్లాలో 300 మె.వా. హైబ్రిడ్ ప్రాజెక్టు 12

నరసాపురం-చెన్నై వందేభారత్ ప్రారంభం 3

బాలు పాట అజరామరం



స్వర సార్వభౌమత్వానికి నిదర్శనమైన ఎస్పీ

బాలుతో నాది ఆత్మీయ అనుబంధం: వెంకయ్య

రవీంద్రభారతిలో బాలు విగ్రహావిష్కరణ 2

ఎస్పీ బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్య, దత్తాత్రేయ, శ్రీధర్‌బాబు తదితరులు

ఆయుధం వదిలేద్దాం

ఇక రహస్య ఉద్యమాలు చేయడం కష్టం

ప్రజా ఉద్యమాల నిర్మాణంలో విఫలమయ్యాం

వర్గపోరు తగ్గింది.. దోపిడీ రూపుమారింది

2024లో మావోయిస్టు పొలిట్‌బ్యూరో చర్చ

రాష్ట్ర కమిటీల అభిప్రాయంపై అంతర్మథనం

వెలుగులోకి సంచలన డాక్యుమెంట్ 13





అమరజీవి పొట్టి శ్రీరాములుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్పాంజలి

అమరావతిలో 'బలిదాన విగ్రహం'!

58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నామకరణం: సీఎం

తెలుగు జాతి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు 13

త్యాగ భవనంగా చెన్నైలోని ఆయన ఇల్లు

వచ్చే మార్చి 16న ఘనంగా 125వ జయంతి

ఆర్యవైశ్యులకు త్వరలో ఒకటే కులధ్రువీకరణ

దివ్యక్షేత్రంగా వాసవీ పెనుగొండ

'ఆత్మార్పణ దినం' సభలో చంద్రబాబు వెల్లడి

ఏఐ విస్తరణకు సహకరించండి

నైపుణ్య గణనకు చేయూతనివ్వండి

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నాం

ప్రతిపాదిత కేవీ, జేఎన్‌వీలు ఏర్పాటు చేయండి

సమగ్ర శిక్ష సంస్కరణకు 4,400 కోట్లు ఇవ్వండి

1,270 కోట్ల అదనపు నిధులు రావాల్సి ఉంది

విశాఖలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ పెట్టండి

కేంద్ర మంత్రులకు మంత్రి లోకేశ్ వినతులు

అశ్వినీ వైష్ణవ్, ప్రధాన్, జయంత్ చౌదరితో భేటీ



కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి లోకేశ్ 12



ఢిల్లీలో రోడ్డుపై దట్టంగా అలుముకున్న పొగమంచు; ప్రమాదానికి గురైన ఓ కారు

కమ్మేసిన పొగమంచు

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై 20 వాహనాలు ఢీ

ముగ్గురి మృతి... 15-20 మందికి తీవ్ర గాయాలు

సోనిపత్ వద్ద లారీ-కారు ఢీ.. మహిళా పోలీసు దుర్మరణం

పొగమంచు కారణంగా ప్రధాని మోదీ, మెస్సీ విమానాల జాప్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఉత్తరాదిన పొగమంచు కారణంగా సాధారణ రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం అవుతోంది. తొలి, మలి సంధ్యవేళల్లో దట్టంగా కమ్ముకుంటున్న మంచు ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతికూల వాతావరణానికి, మితిమీరిన వేగం తోడవుతుండటంతో నల్లటి తారు రోడ్లపై నెత్తురు చిందుతోంది. పొగమంచుతో వాయు రవాణాపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. చాలాచోట్ల

మిగతా 2వ పేజీలో...

నేను చనిపోతే.. నా కుటుంబాన్ని

చూసుకో..

బంధువుకు చెప్పి ఉగ్రవాదిని ఉత్తచేతులతో అడ్డుకున్న అహ్మద్ అల్ అహ్మద్ 2

అతడు నిజమైన హీరో.. ఆస్ట్రేలియన్ల హర్షం

ఆ ఉగ్రవాదులు పాకిస్థానీలే.. నిందితుల గుర్తింపు



అహ్మద్ అల్ అహ్మద్



13

హాట్ మెటల్ ఉత్పత్తిలో

స్టీల్ ప్లాంట్ రికార్డు

24 గంటల వ్యవధిలో 21,012 టన్నులు

చిత్తశుద్ధిని నిరూపించుకున్న ఉక్కు ఉద్యోగులు

భోగాపురంలో దేశంలోనే తొలి ఏఏడీ ఎడ్యుసిటీ

నేడు ప్రారంభించనున్న మంత్రి లోకేశ్

జీఎంఆర్-మాన్సాస్ ఆధ్వర్యంలో నిర్మాణం

అంతర్జాతీయ సంస్థల క్యాంపస్‌ల ఏర్పాటు

ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో నిపుణుల కొరత తీర్చడమే లక్ష్యం 12



హిమాలయాల్లో అణు ముప్పు!


చైనాపై నిఘా కోసం 1965లో అమెరికా రహస్య మిషన్

నందాదేవి శిఖరంపై ప్లుటోనియం జనరేటర్‌ను అమర్చేందుకు యత్నం.. మంచు తుఫానుతో ఆటంకం

పరికరాలను అక్కడే వదిలి కిందికొచ్చేసిన సిబ్బంది

మంచులో చిక్కుకున్న జనరేటర్ నుంచి అణు లీకేజీ

బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఆరోపణలు 2



హిమాలయాల్లో అణు ముప్పు!

న్యూఢిల్లీ, డిసెంబరు 15: మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే మరోసారి సంచలన ఆరోపణలు చేశారు! చైనాపై గూఢచర్యానికి అణుశక్తితో పనిచేసే నిఘా పరికరాన్ని మన హిమాలయాల్లో ఏర్పాటు చేసేందుకు అమెరికా గూఢచార సంస్థ సీఐఏకి వారిద్దరూ అనుమతి ఇచ్చారని.. గంగానది ఒడ్డున నివశిస్తున్నవారిలో ఇటీవలికాలంలో క్యాన్సర్ కేసులు పెరగడానికి, హిమాలయ ప్రాంతాల్లో విపత్తులు సంభవించడానికి కారణం ఇదేనని ఆయన 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. ఆయన ఈ అంశంపై ఆరోపణలు చేయడం ఇది మొదటిసారి కాదు. ఈ ఏడాది జూలై 14న కాంగ్రెస్ పార్టీపై ఇదే విషయమై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. "భారత తొలి ప్రధాని నెహ్రూ 1964లో, ఆ తర్వాత.. 1967, 1969 సంవత్సరాల్లో ఇందిర సీఐఏతో కుమ్మక్కై.. చైనాపై గూఢచర్యానికిగాను హిమాలయాల్లోని నందాదేవి శిఖరంపై అణు పరికరాలను ఏర్పాటు చేయడానికి సహకరించారు. ఆ తర్వాత అమెరికన్లు ఆ పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. 1978లో అప్పటి అమెరికా చట్టసభల సభ్యులు అప్పటి దేశాధ్యక్షుడికి రాసిన ఒక లేఖ ప్రతిని కూడా ఆయన తన పోస్టుకు జత చేశారు. ఆరు దశాబ్దాల క్రితం, ప్రచ్ఛన్న యుద్ధం పతాకస్థాయిలో జరుగుతున్న సమయంలో.. చైనా ఒక అణుబాంబు పరీక్ష నిర్వహించింది. దీంతో అప్రమత్తమైన సీఐఏ.. చైనా క్షిపణి పరీక్షలపై నిఘా కోసం హిమాలయ పర్వత శిఖరాల్లో ఒకటైన నందాదేవిపై ప్లుటోనియంతో పనిచేసే పరికరాన్ని అమర్చాలని నిర్ణయించింది. ఈమేరకు అమెరికా, భారత్‌కు చెందిన పర్వతారోహకులు ఒక పెద్ద యాంటెన్నా, కేబుళ్లు, 'శ్నాప్ 19-సి'గా పిలిచే 13 కిలోల జనరేటర్‌ను నందాదేవి శిఖరంపైకి మోసుకెళ్లారు. అక్కడ అమర్చే సమయంలో మంచుతుఫాను వారిని చుట్టుముట్టింది. ఈ మిషన్‌కు నాయకత్వం వహిస్తున్న కెప్టెన్ ఎంఎస్ కోహ్లీ అప్పటికి కిందనున్న శిబిరంలో ఉన్నారు. ఆయన.. వెంటనే కిందికి వచ్చేయాలని రేడియో సందేశం పంపారు. దీంతో పైనున్నవారు తమ శిబిరానికి దగ్గర్లో ఆ పరికరాలను దాచి, కిందికి వచ్చేశారు. వారు పైన దాచినవాటిలో ఒక అణు పరికరం ఉంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాగసాకి పట్టణంపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు తయారీకి ఉపయోగించినదాంట్లో మూడోవంతుకు సమానమైన ప్లుటోనియం.. ఆ అణు పరికరంలో ఉంది. ఏడాది తర్వాత ఆ ప్రాంతానికి వెళ్లి వెతికితే ఏమీ దొరకలేదు. కనిపించకుండాపోయిన పరికరాల్లో ప్లుటోనియం క్యాప్సూల్స్ ఉండడంతో.. రేడియేషన్ డిటెక్టర్లతో, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లతో వాటిని గుర్తించేందుకు ప్రయత్నించారుగానీ.. ఉపయోగం లేకపోయింది. ఇప్పుడా పరికరాలు ఎక్కడ ఉన్నాయో కూడా ఎవరికీ తెలియదు. ఈ మిషన్‌పై అమెరికా ఎప్పుడూ అధికారికంగా ప్రకటన చేయలేదు.

కాలుష్య కోరల్లో ఢిల్లీ వాసులు!

›› 82 శాతం మందిలో కాలుష్య సంబంధిత సమస్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఢిల్లీ ప్రజలు వాయు కాలుష్యం కోరల్లో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు..! తాజా సర్వే ప్రకారం... ఢిల్లీలో 82% మంది.. తమకు పరిచయం ఉన్న వారిలో ఒకరు లేక అంతకంటే ఎక్కువ మంది తీవ్రమైన కాలుష్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. 'లోకల్‌సర్కిల్' అనే కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 28% మంది తమ కుటుంబసభ్యులు, స్నేహితులు, పొరుగువారు లేదా సహోద్యోగుల్లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది ఇలాంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఢిల్లీ, గురుగావ్, నోయిడా, ఫరీదాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ సర్వేలో దాదాపు 34 వేల మంది పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీని పూర్తిగా దట్టమైన పొగమంచు కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) అత్యంత ప్రమాదకర స్థాయిలో 498గా నమోదైంది. 38 వాతావరణ పర్యవేక్షణ కేంద్రాల వద్ద గాలి నాణ్యత తీవ్రంగా పడిపోగా... రెండు కేంద్రాల వద్ద మరింత పేలవంగా ఉంది. గాలి నాణ్యత సూచీలో జహంగీర్‌పురిలో ఏక్యూఐ మరీ అధ్వానంగా 498గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం.. ఏక్యూఐ 0-50 వరకూ ఉంటే మంచిది. 51-100 మధ్య ఉంటే సంతృప్తికరంగా... 100-200 మధ్య నమోదైతే ఒక మోస్తరుగా... 201-300 మధ్య నమోదైతే పేలవంగా... 301-400 మధ్య ఉంటే మరీ పేలవంగా ఉన్నట్టు భావిస్తారు. ఇక 401-500 మధ్య నమోదైతే తీవ్రమైనదిగా పరిగణిస్తారు. ఢిల్లీలో ఏక్యూఐ ఆదివారం 461 పాయింట్లకు చేరుకుంది.

బెంగాల్‌లో 58.20 లక్షల మంది ఓటర్లు ఔట్?

కోల్‌కతా, డిసెంబరు 15: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) నేపథ్యంలో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితా నుంచి 58,20,897 మందికి పైగా (మొత్తం ఓటర్లలో 7.6 శాతం) పేర్లను తొలగించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఓటర్ల జాబితాలో గైర్హాజరు, వేరే చోటకు మారడం, మృతి చెందడం, నకిలీ ఓటర్లు దాదాపు 13.74 లక్షలు ఉన్నట్టు ఈసీ గుర్తించింది. ఆదివారం సాయంత్రం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ ప్రారంభమై రాత్రంతా కొనసాగినట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణను మంగళవారం ప్రారంభించి జనవరి 17 వరకు కొనసాగించనున్నారు. నోటీసు దశ (విచారణ, వెరిఫికేషన్) మంగళవారం ప్రారంభమై ఫిబ్రవరి 7 వరకు కొనసాగనుంది. తర్వాత ఫిబ్రవరిలోనే తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

సీఐసీగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణం..

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా మాజీ ఐఏఎస్ రాజ్‌కుమార్ గోయల్‌తో రాష్ట్రపతి ముర్ము ప్రమాణం చేయించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తదితరులు హాజరయ్యారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ప్యానెల్ గతవారమే గోయల్ పేరును సీఐసీగా ప్రతిపాదించింది. మరో 8 మందిని కేంద్ర సమాచార కమిషనర్లుగా ఎంపిక చేసింది. గోయల్ అరుణాచల్‌ప్రదేశ్-గోవా-మిజోరం-కేంద్ర పాలిత ప్రాంతాల (ఏజీఎంయూటీ) క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన ఆగస్టు 31న కేంద్ర న్యాయ శాఖ పరిధిలోని న్యాయ విభాగం కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. అంతకు ముందు సీఐసీగా ఉన్న హీరాలాల్ పదవీకాలం సెప్టెంబరు 13న ముగిసింది. అప్పట్నుంచి సీఐసీ పదవి ఖాళీగానే ఉంది.

గాంధీకి రామ్ రామ్!

(మొదటి పేజీ తరువాయి)

వీబీ-జీరామ్‌జీ 2025 బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. కేవలం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన పాత చట్టం స్థానంలో తీసుకొస్తున్న కొత్త బిల్లు నిబంధనలు వికసిత భారత్-2047 విజన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దారు. పాత చట్టంలో వంద రోజులు తప్పనిసరిగా ఉపాధి కల్పించడం(గ్యారెంటీ) ప్రధాన అంశం. కొత్త బిల్లులో గ్యారెంటీని 125 రోజులకు పెంచారు. 20 ఏళ్ల క్రితం పథకాన్ని తీసుకొచ్చినపుడు గ్రామీణ ప్రాంతాల్లోని పరిస్థితి ఇప్పుడు లేదని, మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని చౌహాన్ ప్రకటించారు. గ్రామీణ ప్రజలకు ఆదాయాన్ని ఇచ్చే ఉమ్మడి ఆస్తులను సరిపడా సృష్టించడం, వాటిపై అధికారాన్ని ఇవ్వడం పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ క్రమంలో వికసిత భారత్ జాతీయ గ్రామీణ మౌలిక సదుపాయాల సంపదను సృష్టిస్తారని వివరించారు. వ్యవసాయ పనుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో కూలీల కొరత తీర్చడం కోసం ఉపాధి హామీకి హాలీడే ప్రకటిస్తారని మంత్రి తెలిపారు. స్థానిక పరిస్థితులను బట్టి వ్యవసాయ పనుల రద్దీ సీజన్‌ను గుర్తించి, ఉపాధి పనుల హాలీడే ప్రకటించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ గ్రామ పంచాయత్ ప్రణాళికలో భాగంగా పంచాయతీ పనులకు కూడా ఉపాధి హామీని వాడుకోవచ్చని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకమే అయినప్పటికీ కొత్త ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లోగా అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ చట్టం చేయాలని, ఆ చట్టం నిబంధనలకు అనుగుణంగా పథకాన్ని అమలు చేయాలని చౌహాన్ చెప్పారు. కొన్ని పరామితుల ఆధారంగా ఒక్కో రాష్ట్రానికి నిర్దిష్ట మొత్తాన్ని కేటాయిస్తామని, రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన పరిమితికి మించి ఖర్చు పెట్టాల్సి వస్తే అదనపు మొత్తాలను రాష్ట్రాలే భరించాల్సి ఉంటుందని వివరించారు. 2005లో పథకాన్ని ప్రవేశపెట్టినపుడు అది కేవలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాత్రమే. 2009లో కాంగ్రెస్ రెండోసారి అధికారానికి



వచ్చిన తర్వాత పథకంలో కొన్ని మార్పులు చేశారు. ఆ సందర్భంగానే మహాత్మాగాంధీ పేరును పథకానికి చేర్చారు. తాజాగా గాంధీ పేరును తీసేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. బాపూ పేరుతో బీజేపీకి వచ్చిన ఇబ్బంది ఏమిటని గ్రామీణాభివృద్ధి శాఖ స్థాయీ సంఘం చైర్మన్, కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉల్కా ప్రశ్నించారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలోనే ఈ పథకాన్ని గోతులు తీసే పథకంగా ఎద్దేవా చేశారని అన్నారు. ఈ పథకాన్ని ఎత్తేయడమే మోదీ లక్ష్యమని ఆరోపించారు. మారిన పరిస్థితులు, అదనంగా చేర్చిన పనులను దృష్టిలో పెట్టుకొని 150 రోజుల ఉపాధి గ్యారెంటీ ఇవ్వాలని స్థాయీ సంఘం ప్రతిపాదించిందని, దాన్ని 125 రోజులకు కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ పేరును ఎత్తేయడం వల్ల ఢిల్లీ నుంచి గల్లీ దాకా అనేకచోట్ల గాంధీ పేరును తొలగించాల్సి ఉంటుందని, స్టేషనరీ ఖర్చు దండగని ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. పథకం ప్రధాన ఉద్దేశాన్ని సర్వనాశనం చేశారని, దానిపై చర్చ జరగకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే గాంధీ పేరును తొలగించారని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. ఉపాధిహామీ అనే మౌలిక హక్కును పక్కన బెట్టారని, కేంద్రం వాటాను తగ్గించి రాష్ట్రాలతో ఖర్చు పెట్టించే కార్యక్రమం మొదలు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికే అత్యంత క్రూరమైన కార్మిక చట్టాలను తీసుకొచ్చారని, దానికితోడు ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరుస్తుండటంతో గ్రామాల్లో భయానక పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు.

పౌర అణు రంగంలోకి ప్రైవేటు సంస్థలు!

›› లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 15: పౌర అణు రంగంలోకి ప్రైవేటు సంస్థలను అనుమతించే బిల్లు సహా మూడు బిల్లులను ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. శాంతి(ది సస్టైనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) బిల్లును జితేంద్ర సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పరమాణు ఇంధన చట్టం-1962, సివిల్ లయబిలిటీ రెజిం ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ చట్టం-2010ల స్థానంలో ఈ బిల్లును తీసుకొచ్చారు. అణు ఇంధన రంగంలో లక్ష్యాలను సాధించేందుకు, అణు సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలు, విద్యుతేతర రంగాల్లో పౌర అణు విస్తరణ కోసం ఈ బిల్లును తీసుకొచ్చామని చెప్పారు. యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలకు స్వతంత్ర, స్వయం పాలన, స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు ఉద్దేశించిన 'ది వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'ను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వినియోగంలో లేని 71 చట్టాల రద్దుకు ఉద్దేశించిన 'ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్-2025ను న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు.

కుదిపేసిన 'మోదీ..సమాధి' వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ప్రధాని మోదీకి ప్రాణహాని కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని పార్లమెంటు ఉభయ సభల్లో అధికార పక్షం డిమాండ్ చేసింది. సోమవారం సమావేశాలు ప్రారంభం కాగానే బీజేపీ ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో తమ స్థానాల్లో నిలబడి.. కాంగ్రెస్ సభ్యులకు తీవ్ర నిరసన తెలిపారు. మరోవైపు, 'కాంగ్రెస్ పార్టీయే పెద్ద ఓట్ చోర్' అంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ సభ్యులు రెండు సభల్లోనూ ఆందోళనలు చేశారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు పలుమార్లు ఉభయసభలూ వాయిదా పడ్డాయి. ఉదయం సమావేశాలు ప్రారంభం కాగానే, కాంగ్రెస్ ఆదివారం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన సభా అంశాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు లోక్‌సభలో ప్రస్తావించారు. 'మోదీ! నీ సమాధి కడతాం. ఈరోజు కాకపోతే రేపయినా ఇది తథ్యం' అంటూ కాంగ్రెస్ సభలో నేతలు విద్వేష నినాదాలు చేశారని, ప్రధానికి ప్రాణహాని కలగజేసేలా వ్యాఖ్యలు చేశారని రిజిజు తెలిపారు. "మనం రాజకీయ ప్రత్యర్థులమేగానీ శత్రువులం కాదు. కాంగ్రెస్ సభలో జరిగిన ఆ ఘటన అత్యంత దురదృష్టకరం. 2014లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన బీజేపీ సభ్యుడితో ప్రధాని మోదీ సభలోనే క్షమాపణ చెప్పించారు. అదే సంప్రదాయం కాంగ్రెస్ పాటించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా పోటీ నినాదాలు చేశారు. బీజేపీ సభ్యులు రాజ్యసభలోనూ కాంగ్రెస్‌కు నిరసన తెలిపారు. మోదీపై వ్యాఖ్యలు కాంగ్రెస్ మనఃస్థితిని తెలియజేస్తున్నాయని రాజ్యసభలో అధికార పక్ష నాయకుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఖండించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ సహా కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వ్యాఖ్యలకుగాను క్షమాపణలు కోరాలని నడ్డా డిమాండ్ చేశారు. దిగజారుడు రాజకీయాలను కాంగ్రెస్ కట్టిపెట్టాలని నడ్డా అనడంపై, ప్రతిపక్ష పార్టీ సభ్యులు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు.

లోకం తీరు



బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

నితిన్ నబీన్ బాధ్యతలు

న్యూఢిల్లీ, పట్నా, డిసెంబరు 15: బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ ఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం పట్నా నుంచి ఢిల్లీకి చేరుకొన్న నితిన్ నబీన్‌కు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలకడం విశేషం. ఆయన బాధ్యతలు చేపట్టే కార్యక్రమంలోనూ ఢిల్లీ సీఎంతో పాటు పలువురు ఢిల్లీ మంత్రులు పాల్గొన్నారు. పట్నా నుంచి ఢిల్లీకి బయలుదేరే ముందు నితిన్ నబీన్ విలేకరులతో మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించడం పార్టీ ఆశీర్వాదంగా పేర్కొన్నారు. సామాన్య కార్యకర్తలను ఉన్నత పదవుల్లో నియమించేది బీజేపీ మాత్రమేనని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యూహం ఏమిటని విలేకరులు ప్రశ్నించగా.. "అది బెంగాల్ అయినా.. అసోం అయినా... మా పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఓట్ చోరీ కాంగ్రెస్ సొంత అజెండా: ఒమర్

శ్రీనగర్, డిసెంబరు 15: కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన ఓట్ చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశాలు ఆ పార్టీ సొంత అజెండా అని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఈ అంశాలతో విపక్ష ఇండియా కూటమికి ఎలాంటి సంబంధమూ లేదని ఆయన తేల్చి చెప్పారు. ప్రతి పార్టీకి సొంత అజెండా నిర్దేశించుకునే స్వేచ్ఛ ఉందని, కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ, ఎస్ఐఆర్ అంశాలను ఎంచుకుందన్నారు. కాంగ్రెస్ వాళ్లేం చేయాలో నిర్దేశించలేం కదా అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి వెంటిలేటర్‌పై ఉందని ఆయన బిహార్‌లో కూటమి పరాజయం తర్వాత వ్యాఖ్యానించారు.

కమ్మేసిన పొగమంచు

(మొదటి పేజీ తరువాయి)

విమానాలు రద్దవుతున్నాయి. కొన్ని విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. నిన్నటికి నిన్న ఆదివారం హరియాణా రోహ్‌తక్‌లోని మెహం ప్రాంతంలో పొగమంచు కారణంగా ఒకేచోట 35-40 వాహనాలు ఢీకొన్న ఘటన మరువక ముందే మరో దారుణ ఘటన జరిగింది. సోమవారం హరియాణాలోని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేలో నూహ్ పట్టణం వద్ద ఒకేచోట 20 వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారులు సహా ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. 15-20 మంది తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేలో సోమవారం తెల్లవారుజామున 5గంటలకు తొలుత.. ఓవర్‌లోడ్‌తో వెళుతున్న లారీ, మరో లారీని ఢీకొట్టింది. ఆ వెంటనే.. జామకాయల లోడ్‌తో దూసుకొచ్చిన ఓ ట్రక్కు, ఆ లారీలను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఆ వెంటనే పొగమంచు కారణంగా దారి కనిపించకపోవడంతో కార్లు, టెంపోలు వచ్చి ఢీకొన్ని నుజ్జునుజ్జయ్యాయి. ఈ తరహా ప్రమాదాలే హిస్సార్, రెవారీలోనూ జరిగాయి. సోనిపత్ వద్ద ముందు వెళుతున్న ట్రక్కును కారు ఢీకొనడంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న మహిళా పోలీసు అధికారి మృతిచెందారు. కాగా ఢిల్లీ విమానాశ్రయంలో పొగమంచు కారణంగా సోమవారం 61 విమానాలు రద్దయ్యాయి. మరో ఐదు విమానాలను దారి మళ్లించారు. 250కి పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లోని దాదాపు అన్ని విమానాశ్రయాల్లోనూ సోమవారం ఇదే పరిస్థితి నెలకొందని ఇండిగో ఒక ప్రకటనలో వెల్లడించింది. దట్టమైన పొగమంచు ప్రభావం ప్రధాని మోదీ, సాకర్ దిగ్గజం మెస్సీ ప్రయాణాలపైనా పడింది. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటించేందుకు మోదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరాల్సి ఉంది. అయితే పొగమంచు కారణంగా మోదీ గంట ఆలస్యంగా అంటే 9:30కు బయలుదేరాల్సి వచ్చింది. భారత పర్యటనలో ఉన్న మెస్సీ, షెడ్యూల్ ప్రకారం ముంబై నుంచి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో సమావేశం కావాల్సి ఉంది. అయితే దట్టమైన పొగమంచు కారణంగా మెస్సీ ప్రయాణం ఆలస్యమైంది. మోదీ విదేశీ పర్యటన నేపథ్యంలో ఆయనతో మెస్సీ సమావేశం రద్దయింది.

ఆ ఉగ్రవాదులు పాకిస్థానీలే!

ఆస్ట్రేలియాలో ఉగ్రదాడి నిందితుల గుర్తింపు

›› తండ్రీ కొడుకులు సాజిద్, నవీద్ అక్రమ్ అని పోలీసుల వెల్లడి



కాల్పులు జరుపుతున్న నవీద్, సాజిద్



అహ్మద్‌ను పరామర్శిస్తున్న న్యూ సౌత్‌వేల్స్ గవర్నర్ మిన్స్

సిడ్నీ, డిసెంబరు 15: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో యూదులపై ఆదివారం కాల్పులకు తెగబడిన ఉగ్రవాదులు స్వయానా తండ్రీ కొడుకులని తేలింది. ప్రఖ్యాత బోండీ బీచ్‌లో హన్నుకా వేడుకల్లో పాల్గొన్న యూదులపై జరిగిన కాల్పుల్లో 15 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్ అని.. వీరు తండ్రీ కొడుకులు అని న్యూసౌత్‌వేల్స్ పోలీస్ కమిషనర్ మల్ లాన్యోన్ సోమవారం వెల్లడించారు. సాజిద్ అక్రమ్ 1998లో పాకిస్థాన్ నుంచి విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాకు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ఆస్ట్రేలియా హోంమంత్రి టోనీ బర్క్ వివరించారు. నవీద్ అక్రమ్ ఆస్ట్రేలియాలోనే జన్మించాడు. సాజిద్ స్థానికంగా పండ్ల దుకాణం నడుపుతున్నాడని తెలిపారు. ఈ తండ్రీ కొడుకుల కాల్పుల్లో ఘటనా స్థలంలోనే 12 మంది మరణించగా, గాయపడిన మరో ముగ్గురు ఆ తర్వాత మరణించగటంతో మృతుల సంఖ్య 15కు పెరిగింది. పోలీసుల కాల్పుల్లో సాజిద్ కూడా మరణించటంతో మొత్తం మృతుల సంఖ్య 16 అయ్యింది. 1996లో పోర్ట్ ఆర్థర్‌లో పర్యాటకులపై ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. ఆ తర్వాత ఇదే అతి పెద్ద దాడి అని పోలీసులు వెల్లడించారు. బోండీ బీచ్ కాల్పుల ఘటనకు పోలీసుల అలసత్వం కూడా ఒక కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఉగ్రవాది నవీద్‌ను ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ సానుభూతిపరుడిగా అనుమానించి 2019లోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, అతడికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు లభించకపోవటంతో వదిలేసి, అతడిపై సాధారణ నిఘా పెట్టారు. దీంతో ఇన్నాళ్లు మంచివాడిగా నటించిన అతడు.. సమయం చూసి ఘాతుకానికి పాల్పడ్డాడు. నవీద్ పనిచేసిన కంపెనీ ఇటీవలే మూతపడటంతో రెండు నెలల క్రితమే అతడు ఉద్యోగం కోల్పోయినట్లు ఆ దేశ మీడియా రిపోర్టు చేసింది. యూదులు 8 రోజులపాటు నిర్వహించుకునే హన్నుకా వేడుకల చివరి రోజు ఛనుకా వేడుక సందర్భంగా బీచ్‌లోని ఓ పార్కులో దాదాపు 1,000 మంది పాల్గొన్నారు. ఇదే అదనుగా తండ్రీ కొడుకులు కాల్పులకు తెగబడ్డారు. సాజిద్ పదేళ్ల క్రితమే గన్ లైసెన్స్ తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

నేను చనిపోతే.. నా కుటుంబాన్ని చూసుకో..

యూదులపై కాల్పులు జరిపిన ఒక ఉగ్రవాదిని ఉత్త చేతులతో నిలువరించిన అహ్మద్‌ను ఆస్ట్రేలియన్లు హీరోగా కొనియాడుతున్నారు. అతడు ఉగ్రవాదిని అడ్డుకుంటున్న వీడియోను ఆ దేశ మీడియా ప్రధానంగా ప్రసారం చేస్తోంది. కాల్పులు జరుగుతున్న సమయంలో అహ్మద్ సమీపంలోనే ఓ షాపులో తన బంధువుతో కలిసి ఉన్నాడు. ఉగ్రవాదిని చూడగానే.. 'నేను అతడిని అడ్డుకోవటానికి వెళ్తున్నా.. నాకు ఏమైనా అయినా, చనిపోయినా.. నా కుటుంబాన్ని నువ్వే చూసుకోవాలి' అని అతడికి చెప్పి ఉగ్రవాది వైపు పరుగెత్తాడని అహ్మద్‌కు వరుసకు సోదరుడయ్యే ముస్తఫా అనే వ్యక్తి ఆస్ట్రేలియా మీడియాకు వివరించాడు. అహ్మద్‌ను ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ కూడా నిజమైన హీరో అని కొనియాడారు. ఉగ్రవాదిని అడ్డుకొనే క్రమంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అహ్మద్ కోసం సోషల్ మీడియాలో విరాళాల కోసం పిలుపునివ్వగా ఒక్కరోజులోనే 1.33 లక్షల డాలర్లు (రూ.1.20 కోట్లకు పైచిలుకు) వచ్చాయి. కాగా, ముందుగా ప్రచారమైనట్లు అహ్మద్ పండ్ల దుకాణం నడపటం లేదని, పొగాకు ఉత్పత్తులు విక్రయించే ప్రత్యేక కన్వీనియన్స్ స్టోర్ నడుపుతున్నట్లు తేలింది. అతడు సిరియా నుంచి వచ్చి ఇక్కడ కుటుంబంతో జీవిస్తున్నాడు.



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన దత్తాత్రేయ, ఎస్పీ చరణ్, శైలజ

బాలు పాట అజరామరం

›› స్వర సార్వభౌమత్వానికి నిలువెత్తు నిదర్శనమైన బాలసుబ్రహ్మణ్యంతో నాది ఆత్మీయ అనుబంధం

›› మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

›› నాన్న రాజకీయాలకు అతీతమైన వ్యక్తి: ఎస్పీ చరణ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): "ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన ప్రతి పాటా, ప్రతి రాగం ఒక భావ జలపాతం. ఆయన గొంతులో నవరసాలు నాట్యమాడేవి. బాలు పాట ఎంత గొప్పదో, ఆయన వ్యక్తిత్వం అంతకన్నా మధురమైంది" అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. "బాలు జీవితం సినీసంగీత చరిత్రలో ఓ మైలురాయి" అని అభివర్ణించారు. ఘంటసాల, బాలు ద్వయం తెలుగు పాటకు పట్టాభిషేకం చేశారని కీర్తించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ది మ్యూజిక్ గ్రూప్ సంయుక్త నిర్వహణలో సోమవారం రవీంద్ర భారతి ప్రాంగణంలో వెంకయ్యనాయుడు చేతులమీదగా పద్మవిభూషణ్, గానగంధర్వ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఈ విగ్రహాన్ని చూస్తుంటే నిండైన తెలుగుతనం మూర్తీభవించిన బాలు రూపం కళ్లముందు సాక్షాత్కరించినట్టుంది" అని ఆనందం వ్యక్తం చేశారు. బాలు తండ్రి సాంబమూర్తి నెల్లూరులో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించేవారని చెబుతూ.. 'అప్పుడు నేను నెల్లూరివాడిని. ఇప్పుడు ఇక్కడే ఉంటున్నాను కనుక తెలంగాణ వాడిని. బహుశా! కన్నుమూసేది కూడా ఇక్కడేనేమో' అంటూ వెంకయ్యనాయుడు ఉద్వేగభరితంగా మాట్లాడారు.

అందరివాడు బాలు..

ఒకటి, రెండు కాదు.. 14 భాషల్లో 40వేలకుపైగా పాటలు పాడి, సంగీత ప్రపంచంలోనే రారాజుగా నిలిచిన అమర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఏ ఒక్క కులానికో, మతానికో, ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని.. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఢిల్లీలో ముఖ్యమైన సమావేశాల వల్ల సీఎం రేవంత్ రెడ్డి, ఈ సభకు హాజరుకాలేకపోయాని శ్రీధర్ బాబు తెలిపారు. బాలు విగ్రహావిష్కరణ తెలుగు ప్రజలందరికీ గొప్ప గౌరవమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హర్షం వ్యక్తం చేశారు. బాలు విగ్రహావిష్కరణకు పూర్తిసహాయ సహకారాలు అందించిన తెలంగాణ సాంస్కృతిక శాఖ కృషి ప్రత్యేకమైంది అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అభినందించారు. "బాలు పాట మధురం.. మాట ఆత్మీయం.. మనసు లాలిత్యం... సంస్కారం ఆచరణీయం" అని శాంతాబయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డి భావయుక్తంగా వివరించారు. బాలు కుమారుడు ఎస్పీ చరణ్ మాట్లాడుతూ.. "మా నాన్న ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగానే మెలిగారు. వీళ్లు ఆత్మీయులు - వాళ్లు మిత్రులు అనికాకుండా అందరినీ తనవాళ్లుగా భావించారు" అంటూ తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భార్య సావిత్రి, శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

బాలు మెచ్చిన విగ్రహమే

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 'శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న' చిత్రంలో 'ఏమి ఈ వింత మోహం' అంటూ తొలి పాట పాడిన ఇదే రోజున (1966, డిసెంబరు 15) ఆయన విగ్రహావిష్కరణ జరగడం విశేషమని కార్యక్రమ వ్యాఖ్యాతలు సుమ, సీనియర్ ప్రదీప్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మిత్రుడు జీవీ మురళీని, బాలు విగ్రహాన్ని తీర్చిదిద్దిన ప్రముఖ శిల్పి వడయార్‌ను కూడా సత్కరించారు. "బాలుగారి తల్లిదండ్రుల విగ్రహాలు తయారు చేయించడం కోసంగా రాజమండ్రిలోని మా శిల్పశాలకు ఆ మహనీయుడు 2018-19 మధ్యకాలంలో మూడు సార్లు వచ్చారు. అప్పుడు నేను బాలసుబ్రహ్మణ్యం గారి నిలువెత్తు విగ్రహం డిజైన్‌ను రూపకల్పనచేసి ఆయనకు చూపించాను. చాలా సంతోషించారు. అలా రవీంద్రభారతిలో ఇప్పుడు ప్రతిష్ఠించిన తన విగ్రహాన్ని బాలు గారు ముందే కళ్లారా చూసుకోవడం ఈ ప్రతిమ ప్రత్యేకత" అని శిల్పి వడయార్ చెప్పారు.



జెండా ఊపుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, నిమ్మల

నరసాపురం-చెన్నై వందేభారత్ ప్రారంభం

▸ పచ్చజెండా ఊపిన కేంద్రమంత్రి వర్మ



వందేభారత్‌లో మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణితో చర్చిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

నరసాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో బ్రాంచ్ లైన్‌లో నడిచే తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నరసాపురం-చెన్నై మధ్య నడిచే రైలేనని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపుర ంలో వందేభారత్ రైలును సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వర్మ మాట్లాడారు. వందేభారత్‌ను జిల్లా వరకు తీసుకొచ్చేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింద న్నారు. అందరినీ ఒప్పించి మొదటి వందేభారత్‌ను తీసుకురాగలిగామన్నారు. రానున్న రోజుల్లో బెంగళూరు, హైదరాబాద్‌కు కూడా నరసాపురం నుంచి వందేభారత్ నడిపేలా కృషి చేస్తామని చెప్పారు. రైలు ప్రారంభాన్ని పురస్కరించుకుని నరసాపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవంలో మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పులపర్తి అంజిబాబు, గుడివాడ ఎమ్మెల్యే రాము, కలెక్టర్ నాగరాణి, రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా తదితరులు పాల్గొన్నారు. వారంతా ఇదే రైలులో భీమవరం వరకు ప్రయాణించారు. కాగా.. వందేభారత్ రైలు వెళ్తుండగా కైకలూరులో పశువులు ట్రాక్‌పైకి వచ్చాయి. మూడు పశువులు రైలుకు అడ్డుగా రావడంతో డ్రైవర్ గమనించి వెంటనే అప్రమత్తమై నిలిపివేశారు. సుమారు ఒక నిమిషం అనంతరం రైలు మళ్లీ బయల్దేరింది.

హాయ్‌ల్యాండ్‌లోనే దిద్దారు

ఓఎంఆర్ షీట్లపై మార్కుల నమోదు .. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలపై రిటైర్డ్ న్యాయమూర్తి కమిటీ నివేదిక


▸ అప్పీళ్లపై పునర్విచారణకు హైకోర్టు ఓకే

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌లోనే మూల్యాంకనం చేశారని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ నేతృత్వంలోని స్వతంత్ర కమిటీ నిర్ధారించింది. ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేసినట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ధర్మాసనానికి కమిటీ తన నివేదికను అందించింది. గ్రూప్-1పై దాఖలైన అప్పీళ్లు సోమవారం విచారణకు రాగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి స్పందించారు. "అప్పీళ్లను తిరిగి ఓపెన్ చేసి విచారణ జరపాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశాం. దానిని అనుమతించాలి." అని కోరారు. ఈ అభ్యర్థనపై ఏపీపీఎస్సీ, అభ్యర్థుల తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. అప్పీళ్లపై పునర్విచారణ చేపట్టేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దీంతో ధర్మాసనం అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. తీర్పును రిజర్వ్ చేసిన అనంతరం జరిగిన పరిణామాలు, కమిటీ నివేదిక దృష్ట్యా అప్పీళ్లపై పునర్విచారణ చేపట్టేందుకు అంగీకరిస్తున్నట్లు ప్రకటించింది. సాధ్యమైనంత త్వరగా కేసుకు సంబంధించి కోర్టు వద్ద ఉన్న రికార్డుల సర్టిఫైడ్ కాపీలను అభ్యర్థుల తరపు న్యాయవాదులకు అందజేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని నిర్ధారిస్తూ ఈ పరీక్షలో అర్హులుగా పేర్కొంటూ 2022, మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను 6 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన కొందరు ఉద్యోగులు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తీర్పులోని కొంతభాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరికొందరు అప్పీల్ వేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల తుది విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, తీర్పు ప్రతి సిద్ధం చేస్తుండగా 2022, జూన్ 24న హైకోర్టు డివిజనల్ బెంచ్ ఉత్తర్వుల అమలులో లోపాలను ధర్మాసనం గుర్తించింది. వాటిని నివృత్తి చేసుకొనేందుకు వీలుగా 2022, జూన్ 24న హైకోర్టు డివిజనల్ బెంచ్ ఉత్తర్వులకు అనుగుణంగా అభ్యర్థుల జవాబుపత్రాలను సీల్డ్ కవర్‌లో తమ ముందు ఉంచాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. ఈ అప్పీళ్లు ఇటీవల విచారణకు రాగా హాయ్‌ల్యాండ్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందా?. ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారా?. లేదా? అనే విషయంపై వాస్తవాలు నిర్ధారించేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ చైర్మన్‌గా, బార్‌కౌన్సిల్ మాజీ చైర్మన్ గంటా రామారావు, నాగార్జున యునివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్‌లతో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమక్షంలో జవాబుపత్రాలు, ఓఎంఆర్ షీట్లు పరిశీలించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులకు అనుమతిచ్చింది. కాగా, ఈ అప్పీళ్లు సోమవారం మరోసారి విచారణకు వచ్చాయి.

భారత్ సత్తాను ప్రపంచానికి చాటిన నేత వాజపేయి

▸ నెల్లూరు, ఒంగోలుల్లో విగ్రహావిష్కరణ

▸ పాల్గొన్న మంత్రులు ఆనం, సత్యకుమార్, డోలా



నెల్లూరులో వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పక్కన మంత్రులు ఆనం, సత్యకుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన హయాంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తూ, అణుబాంబు ప్రయోగంతో భారత్ సత్తాను ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారి వాజపేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. అటల్, మోదీ సుపరిపాలన బస్సుయాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకొంది. ఈ సందర్భంగా నగరంలోని హరనాథపురం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వాజపేయి కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి మాధవ్ ఆవిష్కరించారు. నెల్లూరులో ఈ చౌక్‌ను అటల్ బిహారీ వాజపేయి చౌక్‌గా మార్చాలని మంత్రి ఆనంను సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, బీజేపీ బస్సుయాత్ర రాష్ట్ర కన్వీనర్ నాగోతు రమేశ్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే, ఒంగోలు వెంగముక్కల పాలెం జంక్షన్‌లో మంత్రి డోలా బాల వీరాంజ నేయస్వామితో కలిసి మాధవ్.. వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భవానీ దీక్షల విరమణలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ఈవో శీనానాయక్ తదితరులు

విజయవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగిన భవానీదీక్షల విరమణల కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. సోమవారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, పలువురు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. సుమారు 6 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 22 లక్షలకు పైగా లడ్డూలు విక్రయించారు. భవానీ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు మంగళవారం కూడా కొనసాగుతాయని, బుధవారం నుంచి దేవస్థానంలో యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని, సాధారణ దర్శనాలు, టికెట్ దర్శనాలు పునఃప్రారంభమవుతాయని ఈవో శీనానాయక్ తెలిపారు.

ఖాద్రీశుడి సేవలో జస్టిస్ మహేశ్వరరావు

కదిరి లీగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరరావు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. శ్రీవారిని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి జస్టిస్ మహేశ్వరరావుకు శ్రీవారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. న్యాయమూర్తి వెంట, అర్బన్ సీఐ నారాయణ రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

▸ 60 అంశాలపై చర్చ.. మళ్లీ తెరపైకి 'రోప్ వే?

తిరుమల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం తిరుమలలో మంగళవారం జరగనుంది. బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్యక్షతన సభ్యులు దాదాపు 60 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ప్రధానంగా ఈ నెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలు, చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంజినీరింగ్ పనులకు నిధుల కేటాయింపుపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇక, కాటేజీ దాతల ప్రయోజనాలు, నిర్వహణ వంటి అంశాలు, శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణాలకు సమగ్ర విధి విధానాల రూపకల్పన, నిధుల మంజూరు వంటి అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. వంద ఎకరాల్లో దివ్య వృక్షాల ప్రాజెక్టుకు బోర్డు ఆమోదం తెలపనుంది. పదేళ్ల క్రితం తీవ్రస్థాయిలో చర్చనీయాంశమైన తిరుమలకు 'రోప్ వే' అంశంపైనా చర్చించనున్నట్టు సమాచారం.

18న శ్రీవారి ఆర్జిత సేవల కోటా విడుదల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల మార్చి నెల కోటాను ఈ నెల 18న టీటీడీ విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్ట దళ పాద పద్మారాధన సేవల కోటాను 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ సేవల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20 ఉదయం 10 గంటల వరకు భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారసేవ, శ్రీవారి తెప్పోత్సవాలు, వసంతోత్సవాల టికెట్లను 22 ఉదయం 10 గంటలకు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో కేటాయిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లను విడుదల చేస్తారు. 23 ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల కోటా విడుదల చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదులను కేటాయిస్తారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రభుత్వమే చేపట్టాలి

▸ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

విజయవాడ (బస్‌స్టేషన్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి నిర్వహించాలని, ఆర్టీసీలో 10 వేల ఖాళీ పోస్టుల భర్తీకి అనుమతులు మంజూరు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. . చిన్న చిన్న పొరపాట్లకు తనిఖీ అధికారులు కేసులు నమోదు చేస్తుంటే డిపో మేనేజర్లు సస్పెన్షన్లు, తొలగింపులు చేస్తున్నారని, ఈ విధానాలను మానుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు దీపావళి కానుకగా ఇస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటిస్తూ జీవో ఇచ్చినప్పటికీ సుమారు 7వేల మంది పైబడి పదోన్నతులకు అర్హులున్నా అమలు చేయకపోవటం బాధాకరమన్నారు. ఈ పదోన్నతులను ఈ నెలాఖరులోగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ 28వ రాష్ట్ర మహాసభలు 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒంగోలులో నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

2047కి నెట్ జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించాలి

▸ ఈ లక్ష్య సాధనకు ఇంధన సంరక్షణే మార్గం

▸ ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో నాగలక్ష్మి

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర - 2047 లక్ష్య సాధనలో భాగంగా నెట్ జీరో ఉద్గారాల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. దానికి ఇంధన సంరక్షణ చర్యలు చేపట్టడమే మార్గం' అని జెన్కో ఎండీ, ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో నాగలక్ష్మి పేర్కొన్నారు. మనం ఆదా చేసే ప్రతి ఒక్క యూనిట్ ఇంధన భద్రత, ఆర్థిక ఆదాకు దోహదపడుతుందని అన్నారు. ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిక్షణ వారోత్సవాలను సోమవారం విజయవాడలో నాగలక్ష్మి ప్రారంభించారు. ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ సూర్య సాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ... 'బొగ్గు, డీజిల్, సహజ వాయువు వంటి వనరుల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నది. అందుకే సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఒక యూనిట్ ఆదా చేయడం అంటే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినట్లే' అని అన్నారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు.

చేనేత సొసైటీల బకాయిలు 30 శాతం చెల్లింపు

▸ ఆప్కో ఉద్యోగుల జీతాల విడుదలకు మంత్రి సవిత ఆదేశాలు

విజయవాడ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు 30 శాతం బకాయిలతో పాటు, ఆప్కో ఉద్యోగులకు రెండు నెలల జీతాలు విడుదల చేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆప్కో అధికారులతో సోమవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.3.90 కోట్లు (30 శాతం) చెల్లించాలని సూచించారు. ఈ మొత్తాన్ని వెంటనే సంఘాల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఆప్కో ఉద్యోగులకు బకాయి ఉన్న రెండు నెలల జీతాలు(రూ.1.70 కోట్లు) విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. దీనికి సంబందించిన బిల్లులను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులకు, నేతన్నలకు ఉపాధి కల్పించే ఆప్కోను కాపాడుకునే బాధ్యత ఉద్యోగులపై ఉందని గుర్తు చేశారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు.

పోలీసు కాలేకపోయా... చైర్మన్ అయ్యా!

▸ పోలీస్ హౌసింగ్ బాధ్యతలు స్వీకరించిన శివ శ్రీనివాస్

▸ హోం మంత్రి అనిత అభినందనలు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'పోలీసు కావాలన్న నా కల నెరవేరలేదు. కానీ చంద్రబాబు, పవన్ నన్ను ఏకంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌ను చేశారు. బాధ్యతగా పనిచేస్తా. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తా' అని కళ్యాణం శివ శ్రీనివాస్ అన్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా కూటమి ప్రభుత్వం జనసేన పార్టీకి చెందిన శివ శ్రీనివాస్‌ను ఇటీవల పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 30 అగ్నిమాపక కేంద్రాల నిర్మాణంతో పాటు ఇతరత్రా రూ.509 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టింది. ఏపీలో ప్రస్తుతం మోడల్ పోలీసు స్టేషన్ల నిర్మాణం రూ.172 కోట్లతో జరుగుతోంది. గ్రేహౌండ్స్ నిర్మాణం రూ.412 కోట్లతో, ఏపీ పోలీస్ అకాడమీ రూ.300 కోట్లతో నిర్మించనున్నాం' అని అన్నారు. కార్పొరేషన్ ఎండీ రవి ప్రకాశ్ మాట్లాడుతూ... ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేతిలో రూ.1,200 కోట్ల ప్రాజెక్టులు ఉన్నాయన్నారు.

50% రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాల్సిందే!

▸ ఢిల్లీ బీసీ ధర్నాలో అఖిలపక్ష నేతల డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని లేని పక్షంలో దేశంలో సామాజిక తిరుగుబాటు తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిలపక్ష నేతలు, బీసీ సంఘాల జేఏసీ నేతలు హెచ్చరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జంతర్‌మంతర్‌లో బీసీల మహాధర్నా నిర్వహించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉధృతం చేస్తున్నామని, అయినప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్పందించకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు.

తెలుగులోనే ప్రాథమిక విద్యా బోధన

▸ కడియం ఉన్నత పాఠశాలలో కవుల విగ్రహావిష్కరణలో మంత్రి దుర్గేష్



కడియం ఉన్నత పాఠశాలలో కవులు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతి శాస్త్రి, దువ్వూరి సుబ్బమ్మ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు

కడియం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ఇంకా గుర్తింపు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం ఉన్నత పాఠశాలలో సోమవారం వెలుగు బంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతి శాస్త్రి, దువ్వూరి సుబ్బమ్మ విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాథమిక విద్యబోధన మాతృ భాషలోనే కొనసాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కడియంలో కవి చెళ్లపిళ్ల, రాజమహేంద్రవరంలో గురజాడ అప్పారావు ఇంటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. మానవ జీవితంలో ఉండే నవరస భరిత విధానాలను కళ్లకు కట్టినట్టు చూపే నాటకం కురుక్షేత్రమని.. ఆ నాటకానికి చావులేదని.. ప్రజలంతా ఆనందించేలా మక్కువ తీసుకురావడానికి కారణం తిరుపతి వేంకటకవులు రాసిన పద్యాలేనని మంత్రి వెల్లడించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు సంబంధించి ఓ విభాగాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పరభాష వ్యామోహంలో పడి ఆంగ్ల భాష నేర్చుకోకపోతే మన పిల్లలకు భవిష్యత్ లేదని తల్లిదండ్రులు ఆలోచనలో ఉన్నారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలు కెళ్లిన మొట్టమొదటి మహిళ దువ్వూరి సుబ్బమ్మ అందరికీ స్ఫూర్తిదాయకమని తెలి పారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఎందరో కవులకు, కళాకారులకు జన్మనిచ్చిన జిల్లా తూర్పుగోదావరి అని.. ఈ ప్రాంతం సాహితీ ప్రక్రియకు మారుపేరని చెప్పారు.

కల్తీ నిరోధానికి టీటీడీ చర్యలు

▸ కొనుగోలు చేసే సరుకులకు 'థర్డ్ పార్టీ సర్టిఫికేషన్' తప్పనిసరి

తిరుమల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ విధానాన్ని సంస్కరించే పనిని టీటీడీ వేగవంతం చేసింది. కల్తీని నిరోధించి, నాణ్యత పెంచే లక్ష్యాలతో ఇప్పటికే కొత్త కొనుగోలు మాన్యువల్‌ను రూపొందించారు. టీటీడీ ప్రస్తుతం దాదాపు 300 రకాల సరుకుల కొనుగోలు కోసం రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు ఏటా ఖర్చు చేస్తోంది. కొనుగోళ్లలో అవినీతి అంశాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తుండడంతో అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇకపై సరుకుల కొనుగోలుకు థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ తప్పనిసరి చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. అన్ని కొనుగోళ్లలోనూ తప్పనసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు పాటించాలని సూచించింది.

ఏపీఆర్ సెట్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ 2024-25 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. 65 సబ్జెక్టులకు నిర్వహించిన ఈ పరీక్షలకు 5,164 మంది విద్యార్థులు హాజరు కాగా, 2,859 మంది (55శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ఉష, కో-కన్వీనర్ జాన్ సుష్మా తదితరులు ఆన్‌లైన్ ద్వారా ఫలితాలను విడుదల చేశారు. ప్రవేశాలకు సంబంధించిన మౌఖిక పరీక్షల తేదీలను త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు. ఫలితాల కోసం.. ఏపీసీహెచ్ఈ. ఆర్‌సెట్. వెబ్‌సైట్ చూడవచ్చు.



సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలి

▸ గంజాయి మాఫియాలకు రాజకీయ పార్టీల అండ: సీపీఎం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రాష్ట్రంలో లేకుండా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గంజాయి ముఠా చేతిలో ఇటీవల చనిపోయిన పెంచలయ్య సంస్కరణ సభ నెల్లూరు పురమందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల చలామణి విచ్చలవిడిగా సాగుతోందని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కళాశాలల్లో యువత పెడదోవ పడుతోందని, వీటిని సమగ్రంగా అణచివేయడంలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఏదో ఒక రాజకీయ పార్టీ అండదండతోనే గంజాయి మాఫియా ముఠాలు చెలరేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లేడీ డాన్‌లు పెరిగిపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, అలాంటి డాన్‌లు చెలరేగి పోకుండా అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని శ్రీనివాసరావు సూచించారు.

చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

▸ ఏపీ స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

▸ అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం డిమాండ్



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ వరప్రసాద్ యాదవ్ అధ్యక్షతన సోమవారం ఏపీ భవన్‌లో జాతీయ ఓబీసీ సెమినార్‌ను నిర్వహించారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో చట్టసభల్లో కూడా ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఓబీసీ వర్గాల నుంచి దేశవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతుందని, ప్రధాని మోదీ సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీలో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సీఎం చంద్రబాబు కేంద్రం మీద ఒత్తిడి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. దేశంలోని బీసీల అసమానతలు అధిగమించాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరిలో ఏపీ, తెలంగాణలో 50 వేల మందితో వేర్వేరుగా బహిరంగ సభలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాలుష్య కౌగిలి

తీవ్ర వాయుకాలుష్యం, పడిపోయిన ఉష్ణోగ్రతలు, దట్టమైన పొగమంచుతో దేశరాజధాని ఢిల్లీ పలు కష్టాల్లో మునిగిపోయింది. సోమవారం పెద్దసంఖ్యలో విమానాలు రద్దయ్యాయి, వాయిదాపడ్డాయి, ప్రధాని విదేశీ పర్యటన సైతం ప్రభావితమైంది. ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కనబడక అనేక ప్రమాదాలూ జరిగాయి. గాలి నాణ్యతా సూచీ అతి ప్రమాదకర స్థాయిలో ఐదువందల వరకూ నమోదైంది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్ ఫోర్ మార్గదర్శకాల ప్రకారం భవన నిర్మాణపనులు, స్టోన్ క్రషింగ్, మైనింగ్ ఇత్యాదివి నిలిచిపోయాయి. కార్లు, భారీ వాహనాల రాకపోకలమీద ఆంక్షలు, స్కూళ్ళ మూసివేతతోపాటుగా యాభైశాతం ఉద్యోగులను ఇంటి నుంచే పనిచేయమన్నారు. చివరకు రెస్టారెంట్లలో తందూరీ రోటీ తయారీని సైతం నిషేధించారట. పలుదేశాలు ఢిల్లీలో ఉంటున్న తమ వారిని బయట తిరగవద్దని జాగ్రత్తలు చెప్పాయి. ఢిల్లీలో అత్యయిక స్థితి నెలకొని ఉంది.

విషపుగాలితో విలవిలలాడిపోతున్న ఢిల్లీ జనాలకు శ్వాసకోశశక్తిని ఏ విధంగా పెంచుకోవాలో రామ్‌దేవ్ బాబా సలహాలు చెబుతున్నారు. ముక్కుపుటాలు అదిరిపోతూ, కళ్ళు మండిపోతూ, ఊపిరందని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సామాన్యజనానికి వేరే దిక్కులేనప్పుడు వీరే దిక్కు. కొవిడ్ కాలంలో పేదలు ఆక్సిజన్ దొరకక రోడ్లమీదే ప్రాణాలు వదిలేస్తుంటే, ధనికులను ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు రక్షించిన గతం ఇప్పుడు చాలామందికి గుర్తుకు వస్తున్నది. చుట్టూ కమ్మేసిన విషపు గాలి తమను తాకకుండా ఎయిర్ ప్యూరిఫయిర్లు, డీహ్యూమిడిఫయర్లు, ఖరీదైన క్లీన్ ఎయిర్ వ్యవస్థలతో ధనికులు తమ ఇళ్ళను శత్రుదుర్భేద్యమైన కోటల్లాగా ఎలా మార్చుకున్నారో మీడియా వివరిస్తోంది. మాస్కులు కూడా నిలువరించలేని స్థాయికి కాలుష్యం చేరుకున్నప్పుడు విషపుగాలిని దిగమింగడం వినా పేదలు చేయగలిగేదేమీ లేదు. ఢిల్లీ వాసులు ముప్పై సిగరెట్లు తాగినంత కాలుష్యాన్ని భరిస్తున్నారన్న లెక్కలు పేదలకు వర్తిస్తాయి తప్ప, ధనికులకు కాదు. స్వచ్ఛమైన గాలిపీల్చడం ప్రాథమిక హక్కు కావచ్చు గానీ, మిగతా హక్కులమాదిరిగా అది కూడా ఉన్నవాళ్ళకే దక్కుతుంది.

వాతావరణం అతివేగంగా దిగజారిపోవడం మనకు ఒక హెచ్చరిక. పిల్లలు, వృద్ధులనే కాదు, ఆరోగ్యవంతులను కూడా ఆస్పత్రుల్లో పడవేసేంత దుర్భరంగా పరిస్థితులు మారిపోయాయి. రేపటిరోజుల్లో కాస్తంత మెరుగుపడినప్పటికీ, ఢిల్లీ కాలుష్యం తాత్కాలిక, స్వల్పకాలిక చర్యలతో పరిష్కారం కాబోదన్నది నిజం. ప్రపంచ ఆరోగ్యసంస్థ విధించిన పరిమితికి ముప్పైరెట్ల కాలుష్యాన్ని రాజధాని వాసులు చవిచూస్తున్నప్పటికీ, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ లేకపోవడం అమితాశ్చర్యం కలిగిస్తుంది. పదిరోజుల క్రితం పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాలు నిరసనప్రదర్శన నిర్వహిస్తూ, ఢిల్లీ కాలుష్యం వల్ల పసికందులు మరణిస్తున్నారని, పిల్లలూ వృద్ధులూ రోగానపడుతున్నారని, పరిష్కారాలమీద సభలో చర్చజరగాలని డిమాండ్ చేశాయి. ఇది రాజకీయాంశం కాదని, ప్రభుత్వం చర్చకు సిద్ధపడితే చర్యలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ హామీ కూడా ఇచ్చింది. దీనికి ఓ నాలుగురోజుల ముందు సుప్రీంకోర్టు ఢిల్లీ కాలుష్యం మీద తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ, పొరుగురాష్ట్రాల్లో రైతులు పంటవ్యర్థాలు తగలబెట్టడమే కాలుష్యానికి కారణమని కేంద్రం అంటున్నందుకు ఆగ్రహించింది. కరోనాకాలంలో ఢిల్లీ ఆకాశవీధులు స్వచ్ఛంగా, నీలంగా ఉన్నాయని, పంటవ్యర్థాల దహనం ఇప్పటికంటే అప్పుడు ఎంతో ఎక్కువగా ఉన్నప్పటికీ, గాలి నాణ్యతకు ఏ లోటూ రాలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కేంద్రానికి గుర్తుచేశారు. నెపం రైతులమీదకు నెట్టివేయకుండా సమస్య పరిష్కారాలను అన్వేషించమంటూ హితవు చెప్పారు. గత మూడేళ్ళలో పంటవ్యర్థాల దగ్ధం 90శాతం తగ్గిపోయిందని ఇటీవల సభాముఖంగా అంగీకరించిన కేంద్రం, అసలు కాలుష్య కారకాల మీద దృష్టిపెట్టడానికి సిద్ధపడటం లేదు. ఢిల్లీ సహా అన్ని ప్రధాన నగరాల్లో కోట్లాదిమంది ఉసురుతీస్తున్న కాలుష్యం మీద రాజకీయాలకు అతీతంగా సభలో చర్చించి, సమష్టి నిర్ణయాలు చేద్దామంటూ రాహుల్ సభాముఖంగా అభ్యర్థించినప్పటికీ, కేంద్రప్రభుత్వం ఊరుకుంది. వందేమాతరం మీద చర్చపేరిట సభలో అనేకగంటల పాటు నెహ్రూమీద అక్కసు తీర్చుకున్న పాలకులకు ప్రజలను పట్టిపీడిస్తున్న ఒక ప్రధాన సమస్య పట్టకపోవడం విచిత్రం, విషాదం.

తెల్ల ఏనుగులు ఈ డేటా సెంటర్లు!

'అవి ఊహాజనిత వాదనలు!' శీర్షికన గూగుల్ డేటా సెంటర్ గురించి నవంబర్ 19 నాడు నేను రాసిన జవాబు వ్యాసానికి ప్రతిగా లింగమనేని శివరామప్రసాద్ గారు డిసెంబర్ 2న రాసిన వ్యాసంలో అనేక అవాస్తవాలు, ప్రభుత్వ ప్రచార ప్రకటనలు ఉన్నాయి.

అదానీ కానీ ఎయిర్‌టెల్ కానీ ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కాదు, కేవలం సహాయకులే (ఎనేబ్లర్స్) అన్నారు వ్యాసకర్త. అయితే, గూగుల్ సంస్థ (అనుబంధ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా) రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలోనే 3 అదానీ సంస్థలు, 3 ఎయిర్‌టెల్ సంస్థలు తన నోటిఫైడ్ పార్టనర్స్ అని పేర్కొంది. తనకి ఇచ్చిన రాయితీలే వాటికీ ఇమ్మని, భూమి కేటాయించమని అడిగింది. ప్రభుత్వం కూడా గూగుల్ సంస్థకి ఇస్తున్న రాయితీలే ఈ రెండు సంస్థలకీ ఇస్తున్నామని ప్రకటించింది. ఆ ప్రకారమే విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాలలో గూగుల్ సంస్థకి కేటాయిస్తున్నామని చెప్పిన 480 ఎకరాలను అదానీ, ఎయిర్‌టెల్ సంస్థలకి కేటాయించింది. అదానీ, ఎయిర్‌టెల్ సంస్థలు డేటా సెంటర్ నిర్మిస్తే గూగుల్ అందులో ఉండే సర్వర్స్‌ని వాడుకుంటుంది. భాగస్వామ్యం అనేదానికి ఇంతకన్నా అర్థం ఏం ఉంటుంది?

వ్యాసకర్త అమెరికా, ఐరోపా, చైనా డేటా సెంటర్ల గురించి చెప్పారు. అయితే ఆయన సాధారణ డేటా సెంటర్‌కి, ఏఐ డేటా సెంటర్‌కి మధ్య తేడా గమనించినట్టు లేరు. విశాఖపట్టణంలో పెడతామంటున్నది ఏఐ డేటా సెంటర్. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే ఏఐ యాక్సలరేటెడ్ (బహుశా) 8 ప్రాసెసర్ హైపర్ స్కేల్ డేటా సెంటర్. బహుశా అని ఎందుకు అన్నామంటే దీని గురించి ఏ సమాచారాన్నీ ప్రభుత్వం అందుబాటులో ఉంచలేదు. ఇక మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదు అని ప్రభుత్వం నియమం విధించింది అని వ్యాసకర్త తెలిపారు. అటువంటి నియమమేమీ ఏ చట్టంలోనూ లేదు; ఏదో కొన్ని రకాల వ్యక్తిగత, సంస్థల డేటా తప్ప.

గూగుల్ డేటా సెంటర్‌కి విశాఖపట్టణం మొత్తానికి అవసరమైన దాంట్లో 11శాతం నీరు అవసరం అని నేను చెప్పిన విషయం సత్యదూరం అని అంటున్న వ్యాసకర్త సత్యం ఏమిటో చెప్పలేదు. పోలవరం పనులు రెండు నెలలలో పూర్తి



అవుతాయి అనే ప్రభుత్వ ప్రచారాన్ని వల్లెవేయడం తప్ప. ఈ డేటా సెంటర్ ద్వారా 1,88,000 ఉద్యోగాల కల్పన జరుగుతుంది అనే రీతిలోనే 0.5 టీఎంసీ నీరు అవసరం అనేది కూడా ప్రభుత్వం ప్రచారంలో పెట్టిన సంఖ్యే. దీనికి పునాది ఏంటో ఎవరికీ తెలియదు. ఇక గూగుల్ వాడే కూలింగ్ సాంకేతికత కారణంగా నీటి వినియోగం, విద్యుత్తు వినియోగం 20శాతం తగ్గుతుంది అని వ్యాసకర్త తెలిపారు. దీనికి కూడా ఆధారం ఏమిటో తెలియదు. డెలాయిట్ లాంటి సంస్థల అంచనాల ప్రకారమే 5 ఎకరాల ఏఐ డేటా సెంటర్‌కి 50 మెగావాట్ల విద్యుత్తు అవసరం. ఆ లెక్కన 500 ఎకరాలకి ఎంత? విశాఖపట్టణం మొత్తం విద్యుత్తు వినియోగం ఎంత? వ్యాసకర్త చెప్పిన లెక్కల ప్రకారం 2030 నాటికి మొత్తం రాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి 31,000 మెగావాట్లు. అందులో 5,000 మెగావాట్లు ఈ సెంటర్ ఒక్కదానికే ఇస్తారా? ప్రాథమిక స్థాయి లీనియర్ ఎక్స్ట్రాపొలేషన్ చేసి చెబుతున్న సంఖ్య ఇది. ఇది కూడా సర్వర్, స్టోరేజ్, నెట్వర్క్, ప్రాసెసర్, కూలింగ్ పద్ధతి లాంటి అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు విశాఖపట్టణంలో రిలయెన్స్ సంస్థ 1 గిగావాట్ డేటా సెంటర్‌కి కూడా అనుమతి ఇచ్చారు. వీటి సంచిత ప్రభావం ఎంత? ఇరవైనాలుగు గంటలు పనిచేసే వీటికి గ్రిడ్ అనుసంధానం ఎలా? ఈ ప్రశ్నలన్నీ ఉన్నాయి. ఇక వ్యాసకర్త కాలుష్యం గురించి ఏమీ మాట్లాడలేదు. ఉద్యోగాల గురించి వ్యాసకర్త ఉటంకించిన వర్జీనియా రాష్ట్ర 'జాయింట్ లెజిస్లేటివ్ ఆడిట్, రివ్యూ కమీషన్ రిపోర్ట్' నుండే చూద్దాం. ఆ నివేదికలో చాలా స్పష్టంగా చెప్పింది ఏమిటంటే 'డేటా సెంటర్‌ల వల్ల కలిగే ఆర్థిక లాభాలలో అత్యధిక శాతం వాటి ఆపరేషన్ ఫేజ్‌లో కన్నా నిర్మాణ సమయంలోనే ఉంటాయి', 'మిగతా పరిశ్రమలతో పోలిస్తే డేటా సెంటర్లు తక్కువ మందికి ఉద్యోగాలు ఇస్తాయి, ఆ ఇచ్చే ఉద్యోగాలు పై స్థాయివి అయి ఉంటాయి'. ఈ రెండో విషయాన్ని గూగుల్ కూడా ఈ డేటా సెంటర్ గురించి ఇచ్చిన ప్రకటనలో పరోక్షంగా తెలిపింది. అంటే కాంట్రాక్ట్ తట్ట పని, మట్టి పని అని అర్థం చేసుకోవాలా? ఇక కేబుల్ ల్యాండింగ్ సెంటర్ ఇత్యాది వల్ల వచ్చే ఉద్యోగాలు స్వల్పం. డేటా సెంటర్లతో ఇతర సంస్థలు రెక్కలు కట్టుకుని వాలిపోతే వర్జీనియా ఈ పాటికి సిలికాన్ వ్యాలీని తలదన్నేసి ఉండాలి.

వ్యాసకర్త ప్రభుత్వ ప్రచారాన్ని ఉటంకిస్తూ ఈ డేటా సెంటర్ వల్ల ఏటా 10,588 కోట్ల ఆదాయం వస్తుంది అని చెప్పారు. ఇది తయారీ పరిశ్రమ కాదు, ఎకో సిస్టమ్ ఉన్న పరిశ్రమ కాదు కాబట్టి ఉద్యోగాల నుండి రాదు. ఈ సంస్థ కట్టే పన్నుల నుండి కూడా రాదు, పూర్తి మినహాయింపు ప్రభుత్వం ఎప్పుడో ఇచ్చేసింది. అనేక దేశాలు తమ దగ్గర వద్దు అంటే, మూడవ ప్రపంచ దేశం కాబట్టి, అన్ని ఉచితంగా ఇస్తున్నాము కాబట్టి మనమీద రుద్దుతున్న తెల్ల ఏనుగు ఇది.

• గుత్తా రోహిత్
మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్)

మరో పదేళ్లకు నిశ్శబ్ద విప్లవానికి విజయమేనా!





■ రాహుల్ కుమార్

వాస్తవాలకూ భావాలకూ మధ్య సంబంధం ఎప్పుడూ సంక్లిష్టమైనదే. ఏదో కారణంతో ఎప్పుడో ఒకప్పుడు ఏర్పరచుకున్న భావాలను ఒకపట్టాన మార్చుకోలేం. వాస్తవాలు మారినప్పుడు వాటి ఆధారంగా ఏర్పడిన భావాలూ మారాలి. అదంత తేలికకాదనే సంగతి ఏ సమాజ చరిత్రను చూసినా అర్థమవుతుంది. భౌతిక, జీవ, రసాయన విజ్ఞానాల విషయంలో భావాలను మార్చుకోటానికి అందరమూ సంసిద్ధంగానే ఉంటాం. సామాజిక వాస్తవాల దగ్గరికి వచ్చేటప్పటికి అంతటి సంసిద్ధతను వ్యక్తంచేయలేం. అసలు కొన్ని సామాజిక వాస్తవాలను అంగీకరించటానికి కూడా మనం ఇష్టపడం. ప్రతిభ అనేది పూర్తిగా పుట్టుకతో రాదనీ దానికీ మనం అనుభవించే సామాజిక హోదాలకూ, లభ్యమయ్యే వెసులుబాట్లకూ సంబంధం ఉందంటే.. కాదని చెప్పేందుకు ఆధునిక, సనాతన సిద్ధాంతాలు చాలా ఉన్నాయి. సమాజ కట్టుబాట్ల కారణంగా కొన్ని సామాజిక వర్గాలు వివిధ రంగాల్లో వెనుకబడి ఉన్నాయన్న విషయాన్ని అంగీకరించని పరిస్థితి నిన్నమొన్నటివరకూ ఉండేది. అట్లాగే కొన్ని సామాజిక వర్గాలు ఇటీవల గణనీయంగానే ముందంజ వేస్తున్నాయంటే కాదని వాదించే పరిస్థితీ ఉంది. మారుతున్న సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని భావాలను సరిచూసుకోవటమూ, సరిదిద్దుకోవటమూ ఎంతో సంఘర్షణతో కూడుకున్నది. కష్టమైనా, నష్టమైనా ఆ సంఘర్షణను ఎల్లకాలమూ వాయిదా వేయలేం. మారుతున్న సామాజిక వాస్తవాలు ఏదోరూపంలో బలంగా ముందుకు తోసుకు వస్తూనే ఉంటాయి. అవి పెట్టే రాపిడితో పాతకాలం నాటి వాస్తవాల ఆధారంగా ఏర్పరచుకున్న భావాలను మార్చుకోక తప్పనిసరి పరిస్థితీ ఎదురవుతుంది.

ఉన్నత విద్యారంగంలో అగ్రకులాలు అగ్రభాగాన ఉన్నారంటే ఎవ్వరికీ సందేహం రాదు. మన సామాజిక వాస్తవం అలాంటిది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ 2011–12 సంవత్సరం వరకూ ఇదే పరిస్థితి ఉంది. జనాభాలో పావువంతుకు కాస్త అటుఇటుగా ఉండే అగ్రకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో 57.1శాతం ఆనాటికి ఉన్నారు. ఆ తర్వాత పరిస్థితి మారింది. 2022–2023 సంవత్సరానికి వచ్చేటప్పటికీ మార్పు కొట్టొచ్చినట్లుగా కనపడింది. 2011–12 నాటికి ఉన్నత విద్యారంగంలో 42.9 శాతం మాత్రమే ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 2022–23కు వచ్చేసరికి 60.9 శాతానికి చేరింది. దీనికి భిన్నంగా మరో విచిత్రం కూడా జరుగుతోంది. ఉన్నత విద్యారంగంలో అగ్రకుల (ఓసీలు) విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇదొక నమ్మలేని నిజం! 2011–12 పోల్చితే ఆ తర్వాత 13 ఏళ్లల్లో ఉన్నత విద్యారంగం బాగా విస్తరించింది. ఈ విస్తరణతో ఓసీ విద్యార్థుల సంఖ్య మొత్తంగా ఎంతోకొంత పెరగాలి.

> ఏ కోణం నుంచి చూసినా ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పు ప్రగాఢమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు నాలుగింట మూడోవంతు సీట్లు దక్కటం ఖాయంగా కనపడటం.. గిడసబారిన సూత్రీకరణలకూ, పడికట్టు భావాలకు అతీతంగా జరుగుతున్న సామాజిక పరివర్తనకు ఒక గట్టి సూచిక. ఆ వాస్తవ గమనాన్ని మరింత లోతుగా విశ్లేషిస్తే 1990ల్లో మొదలై ఇప్పటికీ మారని నినాదాలనూ, భావాలనూ, రాజకీయాలనూ ప్రశ్నించే పరిస్థితే ఎదురవుతుంది! పాత భావాలతో కొత్త వాస్తవాలను విస్మరించటం వల్ల అది కాస్త ఆలస్యం కావచ్చు. కానీ దాని అనివార్యతను మాత్రం ఆపలేం!

కానీ ఆ కాలంలో 11 లక్షల మంది ఓసీ విద్యార్థులు తగ్గారు. 2010–11లో 1.83 కోట్ల ఓసీ విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో ఉంటే 2022–23 నాటికి ఆ సంఖ్య 1.72 కోట్లకు పడిపోయింది. ఓసీలకు మాత్రమే లబ్ధి చేకూర్చటానికి తీసుకువచ్చిన 10శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు కూడా ఈ తరుగుదలను ఆపలేకపోయాయి.

ఉన్నత విద్యారంగంలో మార్పులు ఆషామాషీవి కావు. సమాజంలో మారుతున్న బలాబలాలకు ఉన్నత విద్యారంగం ఎప్పుడూ బలమైన సూచికగానే ఉంటుంది. విద్యారంగానికి తోడు ఉద్యోగ రంగంలో కూడా సామాజికవర్గాల వారీ ఖచ్చితమైన గణాంకాలు సేకరించినప్పుడు ఇప్పటికే వచ్చిన మార్పులూ సమీప భవిష్యత్తులో రానున్న మార్పులూ స్పష్టంగా తెలుస్తాయి. ఇప్పటికైతే ఉద్యోగాల గురించి దేశవ్యాప్త సమాచారం లేదు. ఉన్నత విద్యారంగం గురించి మాత్రం అటువంటి సమాచారమూ, దాని విశ్లేషణా అందుబాటులో ఉంది. ఉదయ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు సంబంధించిన 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్' విభాగం.. కేంద్ర విద్యాశాఖ ఏటా ప్రచురించే నివేదికలను విశ్లేషించి మారుతున్న సామాజిక చిత్రాన్ని మనకు అందించింది. కేంద్ర విద్యాశాఖ ప్రచురించే నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి కాబట్టి.. ఐఐఎంకు చెందిన ముగ్గురు అధ్యాపకులు వెంకటరామన్ కృష్ణమూర్తి, త్యాగరాజన్ జయరామన్, దీనా బెనర్జీలు అంకెల విషయంలో చాలా జాగ్రత్త వహించారు. పేజీపేజీకి అధికారిక అంకెలనూ వాటి మూలాలనూ స్పష్టంగా పేర్కొన్నారు.

పదమూడు ఏళ్లలో దేశంలో రిజర్వేషన్ల శాతాల్లో పెద్దగా మార్పులు రాలేదు. వాటిని పెంచటానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకువచ్చినా అవి కోర్టుల జోక్యంతో అమలుకాలేదు. ఈశాన్య ప్రాంతాలు, తమిళనాడు లాంటి ఒకటిరెండు పెద్ద రాష్ట్రాలు మినహా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50శాతం రిజర్వేషన్లే అమలవుతున్నాయి. అంటే ఉన్నత విద్యారంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. 50శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యే ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థలకే ఈ ఎదుగుదల పరిమితం కాలేదు. ప్రభుత్వ సహాయం లభించని ప్రైవేటురంగంలోని విద్యాసంస్థల్లోనూ అది స్పష్టంగా కనపడుతోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 62.2 శాతం ఉంటే ప్రైవేటురంగంలో అది 60శాతంగా నమోదైంది. పోనీ ఈ వర్గాల విద్యార్థులు సంప్రదాయక కోర్సులైన బీఏ, ఎంఏ, బీకాం లాంటి వాటికే పరిమితమయితే దాన్ని ఒక రకంగా వెనుకబాటుగానే పరిగణించొచ్చు. కానీ పరిస్థితి అలా లేదు. బీటెక్ (48.2శాతం), బీఈ(60.5శాతం), ఎంటెక్ (63శాతం), ఎంబీఏ (51.2శాతం), ఎంబీబీఎస్ (44.7శాతం), ఎండీ (40శాతం) లాంటి కోర్సుల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదల స్పష్టంగా కనపడుతోంది. సాంకేతిక, వైద్య, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరికల సగటు ప్రగతిరేటు ఇతర కోర్సులతో పోల్చితే ఎక్కువగా ఉంటుంది. మున్ముందు ఈ కోర్సుల్లో కూడా ఈ వర్గాల విద్యార్థులు ఓసీ విద్యార్థులతో సమానస్థాయిని సాధించటం కష్టం కాదు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే దాన్ని సాధించారు.

ఇక ఓసీ కేటగిరీ విద్యార్థుల సంఖ్య ఉన్నత విద్యారంగంలో తగ్గిపోవటం చాలా రాష్ట్రాల్లో జరుగుతోంది. దేశంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 36 ఉంటే 23 చోట్ల ఈ తగ్గుదల కన్పిస్తోంది. రెండేళ్లకు (2020–21, 2021–22) సంబంధించిన గణాంకాలను విశ్లేషిస్తే కొన్ని రాష్ట్రాల్లో పరిస్థితి అనూహ్యంగా ఉంది. తమిళనాడులో ఇంకాస్త ముందుకు వెళితే తగ్గుదల తీవ్రత స్పష్టంగా కనపడుతుంది. 2010–11లో అక్కడ ఉన్నత విద్యలో ఓసీ విద్యార్థులు 8,51,839 మంది ఉంటే 2021–22 నాటికి ఆ సంఖ్య 5,61,978కి పడిపోయింది. తెలంగాణలో అదే కాలంలో ఆ విభాగాల విద్యార్థుల సంఖ్య 5,55,430 నుంచి 4,65,812కి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కూడా ఇంచుమించు అలానే ఉంది. అక్కడ విద్యార్థుల సంఖ్య 7,12,663 నుంచీ 6,20,159లకు పడిపోయింది. కర్ణాటకలో 1,06,739 మంది విద్యార్థులు తగ్గిపోయారు. కేరళలో ఈ తగ్గుదల 11శాతం ఉంది. బహుశా ఈ వర్గాల జనాభా రేటు గణనీయంగా తగ్గటం కూడా దీనికి ప్రధాన కారణం కావొచ్చు.

రాష్ట్రాల మధ్య అసమానతలు మన దేశంలో కొత్తకాదు. ఇవి ఎంతోకొంత విద్యారంగ అభివృద్ధిలోనూ కనపడటం సహజం. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఎదుగుదలను ఉన్నత విద్యారంగంలో గణనీయంగా తగ్గించే పరిస్థితిని కలిగించని రీతిలోనే అవి ఉన్నట్లుగా గణాంకాలను చూస్తే అర్థం అవుతుంది. 17 రాష్ట్రాల్లో ఈ వర్గాల విద్యార్థులు మూడింట రెండు వంతులకు కాస్తపైగా ఉండటమే ఇందుకు నిదర్శనం. మరో ఎనిమిది రాష్ట్రాల్లోనైతే నాలుగింట మూడొంతులకు పైగా ఉన్నత విద్యారంగంలో నమోదయ్యారు. ఇక తమిళనాడులో 83శాతం, తెలంగాణలో 70.8, ఆంధ్రప్రదేశ్‌లో 67.9, కర్ణాటకలో 68.5శాతం చొప్పున విద్యార్థులు ఉన్నారు. కేరళలో మాత్రం ఈ వర్గం విద్యార్థుల సంఖ్య 48.5 శాతానికి మించలేదు.

ఉన్నత విద్యారంగానికి సంబంధించిన పదమూడేళ్ల గణాంకాల పరమార్థం చెప్పేది ఒక్కటే. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ప్రగతి ఇకముందు కూడా అదే స్థాయిలో ఉంటే 2027–28 నాటికి ఉన్నత విద్యారంగంలో వారి సంఖ్య మూడింట రెండు వంతులకు మించిపోయే అవకాశం ఉంటుంది. ఇక 2035–36 నాటికి నాలిగింట మూడువంతులకు మించొచ్చు. అంటే రిజర్వేషన్లలో ఎటువంటి మార్పులు లేకుండానే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యారంగంలో వారి జనాభా దామాషాకు అనుగుణంగా ప్రాతినిధ్యం లభిస్తుంది! ఇది ఆశించిన విధంగా సాకారమైతే దీన్నొక నిశ్శబ్ద సామాజిక విప్లవంగానే పరిగణించొచ్చు. 1980ల తర్వాత ఉత్తరాదిన చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగటాన్ని నిశ్శబ్ద విప్లవంగా ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు క్రిస్టోఫ్ జఫ్రెలాట్ చేసిన వ్యాఖ్యానానికి సార్థకత ఉందనుకుంటే.. దీన్నీ ఆ విధంగానే చూడక తప్పదు! అయితే స్థూలచిత్రాలూ, స్థూల సంఖ్యలూ నిర్దిష్ట వాస్తవాలనూ, నిర్దిష్ట చిత్రాలనూ ప్రతిఫలించలేవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరిల్లో నిర్దిష్టంగా ఎవరు ఉన్నత విద్యారంగంలో ఎదుగుతున్నారో పరిశీలిస్తే కఠోర ఆర్థిక సత్యాలే కళ్లముందు కనపడతాయి.

> ఉన్నత విద్యారంగంలో అగ్రకుల (ఓసీలు) విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇదొక నమ్మలేని నిజం! 2011–12 పోల్చితే ఆ తర్వాత 13 ఏళ్లల్లో ఉన్నత విద్యారంగం బాగా విస్తరించింది. ఈ విస్తరణతో ఓసీ విద్యార్థుల సంఖ్య మొత్తంగా ఎంతోకొంత పెరగాలి. కానీ ఆ కాలంలో 11లక్షల మంది ఓసీ విద్యార్థులు తగ్గారు. ఓసీలకు మాత్రమే లబ్ధి చేకూర్చటానికి తీసుకువచ్చిన 10శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు కూడా ఈ తరుగుదలను ఆపలేకపోయాయి.


ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కులాలు, అందులోనూ పై వర్గాలే ఇంకా పైపైకి ఎదుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఐఐఎం విశ్లేషకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని అందరికీ ఉన్నత విద్యా అవకాశాలు సముచితంగా అందాలంటే విధానపరమైన మార్పులు చేపట్టాలని సూచించారు. ఇప్పుడున్న పరిస్థితిని చెప్పటానికి జస్టిస్ రోహిణి కమిషన్ పరిశీలనలో వెల్లడైన కొన్ని విషయాలను స్పష్టంగా పేర్కొన్నారు. రోహిణి కమిషన్ 1,30,000 పైగా ఉద్యోగాల ఎంపికనూ, విద్యారంగ ప్రవేశాలనూ విశ్లేషించింది. 25శాతం కులాలకు చెందినవారే 97శాతం ఉద్యోగాలనూ, విద్యారంగ ప్రవేశాలనూ దక్కించుకున్నారు. 37శాతం కులాలకు సున్నా ప్రాతినిధ్యం లభించింది. 994 కులాలకు కేవలం 2.68శాతం ఉద్యోగాలూ, ప్రవేశాలూ దక్కాయి. ఏ రాష్ట్రాన్ని తీసుకున్నా ఇదే పరిస్థితి కనపడుతుంది. రిజర్వేషన్లలో అధిక ప్రాతినిధ్యం పొందిన కులాలు వర్గీకరణలకూ, సంపన్నశ్రేణుల మినహాయింపులకూ ఒక పట్టాన అంగీకరించవు. అందుకే మారుతున్న వాస్తవాలనూ నిరాకరిస్తాయి.

ఏ కోణం నుంచి చూసినా ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పు ప్రగాఢమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు నాలుగింట మూడోవంతు సీట్లు దక్కటం ఖాయంగా కనపడటం.. గిడసబారిన సూత్రీకరణలకూ, పడికట్టు భావాలకు అతీతంగా జరుగుతున్న సామాజిక పరివర్తనకు ఒక గట్టి సూచిక. ఆ వాస్తవ గమనాన్ని మరింత లోతుగా విశ్లేషిస్తే 1990ల్లో మొదలై ఇప్పటికీ మారని నినాదాలనూ, భావాలనూ, రాజకీయాలనూ ప్రశ్నించే పరిస్థితే ఎదురవుతుంది! పాత భావాలతో కొత్త వాస్తవాలను విస్మరించటం వల్ల అది కాస్త ఆలస్యం కావచ్చు. కానీ దాని అనివార్యతను మాత్రం ఆపలేం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

శివరాజ్ పాటిల్ ప్రతిపాదించిన విమానాశ్రయం

నేను 1988లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయినప్పుడు డాక్టర్ శంకర్‌దయాళ్ శర్మ రాజ్యసభ అధ్యక్షులు. సభలో చర్చలకు నాకు అవకాశాలిచ్చి ప్రోత్సహించేవారు. ఆయన పరమ దైవభక్తులు. తిరుపతిలో పెక్కు పర్యాయాలు పొర్లు దండాలు చేసేవారు. శనివారం జరిగే సుప్రభాత సేవలో తప్పకుండా పాల్గొనమని ఆయనకు సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారట. ఒకరోజు శంకర్‌దయాళ్ శర్మ నన్ను తన ఛాంబర్‌కు పిలిచి "శివాజీ, రాత్రిపూట కూడా విమానాల రాకపోకలుండేటట్లు, బోయింగ్ విమానాలు కూడా దిగేందుకు వీలుగా రేణిగుంట విమానాశ్రయాన్ని ఆధునీకరించమని పౌరవిమాన యాన శాఖామాత్యులు శివరాజ్ పాటిల్‌కు చెప్పాను. సుముఖంగా స్పందించారు. నీవు దానిపై ఒక ప్రతిపాదనను తయారుచేసి ఆయనతో మాట్లాడు" అని శెలవిచ్చారు. శంకర్‌దయాళ్ శర్మ ఒక పర్యాయం విజయవాడ వచ్చినప్పుడు చినజియ్యర్ స్వామిని చూద్దామన్నారు. ఇద్దరం వెళ్లాం. వారిద్దరూ సంస్కృతంలో మాట్లాడుకొంటుంటే నేను తెల్లముఖం వేసుకొని వింటూ కూర్చున్నాను. "Any small excuse is good enough to go to Tirupati to me" అని ఎవరు, ఏ చిన్న కార్యక్రమానికి ఆహ్వానించినా ఆయన తిరుపతికి విచ్చేసేవారు. రాష్ట్రపతిగా ఉండగా కూడా అదే ధోరణి కొనసాగింది.



శర్మ గారి సూచన మేరకు ఒక మహజరు తయారుచేసి, అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులతో సంతకాలు చేయించాను. గురుదాస్ దాస్‌గుప్తా, దీపేన్ ఘోష్, చతురానన్ మిశ్రా, ఎన్ఈ బలరాం వంటి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు... తిరుపతి పర్వత ప్రాంతం, రాత్రిపూట విమానాల రాకపోకలు అంత అభిలషణీయం కాదు. అయినా శివాజీ అడిగాడు గనుక, కాదనలేక సంతకం చేస్తున్నామన్నారు. ఆ మహజరును నేను మంత్రికి అందించాను. అదసలు చూడకుండానే "శివాజీ, అది సరేగాని గన్నవరంలో విమానాశ్రయమేమిటయ్యా? అది ద్వితీయ ప్రపంచ సంగ్రామ అవసరాలకు నిర్మించారు. పౌర విమానయానానికి అది పనికొచ్చేది కాదు. దానిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని పంట పొలాలపై క్రిమిసంహారక మందులు చల్లే హెలికాప్టర్లు, ప్రైవేటు విమానాల రాకపోకలకు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ కార్యక్రమాలకు, ఇంకా ఏదైనా ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌కు వాడుకోండి. విజయవాడ–గుంటూరు మధ్య స్థలం సేకరించి ఇస్తే, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిద్దాం" అన్నారు. ఇది దాదాపు నాలుగు దశాబ్దాల నాటి మాట. ఈ ప్రాంతాలలో అప్పటికే ఎన్ఆర్ఐలు లెక్కకు మిక్కుటంగా ఉన్నారు. ఈ నినాదం స్వర్గీయ కొత్త రఘురామయ్య గళం నుండి వినపడుతూనే ఉన్నది. అప్పటికే లోక్‌సభ సభ్యునిగా ఉన్న సోదరులు వడ్డే శోభనాద్రీశ్వరరావు– "శివాజీ, మా రైళ్లన్నీ విజయవాడ నుంచి గుంటూరుకు తీసుకుపోయావు. ఇక విమానాశ్రయాన్ని కూడా వదిలిపెట్టవా?" అని దెప్పేవాడు. శివరాజ్ పాటిల్ ప్రతిపాదన కార్యరూపం దాల్చినట్లయితే, అప్పుడే విజయవాడ–గుంటూరు జంట నగరాలుగా వెలుగొందేవి.

○ డా. యలమంచిలి శివాజీ

ఈపీఎస్: ప్రభుత్వ వైఫల్యం, ఈపీఎఫ్ఓ నిర్లక్ష్యం

దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన లక్షలాది మంది కార్మికులకు, వృద్ధాప్యంలో భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్–1995), నేడు వారికే శాపంగా మారింది. అత్యున్నత స్థాయిలో ప్రభుత్వ వైఫల్యం, ఈపీఎఫ్ఓ మొండి బ్యూరోక్రటిక్ ప్రతిఘటన కారణంగా, ఈ పథకం కార్మికుల జీవన ప్రమాణాలను కాపాడాలనే ప్రాథమిక లక్ష్యాన్ని పూర్తిగా విస్మరించింది. వ్యవస్థాగత లోపాలు దేశంలోని శ్రామిక వర్గాన్ని వంచించాయి.




ప్రభుత్వ, బ్యూరోక్రటిక్ వైఫల్యాల కలయిక దేశ కార్మికులను మూడు విధాలుగా వంచించింది. అధిక వేతనంపై కాంట్రిబ్యూషన్ చేసిన వారికి, నిబంధనలు మార్చి పింఛను పొందే హక్కును హరించడానికి యత్నిస్తున్నారు; కనీస పింఛను రూ.వెయ్యికి పరిమితం చేసి, డీఏ అంశాన్ని విస్మరించడం ద్వారా, దశాబ్దాల పాటు కష్టపడిన వారి వృద్ధాప్య జీవితాన్ని దారిద్ర్యంలోకి నెట్టేశారు. ఆర్థిక భారం నుంచి తప్పించుకోవడానికి ఈపీఎఫ్ఓ బ్యూరోక్రసీని 'దోషి'గా చూపించి, రాజకీయంగా తప్పించుకునే ధోరణిని ప్రభుత్వం ప్రదర్శిస్తున్నది. ఈపీఎస్ రూపకల్పనలోనే కార్మికుల జీవన ప్రమాణాలను విస్మరించారు. ప్రస్తుతం ఈ పథకం కింద లభిస్తున్న కనీస పింఛను రూ. వెయ్యి మాత్రమే. ద్రవ్యోల్బణం, నేటి జీవన వ్యయాల దృష్ట్యా చూస్తే, ఈ మొత్తం కనీస అవసరాలను కూడా తీర్చలేదు. ఈ పథక రూపకల్పనలో జరిగిన అత్యంత పెద్ద లోపం– ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరిగే డీఏ (డియర్‌నెస్ అలవెన్స్) అంశాన్ని పూర్తిగా విస్మరించడం. ప్రభుత్వ ఉద్యోగులకు జీవన వ్యయానికి అనుగుణంగా పెరుగుతున్న పెన్షన్ లభిస్తుంది. కానీ ఈపీఎస్ పింఛనుదారులకు పెన్షన్ స్థిరంగా ఉంటుంది. దీనివల్ల ఒక వ్యక్తి 1995లో రిటైర్ అయినప్పుడు ఆ డబ్బుకు ఉన్న విలువ 2025 నాటికి తీవ్రంగా తగ్గిపోతుంది. ఇది కార్మికులను వృద్ధాప్యంలో దయనీయ స్థితికి నెడుతోంది.

ఉన్నత పింఛన్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఈ సంక్షోభాన్ని మరింత పెంచాయి. చట్టపరమైన లోపంతో ఉన్నా, కార్మికులకు అధిక పింఛన్ పొందే హక్కును కల్పించిన పేరా 11(3) నిబంధనను, 2014 సవరణ ద్వారా వెనుకటి తేదీ నుంచి తొలగించడానికి ప్రభుత్వం యత్నించింది. ప్రాథమిక హక్కులను, ముందే ఇచ్చిన అవకాశాన్ని ఇలా తొలగించడం అన్యాయమని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చింది. చట్టాలను రూపొందించేటప్పుడే దీర్ఘకాలిక ఆర్థిక అంచనా వేయడంలో విఫలమై, ఆ వైఫల్యాన్ని సరిదిద్దడానికి రాజ్యాంగ విరుద్ధమైన మార్గాన్ని ఎంచుకోవడం ప్రభుత్వ విధాన రూపకల్పనలో లోపం. సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాత కూడా ఈపీఎఫ్ఓ బ్యూరోక్రటిక్ యంత్రాంగం ఆ తీర్పు స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నించింది. ఉన్నత పింఛన్ అమలుచేయడం వల్ల ఫండ్‌పై భారీ ఆర్థికభారం పడుతుందనే భయంతో, ఈపీఎఫ్ఓ అధికారులు ఉద్దేశపూర్వకంగా దరఖాస్తు ప్రక్రియలో సంక్లిష్టమైన, అసాధ్యమైన షరతులను (ఉదాహరణకు– ముప్పై ఏళ్ల క్రితం దాఖలు చేసిన పత్రాలను డిమాండ్ చేయడం) విధించారు. దీనివల్ల అర్హులైన పింఛనుదారులు, వృద్ధాప్యంలో కోర్టు ధిక్కార పిటిషన్లు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ప్రతిఘటన– న్యాయస్థానం ఆదేశాలను కూడా అధికారులు గౌరవించకుండా తమ సంస్థాగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారని స్పష్టం చేస్తుంది.

కనీస పింఛన్, కనీస జీవన ప్రమాణాలను కూడా కల్పించలేని ఒక సామాజిక భద్రతా పథకం, దేశంలోని శ్రామికవర్గానికి తీరని అన్యాయం చేసింది. దీనిని సరిదిద్దాలంటే, కేవలం చట్టపరమైన మార్పులు కాకుండా, ప్రభుత్వం నుంచి బడ్జెట్ మద్దతు, నిర్ణయాత్మక రాజకీయ సంకల్పం అవసరం. కానీ ప్రభుత్వం ఈపీఎఫ్ఓ అధిక పెన్షన్ అమలుచేయడం లేదని అధికారులపై నెపం నెట్టడం హాస్యాస్పదం. ఉన్నత పింఛన్ విషయంలో ఈపీఎఫ్ఓ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాల స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినా, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం, తొలగించకపోవడం చూస్తుంటే ఆర్థిక భారం నుంచి తప్పించుకోవడానికి ఆడుతున్న నాటకం అని తెలుస్తూనే ఉంది.

■ శ్రీచంద్ర





● నీటిలో శిక్షణ

సంక్రాంతికి.. పై

● పందేలకు సిద్ధమవుతోన్న పుంజులు
● ఆహారంగా మటన్, డ్రైఫ్రూట్స్.. ప్రత్యేక శిక్షణ
● పందెం కోళ్ళకు పెరిగిన గిరాకీ

సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని పందెం రాయుళ్ళు ఎదురు చూస్తున్నారు. పందేలకు రూ.లక్షలు ఖర్చు చేసి వివిధ రకాల పుంజులను సిద్ధం చేసుకుంటున్నారు. నిత్యం కోళ్లకు బలమైన ఆహారంతో పాటు వ్యాయామం చేయించి సంక్రాంతికి బరిలో దింపేందుకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఒక్కో పుంజుకు రోజుకు వంద నుంచి రూ.700 వరకు ఖర్చు చేస్తున్నారు.

8

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

● కలెక్టర్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘన నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా అమరజీవి నిలిచారని కలెక్టర్ కొనియాడారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే మహోన్నత లక్ష్యంతో ఆయన చేపట్టిన నిరాహార దీక్ష దేశ చరిత్రలోనే ఓ అపూర్వ అధ్యాయంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, జడ్పీ సీఈఓ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కౌలు కష్టమే!

లక్ష్యాలకు దూరంగానే కౌలు రైతు కార్డులు

● బ్యాంకు రుణాల విషయంలోనూ శీతకన్ను
● రాయితీలు అందక కౌలు రైతుల ఇక్కట్లు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ ముగిసింది.. రబీ పనులు ఊపందుకున్నాయి. అయినప్పటికీ కౌలు రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) జారీ ప్రక్రియ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. 11 నెలల వ్యవధితో కౌలు రైతుల ప్రయోజనాల కోసం ఇచ్చే ఈ కార్డుల విషయంలో వ్యవసాయశాఖ ఘనంగా లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే. బ్యాంకు రుణాలు మొదలుకుని, సేద్యానికి ప్రభుత్వం అందించే పలు రాయితీ పథకాలు సీసీఆర్‌సీ ప్రామాణికంగానే కౌలు రైతులకు అందనున్నాయి. రబీ సీజన్ ప్రారంభమైనా.. ఇంకా 70 శాతం వద్దే సీసీఆర్ కార్డుల జారీ ఆగిపోయింది. ఇక బ్యాంకు రుణాలు కూడా ఆశించిన స్థాయిలో అందకపోవడంతో కౌలు సేద్యం నానాటికీ భారంగా మారుతోందని రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ నిధుల విడుదలపై కూడా.. ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇక ప్రకృతి విపత్తులు కూడా కౌలు రైతులను మరింతగా కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. నవంబరు నెలాఖరుతో సీసీఆర్‌సీల జారీని వంద శాతం చేరుకుంటామనే మాటలు ఆచరణకు నోచుకోలేదు. కానీ, ఇది (మిగతా 8వ పేజీలో)



బ్యాంకు రుణాలదీ అదే దారి

ఏటా బ్యాంకులు ప్రకటించే వార్షిక పద్దులో 5 శాతం రుణాలు కౌలు రైతులకు ఇవ్వాలనేవి ఆదేశాలు. వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా తుంగలో తొక్కి కనీసం ఒక్క శాతం రుణాలు కూడా అందించకుండా వారిని పూర్తిగా వంచించింది. అయితే 5 శాతం రుణాలు కౌలు రైతులకు అందించాల్సిందేనని ప్రస్తుత ప్రభుత్వం బ్యాంకర్లకు తేల్చిచెప్పింది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాకు రూ.200 కోట్లు, గుంటూరుకు రూ.170 కోట్లు ,పల్నాడుకు రూ.180 కోట్ల రుణాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. కానీ కార్డుల జారీనే ఇంకా ఓ కొలిక్కి రాకపోడంతో ఆ ప్రభావం బ్యాంకు రుణాలపై పడుతోంది.

విపత్తులతో మరింతగా కుదేలు

ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం సాగు విస్తీర్ణంలో దాదాపు 70 శాతం వాటా కౌలు రైతులదే. విపత్తులు సంభవించినప్పుడు నష్ట పరిహారం కూడా సాంకేతిక కారణాలతో భూ యజమాని ఖాతాలోనే జమ అవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీసీఆర్ కార్డులను సకాలంలో అందించడంతో పాటు బ్యాంకు రుణాలను కూడా క్రమం తప్పకుండా మానిటరింగ్ చేస్తేనే తమకు మేలు జరుగుతుందని కౌలు రైతులు అభిప్రాయపడుతున్నారు.

బదిలీ.. నాకొక లెక్కా?



● పాతుకుపోయిన ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి
● సివిల్ సప్లయీస్ ఎండీ బదిలీ ఉత్తర్వులను తొక్కిపెట్టిన వైనం
● బదిలీ అదేశాలు వచ్చి 15 రోజులైనా ఇక్కడే
● నాలుగేళ్లయినా కదలని వైనం

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆయనొక పౌర సరఫరాల శాఖ ఉద్యోగి. నాలుగేళ్లుగా గుంటూరు నగరంలోనే పాతుకుపోయారు. ఒక మండల స్థాయి స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి అయిన అతనిని బదిలీ చేయడం సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సైతం వీలుకావడం లేదంటే నమ్ముతారా? అవును నిజం. సదరు ఉద్యోగిని బదిలీ చేస్తూ 15 రోజుల క్రితం ఆదేశాలు వచ్చినా.. ఈ రోజు వరకూ.. అంగుళం కూడా కదిలించలేకపోయారు. దీన్ని బట్టి అతడు ఎంతటి ఘనాపాటో అర్థం చేసుకోవచ్చు.

● ఆరు నెలల క్రితం ఆగిన బదిలీ..

పౌర సరఫరాల శాఖ నియమ నిబంధనల ప్రకారం రెండేళ్లకోసారి.. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలను బదిలీ చేస్తారు. సాధారణ బదిలీలను తప్పించుకుంటూ నాలుగున్నరేళ్లుగా గుంటూరులోని ఎంఎల్ఎస్ పాయింట్లోనే ఈ కింగ్‌పిన్ పాతుకుపోయాడు. సదరు ఉద్యోగిని బదిలీ చేస్తూ ఆరు నెలల క్రితం జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం ఆదేశాలిచ్చారు. ఆ స్థానంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆదేశాలు ఇచ్చిన డీఎం బదిలీ అయ్యారు. కాగా, డీఎం ఆదేశాల మేరకు సోమవారం సీనియర్ అసిస్టెంట్ బాధ్యతలు తీసుకోవడానికి వెళ్లారు. అయితే అతనితో మంచిగా మాట్లాడిన స్టాక్ పాయింట్

(మిగతా 6వ పేజీలో)

గుంటూరు కేంద్రంగా రాష్ట్రాన్ని ఏలుతున్న బియ్యం మాఫియాలో సదరు ఉద్యోగి కింగ్ పిన్‌లా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మాఫియాతో చేతులు కలిపి ప్రతి నెలా లక్షల రూపాయల విలువ చేసే పేదల బియ్యాన్ని దారి మళ్లిస్తూ.. దర్జాగా విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. రూ.50 వేల లోపు జీతం తీసుకునే సదరు కార్పొరేషన్ ఉద్యోగి విలాసవంతమైన జీవితం చూస్తే కళ్లు తిరిగిపోతాయంతే! జిల్లాలో ఏ స్థాయి అధికారినైనా ప్రభావితం చేసే హోదా.. క్షణాల్లో ఏమార్చడం, అనుకున్నది జరిగేలా చక్రం తిప్పేయడం అతడి నైజం. ప్రస్తుతం తానున్నచోట నుంచి బదిలీ చేయడానికి ఏళ్ల తరబడి ప్రయత్నాలు జరుగుతూనే ఫలించడం లేదు.



కార్యాలయం ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జేసీ

నమూనాగా తెనాలి తహసీల్దార్ కార్యాలయం

● ఐఎస్‌వో ధ్రువీకరణ అందడం అరుదైన గౌరవం
● తహసీల్దార్ గోపాలకృష్ణ, దాతల కృషి అభినందనీయం
● కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి నాదెండ్ల

8

భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అమరజీవి బాటలు

- ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. ఎస్పీ వకుల్ జిందాల్ అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బాటలు వేసిన మహోన్నతుడిగా కొనియాడారు. ఆయన త్యాగం వల్లనే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూపుదిద్దుకుందని తెలిపారు. యువత ఆయన త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ సేవ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి.రమణమూర్తి, కార్యాలయ ఏఓ వెంకటేశ్వర రావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అలహరి శ్రీనివాస్, సీఐ అల్తాఫ్ హుస్సేన్, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, శివ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్


గుంటూరులో ఓఆర్ఆర్ ఆమోదం



● 39 గ్రామాలు, 4,763 సర్వే నంబర్లలో 5,789 ఎకరాల సేకరణ
● సర్వే నంబర్ల వారీగా జేసీ ఆమోదం
● ప్రచురించనున్న ఎన్‌హెచ్ఏఐ పీఐయూ అమరావతి

అమరావతి ఓఆర్ఆర్.. గుంటూరు గజిట్ నోటిఫికేషన్ విడుదల

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) గుంటూరు జిల్లా గజిట్ నోటిఫికేషన్‌ని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. 1956 జాతీయ రహదారుల చట్టం 3(ఏ)లోని సబ్ సెక్షన్(1) కింద దఖలు పరిచిన అధికారాల మేరకు నోటిఫికేషన్‌ని ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. 189 కిలోమీటర్ల పొడువునా నిర్మించే ఈ ఓఆర్ఆర్‌లో అమరావతి క్యాపిటల్ సిటీ స్ట్రెచ్ కోసం గుంటూరు జిల్లాలో అవసరమైన భూమికి సంబంధించి వివరాలు గజిట్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది. ఈ నోటిఫికేషన్‌పై ఆసక్తి కలిగిన వ్యక్తులు 21 రోజుల వ్యవధిలో సంప్రదించాలని (మిగతా 8వ పేజీలో)



గ్రామాలు ఇవే

కాజా, చినకాకాని, పాముల పాడు, సిరిపురం, వరగాని, మంద పాడు, డోకిపర్రు, విశదల, పేరేచర్ల, వెలవర్తిపాడు, మేడికొండూరు, అనుమర్లపూడి, చిలువూరు, కంఠంరాజు కొండూరు, ఈమని, చింతలపూడి, పెనుమూలి, వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట, కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, కట్టెవరం, గొడ వర్రు, నారాకోడూరు, వేజండ్ల, శుద్ధపల్లి, శేకూరు, కొర్నెపాడు, అనంతవరప్పాడు, చమళ్లమూడి, కుర్నూతల, ఏటుకూరు, బుడంపాడు, పొత్తూరు, అంకిరెడ్డిపాలెం గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. కాగా సేకరించే భూముల్లో ప్రభుత్వానికి సం బంధించి పోరంబోకు, ఈనాం, మెట్ట, కాలువ, చెరువు, రోడ్డు, ఎన్‌హెచ్, డొంక, పీడ బ్ల్యూడీ, వాగు పోరంబోకు, అసైన్డ్ భూములున్నాయి. అలానే ప్రైవేటు మెట్ట, మాగాణి భూములున్నాయి. వీటన్నింటిని 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరిస్తారు.

ఆర్టీసీ బస్సులో.. బంగారు ఆభరణాల చోరీ

● స్థానికుల అప్రమత్తతతో దొరికిన మహిళా దొంగలు
● అరెస్ట్ ధ్రువీకరించని పోలీసులు

పొన్నూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నుంచి బాపట్ల వెళుతున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో బంగారం చోరీని అడ్డుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం గుంటూరు నుంచి బాపట్ల వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో బాపట్ల జిల్లా గణపవరం గ్రామానికి చెందిన దొప్పలపూడి సీతారావమ్మ అనే మహిళతో పాటు మరికొందరు మహిళలు మార్గ మధ్యలోని పొన్నూరులో బస్సు ఎక్కారు. రద్దీ ఉండటంతో వారు బస్సులో నిలబడ్డారు. బస్సు చింతలపూడి దాటి ములుకుదురు గ్రామం ప్రవేశించే సమయంలో గుర్తుతెలియని ఐదుగురు మహిళలు హడావిడిగా బస్సు ఆపాలని సిబ్బందిని ఒత్తిడి చేశారు. దీంతో అనుమానించిన సిబ్బంది మహిళలను అప్రమత్తం చేశారు. అదే సమయంలో సీతారావమ్మ తన బంగారు గొలుసు కనిపించడం లేదంటూ కేకలు వేసింది. మరో మహిళ కూడా తన గొలుసు కనిపించడం లేదని గుర్తించింది. మహిళలు కేకలు వేయడంతో బస్సులో నుంచి దూకి ఐదుగురు మహిళలు పరారయ్యారు. అయితే మహిళల అరుపులు విన్న స్థానికులు పరారవుతున్న మహిళలను అడ్డుకొని వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, మహిళలను పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ ఘటనపై సీతారావమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు చోరీకి యత్నించిన మహిళలు తమిళనాడు వాసులుగా అనుమానిస్తున్నారు. అయితే పోలీసులు మహిళలను అదుపులోకి తీసుకున్న విషయం ధృవీకరించ లేదు. ఈ చోరీలో ఐదు సవర్ల బంగారు ఆభరణాలు.. మహిళలు తస్కరించినట్లు సమాచారం.



60 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ కృష్ణయ్య కథనం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామం వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై శ్రీహరితో కలిసి సీఐ తనిఖీలు నిర్వహించారు. పోలీసులు వస్తున్నారని గుర్తించిన రేషన్ ముఠాకి చెందిన ఓ వ్యక్తి అప్రమత్తం చేయడంతో అక్రమార్కులు వాహనాన్ని దారి మళ్ళించారు. పోలీసులు రెండు కిలో మీటర్ల మేర ఆటోను వెంబడించారు. అయితే ఆటో బురదలో దిగబడటంతో చేసేదేమి లేక ఆటోను వదిలి అందులోని వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకొని.. 60 బస్తాలలో ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాహనాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రేషన్ బియ్యం తరలిస్తున్న కుమార్, గోపి, ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటామని ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నూకవరపు వెంకటేశ్వరరావు, యర్రమనేని రామకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన క్లబ్ నూతన పాలక వర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. వారితో ఎన్నికల అధికారి నార్నె బాబూజీ రావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ క్లబ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లి పేద వర్గాలను ఆదుకుంటామన్నారు.

ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు



సభ్యులంతా క్లబ్ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత లింగమల్లు వెంకట రంగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ పెన్షన్ అదాలత్‌తో ఫిర్యాదుల పరిష్కారం

రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్



రైల్వే పింఛన్ అదాలత్‌లో ప్రసంగిస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారానికి సరైన వేదిక జాతీయ పెన్షన్ అదాలత్ అని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణసేన్ అన్నారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్ ప్రాంగణంలో జాతీయ పెన్షన్ అదాలత్ జరిగింది. దీనికి డీఆర్‌ఎం స్వయంగా హాజరై పింఛన్‌దారుల సమస్యలను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పింఛన్‌దారుల సంక్షేమానికి రైల్వే యంత్రాంగం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. అన్ని ఫిర్యాదులను సమయానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం మొత్తం 19 ఫిర్యాదులు రాగా 10 అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన తొమ్మిది కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఏపీఎం డివిజనల్ కాంత్, సీఎంఎస్ శ్రీనివాస్, సీనియర్ డీఎఫ్‌ఎం అమూల్య బి రాజ్ పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ ఈ ఫలితాలను విడుదల చేసి మాట్లాడుతూ, రీవాల్యుయేషన్‌కు 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కోపేపర్‌కు రూ.2,070 చెల్లించాలన్నారు. ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొంది పరచామన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొందుగుల గ్రామం వద్ద కృష్ణానదిలో సోమవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. తాడికొండ మం డలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఇంద్ర శంకర్ (38) తాగుడు మానేసేందుకు తాయత్తు కట్టించుకోవడానికి ముగ్గురితో కలిసి పొందుగుల గ్రామానికి వచ్చాడు. కృష్ణానది వద్దకు స్నానం చేసేందుకు వెళ్లి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, సుమారు 50-55 సంవత్సరాల వయసు గల వ్యక్తి దుగ్గిరాల రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ సమీపంలో కూర్చొని ఆకస్మికంగా పక్కకు ఒరిగి చనిపోయాడు. స్టేషన్ అధికారుల సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా మృతునికి చెందిన వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలన్నారు.

జాతీయ అంధుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

● హాజరైన హైకోర్టు న్యాయమూర్తి, శాప్ చైర్మన్

గుంటూరు (క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గోరంట్ల గంగరాజు, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ స్టేడియంలో జాతీయ అంధుల టీ-20 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ క్రీడాకారులు ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసాన్ని చాటుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ పారా అథ్లెటిక్స్ ప్రత్యేక జీవోను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకుడు అజయ్ కుమార్ రెడ్డి, అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా చైర్మన్, సమర్థనం ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీకే మహంతేష్, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జీకోటేశ్వరరావు, దివ్యాంగులు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బీరవి ప్రకాష్ రెడ్డి, ఏపీఏప్‌ఎస్‌పీ చైర్మన్ జి.నారాయణ స్వామి, గ్రావెన్ కన్సల్టెన్సీ డైరెక్టర్ చెన్నా కరుణ, సీఏపీ ఏపీ అధ్యక్షుడు చెన్నా శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్, శాప్ చైర్మన్ రవినాయుడు

ఆవిష్కరణల్లో భారత్-అమెరికా సహకారం

● అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్



మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సందర్శించిన అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

గుంటూరు, మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో భారత్-అమెరికా మధ్య నిరంతర సహకారం మరింతగా విస్తరిస్తోందని అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ అన్నారు. మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సోమవారం ఆమె సందర్శించారు. స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలు, ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలు, భారత్-అమెరికా మధ్య సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లారా విలియమ్స్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, క్వాంటం టెక్నాలజీ, సైబర్ భద్రత, బాధ్యతాయుతమైన డేటా వినియోగం వంటి రంగాల్లో అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత బలపడుతుందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సమాజానికి ఉపయోగేపడేలా ప్రగతి సాధించాలని సూచించారు. ఆర్‌టీఐహెచ్ సీఈవో ధాత్రి రెడ్డి మాట్లాడుతూ, స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, ప్రభుత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే విధంగా ఆర్‌టీఐహెచ్ నూతన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మిస్తోందని తెలిపారు. ఈ తరహా అంతర్జాతీయ స్థాయి పరస్పర సమావేశాలు స్థానిక ఆవిష్కర్తలకు ప్రపంచ స్థాయి దృక్పథాన్ని అందించడంతోపాటు భవిష్యత్తులో దీర్ఘకాలిక సహకారం, జ్ఞాన మార్పిడి, సంయుక్త కార్యాచరణకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్‌కు అనుబంధంగా పనిచేస్తున్న పలు స్టార్టప్ కంపెనీలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి.

విజ్ఞాన్ వర్సిటీకి ఎన్‌ఆర్‌బి డీఆర్‌డీవో ప్రాజెక్టు

గుంటూరు విద్య డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఢిల్లీలోని నావల్ రీసెర్చ్ బోర్డ్ (ఎన్‌ఆర్‌బీ) డీఆర్‌డీవో నుంచి ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టు మంజూరైనట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ, విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజనీరింగ్ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పి.అశోక్ కుమార్, విజ్ఞాన్స్ వర్సిటీ రీసెర్చ్ అడ్వైజర్ డాక్టర్ తొండెపు సుబ్బయ్య, అలాగే భువనేశ్వర్‌లోని సీఎస్ఐఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హైడ్రో అండ్ ఎలక్ట్రోమెటలర్జీ విభాగాధిపతి, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కాలి సంజయ్‌కు సంయుక్తంగా ఈ ప్రాజెక్టు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ పరిశోధనకు రూ. 74.35 లక్షల విలువైన గ్రాంట్‌ను మూడు సంవత్సరాల కాలానికి ఎన్‌ఆర్‌బీ డీఆర్‌డీవో మంజూరు చేసిందని తెలిపారు. ఈ పరిశోధన ద్వారా సముద్ర జలాల్లో మిగిలే బిట్టెర్న్ నుంచి అధిక స్వచ్ఛత గల ఎన్‌హైడ్రస్ మెగ్నీషియం క్లోరైడ్ తయారీకి వినూత్నమైన సాంకేతిక విధానాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.



ప్రాజెక్టు పత్రాన్ని డాక్టర్ లావు రత్తయ్యకు అందచేస్తున్న అధ్యాపకులు

రైతులకు ఉదారంగా రుణాలందించాలి

● జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మల్లికార్జునరావు

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు పురోభివృద్ధిలో అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో సోమవారం జరిగిన మహజన సభలో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సహకార శాఖను అన్ని విధాలా అప్రతిష్ఠపాలు చేసేలా వ్యవహరించారని విమర్శించారు. అధికారులు, ఉద్యోగులు అందరూ సమష్టిగా కృషి చేసి రైతులకు రుణాలందించడంలో చొరవ చూపాలన్నారు. ఎటువంటి అక్రమాలు జరిగినా సహించేదిలేదన్నారు. డీసీఎమ్‌ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు మాట్లాడుతూ, రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఎరువుల పంపిణీలోనూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా డీసీఎమ్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, సొసైటీల అధ్యక్షులు, పలువురు అధికారులు, ఉద్యోగులున్నారు.

● ఎన్‌టీఆర్ సహకార భవన్ ఎదుట ఉద్యోగుల ధర్నా....

రాజకీయ ప్రేరేపిత విచారణల పేరుతో తమపై జరుగుతోన్న దాడులను నియంత్రించాలంటూ బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్ ఎదుట సోమవారం ఉద్యోగులు ధర్నా చేశారు. రాజకీయ ప్రేరేపిత కేసులు, ఉద్యోగుల కుటుంబసభ్యులపై పోలీసుల భౌతిక దాడులను నియంత్రించాలంటూ నినదించారు. ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్ మాట్లాడుతూ మాజీ సీఈవో కృష్ణవేణి నివాసానికి వెళ్ళి ఆమె లేకపోవటంతో కుటుంబసభ్యులపై భౌతిక దాడులకు పాల్పడ్డారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులో రైతుల సొమ్మును కాజేసిన వారిని వదిలేసి కేవలం ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. జీడీసీసీ బ్యాంకు శాఖల్లో జరిగిన అక్రమాలపై పూర్తిగా పారదర్శకంగా విచారణలు కొనసాగుతున్నాయని, ఎక్కడా రాజకీయా ప్రేరేపిత కేసులకు తావులేదని చైర్మన్ మక్కెన స్పష్టం చేశారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులపై భౌతిక దాడులను ఖండిస్తున్నానని, తాను స్వయంగా ఎస్పీని కలిసినట్లు తెలిపారు.



ప్రసంగిస్తున్న చైర్మన్ మక్కెన, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ప్రణాళిక

● ఇంటర్ బోర్డు ఆర్ఐవో సునీత

గుంటూరు (విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక అవసరమని ఇంటర్ బోర్డ్ ఆర్ఐవో గర్నెపూడి సునీత అన్నారు. ఇప్పటి నుంచే కళాశాలల ప్రిన్సిపాళ్లు పరీక్షల నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆమె కోరారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో సునీత మాట్లాడుతూ, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రభుత్వం చేసిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలకు అవసరమైన ల్యాబులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు అధికారిణి ఈ రేఖా రాణి, ఇంటర్ బోర్డు ఆర్జేడీ జె.పద్మా తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ఆర్ఐవో సునీత

డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ దేశానికే మోడల్ కావాలి

● ఎఫ్‌టీపీసీ ఎక్సలెన్సీ అవార్డు వేడుకల్లో రవికృష్ణ

తాడేపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చి దేశానికి ఆదర్శంగా నిలుపుతామని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. విద్య, వైద్య, సేవా రంగాలలో సేవలు అందించిన ప్రముఖులకు ఎఫ్‌టీపీసీ స్టేట్ ఎక్సలెన్సీ అవార్డు-2025 కార్యక్రమం ఆదివారం తాడేపల్లి పట్టణంలోని విజయవాడ క్లబ్‌లో జరిగింది. సంస్థ అధ్యక్షుడు చైతన్య జంగా, ప్రధాన కార్యదర్శి విజయవర్మ పాకలపాటి, నేతృత్వం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో రవికృష్ణ మాట్లాడుతూ, డ్రగ్ ఫ్రీ స్టేట్ నినాదాన్ని ప్రధానంగా తీసుకొని స్టేట్ ఎక్సలెన్సీ అవార్డుల కార్యక్రమాన్ని చేపట్టిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. బీజేపీ స్టేట్ ప్రోగ్రామ్స్, ప్రోటోకాల్ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ పాతూరి నాగ భూషణం, పుట్టగుంట వి.సతీష్, కూచిపూడి నగేశ్‌బాబు, గొట్టిపాటి రామకృష్ణ, ఎస్పీ నాగేశ్‌బాబు, తదితరులు విచ్చేసి పలు రంగాలలోని ప్రముఖులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటీమణులు, గాయనీమణులు, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న ఈగల్ ఐజీ రవికృష్ణ, పాతూరి నాగభూషణం తదితరులు

విజయకీలాద్రిపై తీర్థ గోష్టి



భక్తులకు తీర్థం అందిస్తున్న చినజీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయ కీలాద్రి దివ్య క్షేత్రానికి సోమవారం చినజీయర్ స్వామి విచ్చేశారు. కొండపై స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజి మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అలాగే జనవరిలో జరగబోయే విజయకీలాద్రి 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు, మార్చిలో నిర్వహించనున్న శ్రీ విఘ్నవిమోచన హనుమాన్ 27 అడుగుల ఏకశిల విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ వివరాలను భక్తులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, అర్చకులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఎలక్ట్రికల్ మెషిన్స్ ల్యాబ్



ఎలక్ట్రికల్ మెషిన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో ఎలక్ట్రికల్ మెషిన్స్ ల్యాబ్‌ను వైస్ చాన్స్‌లర్ (వీసీ) ఆచార్య కే గంగాధరరావు ప్రారంభించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, ల్యాబ్‌లలో ప్రాయోగిక అవగాహనతో పరిశ్రమలకు అనుగుణంగా సిద్ధమవ్వా లని సూచించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం మాట్లాడుతూ, త్వరలోనే యూనివర్సిటీలో సోలార్ టెస్టింగ్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేయను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లింగరాజు, రెక్టార్ ప్రొఫెసర్ శివరామ్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు చంద్రమౌళి, గోపీకృష్ణ, డీఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డా.వాసవి ఉమా మహేశ్వరి, ఆర్ ఎస్ శ్రీనివాస్, కె.పృథ్వీ రాజు, సీహెచ్ రవి కుమార్, పుణ్య శేఖర్, రాజాజీ, మనో హర్, అజయ్, ప్రసాద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

21న నెట్‌బాల్ జట్ల ఎంపిక

గుంటూరు (తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న మహిళలు, పురుషుల విభాగాల్లో ఉమ్మడి జిల్లాల నెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్, మూడు పాస్‌పోర్టు ఫోటోలతో హాజరవ్వాలని కోరారు. ఎంపి కైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9963334731 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

బదిలీ.. నాకొక లెక్కా?

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జిగారు.. త్వరలో కొత్త డీఎం వస్తున్నారు. ఆమెకు రిపోర్టు చేస్తే బాగుంటుందని కొత్తగా బాధ్యతలు స్వీకరించాల్సిన ఉద్యోగిని వెనక్కి పంపిచారు. ఆ రాత్రికి రాత్రే ఉన్నతాధికారులతో మాట్లాడి బదిలీని ఆపించేశారు ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ ఇక్కడే మళ్లీ పాతుకుపోయారు.

● గతంలో పల్నాడులో.. ఇప్పుడు గుంటూరులో..

గత వైసీపీ హయాం నుంచి సదరు ఉద్యోగి ఇష్టారాజ్యంగా దోపిడీకి తెరతీశాడు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని ఇష్టారాజ్యంగా దారి మళ్లించి భారీ మొత్తంలో సంపాదించాడు. అప్పటి అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులతో మంతనాలు చేసి కీలకమైన గుంటూరు ఎంఎల్‌ఎస్ పాయింటులో పోస్టింగ్ వచ్చేలా చేసుకున్నాడని ఆరోపణలున్నాయి. కార్పొరేషన్ పరిధిలో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ అధికారులకు వాటాలు ఇవ్వడం, వారిని మంచి చేసుకోవడం ద్వారా దర్జాగా తన దోపిడీని కొనసాగిస్తున్నారు. చిత్రమేమిటంటే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అతడి హవా కొనసాగుతుండడమే. గతంలో ఉన్న సివిల్ సప్లయిస్ అధికారులను ప్రభావితం చేసిన ఈ చిరుద్యోగి.. ఇప్పుడు గుంటూరు రూరల్, తాడికొండ, పల్నాడులో కొన్ని చోట్ల ఎంఎల్‌ఎస్ పాయింట్ల లో తన అనుచరులను నియమించుకుని భారీ స్థాయిలో దోపిడీకి తెరతీశారు. ఈ నెల ఒకటో తేదీన సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్ ఇతనిని చిత్తూర బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారి సహకారంతో దాన్ని కూడా లెక్క చేయకుండా ఇక్కడే కొనసాగుతున్నారని తెలుస్తోంది.

● ప్రతి నెలా 2వేల టన్నుల స్టాక్

ప్రతి నెలా గుంటూరు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు 2 వేల టన్నుల పేదల బియ్యం వస్తుంది. కనీసం వాటిలో 5 శాతం బియ్యాన్ని ఇతను బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. నగరంలోని కాకాని రోడ్డులో ఉన్న ఒక బడా మిల్లు, ప్రత్తిపాడు రోడ్డులో ఉన్న మరో పెద్ద మిల్లులతో ఒప్పందం చేసుకుని నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచే 300 బస్తాలకు పైగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వాటి ద్వారా నెలకు రూ.7 లక్షల వరకు అక్రమ ఆదాయం సమకూరుతోందని సమాచారం. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా సదరు ఉద్యోగికి ఆస్తులు ఉన్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

42,214 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,546 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,214 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,595 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15400
273	---	----
341	10500	16500
4884	----	----
సూపర్ 10	12000	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15600
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16500
దేవనూరు డీలక్స్	11000	16600
ఆర్మూరు	10500	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16400
4884	11000	14300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	10000	16400
దేవనూరు డీలక్స్	10500	15800
తాలుకాయలు	5000	7600

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలి

● మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌వ అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్‌లో మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. కమిషనర్ ప్రజల నుంచి అందిన 20 ఫిర్యాదులు తీసుకుని, అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మేయర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 31 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వ్యర్థాలను తడి పొడిగా ఇచ్చేలా అవగాహన కల్పించాలి

నగరంలో వార్డుల వారీగా ప్రతి సచివాలయం పరిధిలో నూరు శాతం వ్యర్థాలను తడి, పొడిగా వేరుగా ఇచ్చేలా ప్రజలకు కార్యదర్శులు, కార్మికులు అవగాహన కలిగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సంగడి గుంట, ఆర్టీసీ కాలనీ, పాత బస్టాండ్, చాకలి గుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈలు హనీఫ్, వెంకట రమణ, ఎస్ఎస్ అయాజ్ ఖాన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

నిధి పోర్టల్ ద్వారా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు

గతంలో ఇచ్చిన హామీ మేరకు నిధి పోర్టల్ ద్వారా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు జరుగుతున్నందున పనులను వేగంగా చేపట్టాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సోమవారం మేయర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, డీఆర్ఎం ఆఫీస్ రోడ్డును పరిశీలించి, పనుల వేగవంతంపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ అసంపూర్తి రోడ్లు, డ్రెయిన్ల వలన ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ డీఆర్ఎం ఆఫీస్ రోడ్డు సెంట్రల్ డివైడర్‌తో పాటు డ్రెయిన్ నిర్మాణం, రోడ్డు పెండింగ్ పనులను మంగళవారం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న రవీంద్ర, పులి శ్రీనివాసులు, కూటమి నాయకులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలో హోలీ ఫుడ్, బాలీవుడ్ సెంటర్లో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె శ్రీనివాసరావు తదితరులు పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ విగ్రహం చుట్టూ ఐలాండ్ ఏర్పాటు చేసి, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో టుబాకో చైర్మన్ యశ్వంత్, బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, దర్శనపు శ్రీనివాస్, పాండురంగ విఠల్, యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, వైవీ సుబ్బారావు, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, భజరంగ్ రామకృష్ణ, తాడువాయి రామకృష్ణ, బాప్టిస్ట్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, కార్పొరేటర్ ఈ. వరప్రసాదు పాల్గొన్నారు.

విద్యార్థినుల్ని మోకాళ్లపై నిలబెట్టిన యాజమాన్యం



మోకాళ్లపై కూర్చొన్న విద్యార్థినులు

గుంటూరు (విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బాత్రూం డోర్ కొట్టినందుకు ఇద్దరు విద్యార్థినులపై పాఠశాల యాజమాన్యం దాష్టీకం నిక పాల్పడిన వైనం ఇది. దాదాపు రెండు గంటల పాటు మోకాళ్లపై నించోబెట్టి పైశాచిక ఆనందం పొందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక పట్టాభిపురంలోని జీఆర్ పబ్లిక్ స్కూల్లో మూడో తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు విరామ సమయంలో బాత్రూంకు వెళ్లేందుకు వచ్చారు. అయితే అప్పటికే లోపల విద్యార్థిని ఉంది. బాత్రూంకి వెళ్లేందుకు ఆత్రుతగా ఉండడంతో డోర్ కొట్టారు. ఈ విషయం అక్కడే ఉన్న పాఠశాలకు చెందిన మహిళా డైరెక్టర్ చూసింది. డోర్ కొట్టిన వారిని బాత్రూంకు వెళ్లనీయకుండా దూషిస్తూ దాదాపు రెండు గంటలపాటు పాఠశాల వరండాలో మోకాళ్లపై నిండోబెట్టి దాష్టీకానికి పాల్పడ్డారు. ఈ విషయం గురించి ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పింది. పాఠశాలకు వెళ్లి ప్రశ్నించిన తల్లిదండ్రులపై యాజమాన్యం దౌర్జన్యానికి దిగారు. విద్యార్థినితోపాటు పాటు మరో ఇద్దరిని పాఠశాలకు రానీయడం లేదు. విద్యార్థిని తల్లిదండ్రులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదర్శ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : కలెక్టర్

గుంటూరు సిటీ,డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద గుర్తించిన అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో ముందుగా కనీసం ఐదు గ్రామాల్లో నూరు శాతం మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి యు.చెన్నయ్య, జడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, గ్రామీణ నీటి సరఫరా విభాగ పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన వనరుల పొదుపుతో భవిష్యత్తు తరాలకు భద్రత

విద్యుత్ వంటి ఇంధన వనరులను పొదుపుగా వినియోగించటం వలన భవిష్యత్తు తరాలకు ఇంధన భద్రత అందించవచ్చని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. జాతీయ ఇంధన వనరుల పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతున్న విద్యుత్ పొదుపు వారోత్సవాల ప్రచార పోస్టర్లు ను సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసులు, సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాస బాబు, ఈఈలు హరిబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు ఉన్నారు.

నిలకడగా స్క్రబ్ టైఫస్ రోగుల ఆరోగ్య పరిస్థితి

గుంటూరు మెడికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆసుపత్రి వైద్య వర్గాలు తెలిపాయి. బుధవారం జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చిన 13 మంది జ్వర బాధితుల నమూనాలను వైద్యపరీక్షల పంపగా, మంగళగిరి, అమృతలూరుకు చెందిన ఇద్దరికి పాజిటివ్‌గా వచ్చింది. వీరిని ఐసోలేషన్‌లో ఉంచి చేర్చుకొని వైద్యం అందిస్తున్నారు.

ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● పీజీఆర్ఎస్‌కు 260 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మి కుమారితో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 260 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలన్నారు. డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, అగ్రికల్చరల్ జేడీ పద్మావతి, డీపీవో నాగసాయికుమార్, డ్వామా పీడీ శంకర్, ఆర్టీవో శ్రీహరి పాల్గొన్నారు.

● ఇన్నర్‌రింగు రోడ్డు, స్థానిక స్వర్ణభారతినగర్ 12వ లైను ఎదురుగా నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో అక్రమంగా చేపడుతున్న మసీదు నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ హిందూ చైతన్య వేదిక సభ్యులు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల వీరేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

● బుడంపాడు వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొల్లి శారద నూతన లీజుదారుల అసోసియేషన్ వ్యాపారులు అర్జీ అందజేశారు. ఈ మార్కెట్‌తో రూ. లక్షలు వెచ్చించి పాడుకున్న వ్యాపారులతో పాటు, నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం కోల్పోతుందని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాదు, రాజేంద్రప్రసాదు ఉన్నారు.

● సీసీ రోడ్డును అక్రమించి అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని అమరావతి రోడ్డు, వేళంగణీనగర్ వాసులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 32 అడుగుల ఉన్న రోడ్డును సగానికిపైగా ఆక్రమించి అనుమతులు లేకుండా ఈ నిర్మాణం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో తాడిగిరి రాజు, ఆనంద్‌బాబు, చిన్నం విలియమ్స్ తదితరులు ఉన్నారు.

● జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ సిబ్బంది లంచాల కోసం వేధిస్తున్నారని బీఎస్పీ నాయకుడు చిరతనగండ్ల వాసు అర్జీ అందజేశారు. చికిత్స, వేలిముద్ర సమయంలో అక్కడి సిబ్బంది రూ.500 వరకు వసూలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డబ్బులు ఇవ్వకపోతే రోగులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

● సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో జూట్ బోరాల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించాలని సీపీఐ నగర కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ అర్జీ అందజేశారు. జూట్ బోరాల స్వీకరణ నిలిపివేయడంతో వాటిని కుట్టే వారి జీవనోపాధి పూర్తిగా దెబ్బతిందని అన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

● చేపల వేటగా ప్రధాన వృత్తిగా ఉన్న తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో పలు మండలాలకు చెందిన యానాదులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం యానాదుల (గిరిజన) యూత్ ఫేడరేషన్ అధ్యక్షుడు యందేటి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గుర్తింపు కార్డులు లేకపోవడంతో దళారులకు డబ్బులు ఇచ్చి చేపల వేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావూరి గోపి, కొమరగిరి మరియమ్మ, పొట్లూరి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక పొట్టి శ్రీరాములు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు, భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, 'అమరజీవి' పొట్టి శ్రీరాములు అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా సోమవారం నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా ఆయన నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచిన నిజమైన గాంధేయవాది అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, కార్పొరేటర్లు పోతురాజు సమత, సిటీ బస్ బాబు, కొనకళ్ళ సత్యం, కొత్తూరి వెంకట్, పోతురాజు చంద్రశేఖర్, దేవళ్ళ వెంకట్, మండవ శ్రీనివాస్, బాబురావు, ఆర్వేపల్లి శ్రీనివాస్, చైతన్య, శేషగిరి పాల్గొన్నారు.

● గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం 54 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని చెప్పారు.

● గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని, అటువంటి నిస్వార్థ వ్యక్తుల త్యాగాలను నేటి తరానికి తెలియచేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో, హిందూ కళాశాల సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాష, జిఎంసి ఉద్యోగులు పాల్గొన్నారు.

● గుంటూరు సిటీ, డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం, త్యాగం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం జరిగిందని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు మాట్లాడుతూ అమరజీవి త్యాగం ఫలితమే ఆంధ్రుల ఆత్మ గౌరవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు నిర్మల భారతి, అన్ని సెక్షన్‌ల ఏఓలు పాల్గొన్నారు.

● గుంటూరు (విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఆమరణ దీక్ష చేసి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు నేటితరం విద్యార్థులు యువత గ్రహించాలని గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేషా ప్రభాకరరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి నగదు బహుమతులు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బచ్చు వెంకట కామేశ్వరరావు, గేల్లా రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ, కార్యదర్శులు పాదర్తి వెంకట్రావు, వేమూరి వెంకట కామేశ్వరరావు, కోశాధికారి అచ్యుత నిరంజన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చుండూరు దామోదర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతలపాటి వేణుగోపాలరావు ఉపాధ్యాయులు, తదితరులకు పాల్గొన్నారు.

చిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదు : గాదె

గుంటూరు మెడికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం గుంటూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగర అభివృద్ధికి అనునిత్యం పాటుపడుతున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు అభ్యంతరకరంగా విమర్శలు చేయడం సరికాదని గాదె హితవు పలికారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వివిధ కంపెనీల నుంచి భారీగా నిధులు తెచ్చి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి పెమ్మసాని చేస్తున్న కృషి అంబటి రాంబాబుకు కనిపించడం లేదా అని గాదె నిలదీశారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు శిఖా బాలు, చట్టాల త్రినాథ్, సిగిరిగి శ్రీనివాసరావు, కొండూరు కిషోర్, యడ్ల వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి సుబ్బారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఆర్‌డబ్ల్యూఎల్‌లో రైల్వే సీసీటీసీ ప్రతిభ

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జరిగిన అఖిల భారత రైల్వే వెయిట్‌లిఫ్టింగ్ 72వ ఛాంపియన్‌షిప్025-26లో గుంటూరు రైల్వే సీసీటీసీ ఏ శివరామకృష్ణయాదవ్ విశేష ప్రతిభ కనబరిచారు. 88 కిలోమీటర్ల విభాగంలో బరిలోకి దిగిన ఆయన వెండి పతకం సాధించి గుంటూరు డివిజన్‌కు కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. సోమవారం ఆయన్ని డీఆర్ఎం సుధేష్ణ సేన్ తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన విశ్వబ్రాహ్మణల అభ్యున్నతికి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు కృషి చేయాల్సిన అవసరముందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో సోమవారం ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో కొత్తపల్లి సీతారామాచార్యులు, నక్క సుధాకరరావుల సారథ్యంలో వెలువడిన సృజనకార్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు మైనర్ బాలురు అదృశ్యమయ్యారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న బజార్, మటన్ బాబు షాపు దగ్గర నివాసముండే అన్వర్ సిద్ధిక్ సయ్యద్ అలియాస్ అన్వర్ బాషా పెద్ద కుమారుడు అబ్దుల్ రెహమాన్ బాషా సయ్యద్ అలియాస్ అబ్బు (16) అదృశ్యమయ్యాడు. ఇతను మిర్చి యార్డు ఎదురుగా గల భవానిపురంలో ఉన్న సభ్యులు సబీలుల్ హుదా అరబిక్ మదరసా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అలాగే నరసరావుపేటకు చెందిన షేక్ జానీ బాషా పెద్ద కుమారుడైన షేక్ జావెద్ (13) అదే మదరసాలో చదువుకుంటూ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించాలి : జిల్లా

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించనున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించాల్సిన బందోబస్తు విధుల గురించి ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ కేంద్రాన్ని ఎస్పీ సందర్శించి, సీసీ కెమెరాల అమరికలు, పని తీరును పరిశీలించారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, రవికుమార్, హనుమంతు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఇతర డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో లక్ష్మీనారాయణరావు అంత్యక్రియలు

గుంటూరు డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ వెల్లంకి లక్ష్మీనారాయణరావు అంత్యక్రియలు స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో సోమవారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు ముగిశాయి. ముందుగా పార్థివదేహాన్ని ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు, విశ్రాంత డీజీపీ డాక్టర్ మాలకొండయ్య, సంఘం ఉపాధ్యక్షుడు, విశ్రాంతి ఐజి ఏ రవిచంద్ర, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశ్రాంత అడిషనల్ ఎస్పి కాళహస్తి సత్యనారాయణ, కోశాధికారి కె.వి నారాయణ, విశ్రాంత ఎస్పీలు భూపాల్ సింగ్ ఎన్ ఎస్ ప్రసాద్, (వైజాగ్) విశ్రాంతి డిఎస్పీలు బోయపాటి వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, బీరం నాగేశ్వరరావు అధికారులు పుష్పగుచ్ఛాలను సమర్పించి నివాళులర్పించారు. ఆధ్యాత్మికవేత్త బొల్లేపల్లి సత్యనారాయణ, విశ్రాంత ప్రొఫెసర్ కెవి రాయుడు, మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, కార్పొరేటర్ వేములపల్లి బుజ్జి తదితరులు పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. కాగా లక్ష్మీనారాయణరావు మృతికి మాజీ డీజీపీ జేవి రాముడు, మాజీ ఐజిపి డాక్టర్ సిఆర్ నాయుడు, గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు.

బస్టాండ్ వద్ద హోంగార్డుపై దాడి

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట విధి నిర్వహణలో ఉన్న ఓ హోంగార్డుపై మద్యం మత్తులో ఓ యువకుడు దాడి చేసిన సంఘటనపై సోమవారం పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళదాస్‌నగర్‌కు చెందిన రవికుమార్ మద్యం మత్తులో బైక్‌ను అడ్డదిడ్డంగా పోనిస్తుండగా వారించిన హోంగార్డు శ్యాంపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపడిచాడు. హోంగార్డు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జియావుద్దీన్ నగర్‌లో ఘర్షణ

జియవుద్దీన్ నగర్‌లో శివాలయంలో జొరబడ్డ ముగ్గురు యువకులు ఆలయంలో అసభ్యకరంగా ప్రవర్తించటంపై ఘర్షణ జరిగింది. స్థానికులు ముగ్గురు యువకులను పట్టుకుని పాతగుంటూరు పోలీసులకు అప్పగించారు. దుర్గారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



కొసరాజు సర్వ లభ్య రచనల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న గరికపాటి నరసింహారావు, సినీ నటుడు సుమన్, డాక్టర్ తోటకూర ప్రసాదు, గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రి తదితరులు

పాటల తోటమాలి....డాక్టర్ కోసరాజు

● ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు పాటకు కొత్త సొగసులు దిద్ది...కొత్త మెరుపులు దిద్ది...పడుచుతనంతో పరుగులు తీయించిన పాటల తోటమాలి డాక్టర్ కొసరాజు రాఘవయ్య చౌదరి అని ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక జెకేసీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక, మనసు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య పరిశోధకుడు పారా అశోక్ కుమార్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న కొసరాజు సర్వలభ్య రచనల సంకలనం పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. తొలుత కొసరాజు జీవిత మాలికపై ఫోటో ఎగ్జిబిషన్ అతిథుల చేత ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గరికపాటి మాట్లాడుతూ ఆయన పాటల్లో తెలుగు జానపదాలు, గ్రామీణ జీవనశైలి, వ్యంగ్యం, సామాజిక స్పృహ గోచరిస్తాయని అన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రి మాట్లాడుతూ డాక్టర్ కొసరాజు రచనలు తమలాంటి వారికి స్ఫూర్తిదాయకమన్నారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఎద్దుల సేవను వర్ణించే కొసరాజు పాటలు తెలుగు వారి హృదయాలను హత్తుకున్నాయని అన్నారు. మనసు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మన్నం వెంకటరాయుడు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా మూడు కోట్ల పేజీల సాహిత్యాన్ని రచనలను డిజిటలైజేషన్ చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ తోటకూర ప్రసాదు మాట్లాడుతూ తెలుగు సాహిత్య వెలుగులను ప్రపంచానికి తెలిపేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముందు సైదా ఆర్కెస్ట్రా వారి కొసరాజు పాటల సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పత్తిపాటి దేవాక్షమ్మ, చలసాని అనురాధ, కస్తల పద్మ, డాక్టర్ కొసరాజు కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిపై దుర్మార్గపు వ్యాఖ్యలా?

● అంబంటి రాంబాబు, వైసీపీ నేతలకు ఎమ్మెల్యే నసీర్ సూటి ప్రశ్న

గుంటూరు, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాదిన్నర కాలంలోనే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు దుర్మార్గపు వైసీపీకి కనిపించడం లేదా అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి గురించి అంబటి రాంబాబు మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం ఒక చరిత్రాత్మకమని స్పష్టం చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం గుంటూరు నగర ప్రజల 30 ఏళ్ల కల అని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో విధ్వంసం చేసిన వైసీపీ పాలకులకు ఇది అర్థం కాదని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ అయితే జగన్ విధ్వంసం అని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు.

నాయకులను తయారు చేసే కర్మాగారం తెలుగుదేశం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి పునాదిగా నిలుస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ కలిగిన నాయకులను తయారు చేసే కర్మాగారంలా పని చేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో సోమవారం ఆమె 23, 28 డివిజన్ల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్లు మేళం సైదయ్య, తన్నీరు కృష్ణ, లాంవర్థన్, ఏపీ యాదవ్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు పంగనామాలు.. నేడు కోటి సంతకాల నాటకం

వైద్య కళాశాలల నిర్మాణంపై పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమం కేవలం రాజకీయ కుట్రలో భాగమేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. పశ్చిమ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు పంగనామాలు పెట్టి నేడు కోటి సంతకాల పేరుతో నాటకాలకు వైసీపీ నేతలు తెరలేపారని ఆమె విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాల వేగం, సంక్షేమ పథకాల వెల్లువ, పెట్టుబడుల అనుకూల వాతావరణంతో పరిశ్రమలు రాష్ట్రం వైపు క్యూ కడుతుండడం చూసి తట్టుకోలేని జగన్ తప్పుడు ప్రచారంతో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ప్రపంచమంతా పీపీపీ మోడల్‌ను అనుసరిస్తుంటే జగన్ మాత్రం అడ్డుకొని రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారన్నారు.

అంబటి ఒక కామెడీ పీస్ : దేగల



దేగల ప్రభాకర్

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరును గుంతలూరుగా మార్చిన ఘనత వైసీపీదేనని ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ విమర్శించారు. టీడీపీ నగర కార్యాలయంలో సోమవారం దేగల ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరం అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. ఒక్కరోజులోనే అభివృద్ధి జరుగుతుందని వైసీపీ హేళన చెయ్యడం సిగ్గు చేటు అని అన్నారు. అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వర్ణించినట్టు ఉందన్నారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారన్నారు.16 లక్షల కోట్లు రూపాయల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కు తెచ్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్‌కు దక్కుతుందన్నారు. గతంలో వైసీపీ నాయకులు గంజాయిని పెంచి పోషించారు అని దుయ్యబట్టారు.

ఆకట్టుకున్న పిరదౌసి కావ్యగానం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మెట్టు శేషమ్మ, మెట్టు చిన్న మల్లారెడ్డి బిఈడి కళాశాల, విశ్వనాథ సాహిత్య అకాడమీ, ఈశ్వర వరప్రసాద పరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మహాకవి జాషువ రచించిన పిరదౌసి కావ్యంలోని పద్యగానం జరిగింది. జనచైతన్య అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ రంగస్థల రచయిత, దర్శకుడు ఆనందరావు, మస్తానయ్య, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన గుంటూరుజిల్లా, పొన్నూరు (మం), తెలగపాలెం, డోర్.నెం.25-1-26/1 కాపురస్తురాలు కోట వీర కిషోర్ గారి భార్య నాగ జయేశ్వరి గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయుది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ది.30-04-1986న పార్టీషన్ దస్తావేజు నెం.8699/1986 గుంటూరు ఆర్.ఓ.లో రిజిస్టర్ కాబడిన రీత్యా కాళంరాజు సీతారావమ్మ గారి వాటాకు రాబడిన ఎ-షెడ్యూలు దాఖలా ఆస్తి ఆమె వారసులు అయిన కాళంరాజు గోపాలకృష్ణ మూర్తి వగైరాలకు సంక్రమించినదని అట్టి ఆస్తిని అమ్ముటకు బహిరంగ పరచగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి యున్నారు.కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు, కోర్టు జప్తులు, ఇతర క్లయిములు, లావాదేవీలు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 15 రోజుల లోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖితపూర్వకంగా తెలియజేయగలరు. గడువు లోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టి అభ్యంతరములు రాని యెడల నిష్ఫేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సదరు కాళంరాజు సీతారావమ్మగారి వారసుల నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నాక్లయింటు హక్కులను గాని బైండుచేయ జాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥ &సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలో చేరిన నగరంపాలెం, సంపత్‌నగర్ లోని మున్సిపల్ పాతవార్డు నెం.16రు, బ్లాకు నెం.4రు,టి.యస్.నెం.660, 666, 673ర్లు బాపతు చ.గ.215లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు:తూర్పు:**మున్సిపల్ రోడ్డు హద్దు, **దక్షిణం:** షెడ్యూలు దాఖలా డాబా యింటి గోడ నుండి దక్షిణపు వైపు తూర్పు పడమరల బారున అ.4 లు వెడల్పు గల, షెడ్యూలు దాఖల స్థలము, సదరు స్థలమునకు దక్షిణం కాళంరాజు రాఘవేంద్రరావు వాటాకు రాబడిన యిల్లునకు హద్దు, **పడమర:**రామనామ క్షేత్రం వారి స్థలము హద్దు, **ఉత్తరం:**కాళంరాజు పట్టాభిరామయ్య గారి స్థలము హద్దు.


వనుకూరి వెంకట సుబ్బారెడ్డి, అడ్వకేట్
విద్యానగర్, 1వ లైను, గుంటూరు. సెల్ : 9177646766

సంక్రాంతికి సై


తెల్ల నెమలి




కోడి పుంజుకు డ్రైఫ్రూట్స్‌తో సిద్ధం చేసిన బలవర్ధకమైన ఆహారం


గౌడ నెమలి

- పందేలకు సిద్ధమవుతోన్న పుంజులు
- ఆహారంగా మటన్, డ్రైఫ్రూట్స్.. ప్రత్యేక శిక్షణ
- పందెం కోళ్లకు పెరిగిన గిరాకి

కోడి పందేలకు కుక్కుటి శాస్త్రం

పందెం రాయుళ్లు కోడిని పందెనికి దించే ముందు కుక్కుటి శాస్త్రాన్ని అనుసరిస్తారు. పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి ఆ రోజున ఏ రంగు పుంజుతో పందెం వేయాలో నిర్ణయిస్తారు. భోగి రోజున గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు గెలుపొందుతాయని, సంక్రాంతి రోజున యాసర కాకి డేగలు, కాకి నెమలిలు, పసిమగల్ల కాకులు, కాకి డేగలు, కనుమ రోజున డేగలు, ఎర్రకాకి డేగలు గెలుపొందుతాయని వారు నమ్ముతారు.

రేపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ఎంతో ఇష్టమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగ అంటేనే కోడి పందేల రాయుళ్లకు ఎక్కడ లేని జోష్ వస్తుంది. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా వారివారి పందెం కోళ్లను పందెం రాయుళ్ల పోటీల కోసం సిద్ధం చేస్తున్నారు.

● అయిదు నెలల ముందు నుంచే శిక్షణ

కోడి పుంజులకు అయిదు నెలల ముందు నుంచి రూ.లక్షలు ఖర్చు పెట్టి శిక్షణ ఇస్తారు. మటన్, డ్రై ఫ్రూట్స్ వంటి బలమైన ఆహారం పెట్టి వాటిని పెంచుతారు. నిత్యం ముగ్గురు పందెం కోళ్ళ సంరక్షణను చూస్తుంటారు. ఉదయాన్నే అయిదు గంటల కల్లా కోడి పుంజులను బయటకు తీసి కాసేపు చల్లటి ఫైరు గాలిలో తిప్పుతారు. అనంతరం చుట్టూ వలయం ఏర్పాటు చేసి కోడి పుంజులను దాంట్లోకి వదిలి పరుగెత్తిస్తారు. వాటిలో పేరుకుపోయిన కొవ్వును బయటకు తీసి స్విమ్మింగ్ చేయిస్తారు. వాటికి ఆహారంగా పాలల్లో నానబెట్టిన బాదం పప్పు, పిస్తా పప్పు, ఖర్జూర, కిస్‌మిస్‌లను మటన్‌కీమాను పెట్టి సిరంజి ద్వారా పాలను పట్టిస్తారు. ఒక్కోపుంజుకు రోజుకు వంద నుంచి రూ.700 వరకు ఖర్చు చేస్తారు.

ఒక్కో పందెం కోడి శిక్షణకు రూ.లక్షల్లో ఖర్చు

పందేనికి తయారయ్యే పుంజులకు రూ.50 వేల నుంచి రూ.లక్షకుపైనే ఖర్చు చేస్తారు. వీటికి బలమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షకుడిని నియమిస్తారు. ఓ కోడిని పూర్తిస్థాయిలో పందేనికి సిద్ధం చేయాలంటే రూ.లక్ష నుంచి రెండు లక్షలకు పైనే ఖర్చు అవుతుందని శిక్షకులు చెబుతున్నారు. కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు ఉంటాయి. వీటిల్లో తెల్ల నెమలి, గౌడ నెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎంతటి పందేన్నయినా సులువుగా నెగ్గుతాయి. ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో ఒక్కో పుంజు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ధర పలుకుతోంది.


సిద్ధం చేసిన బాదం, పిస్తాపప్పు


కోడి పుంజుకు ఆహారంగా మటన్‌తో కలిపిన డ్రైఫ్రూట్స్ తినిపిస్తూ..


పాకలో కోడిపుంజుల సంరక్షణకు సిద్ధం చేసిన డేరాలు


ఎర్రడేగ


నల్ల కక్కెర


కాకి డేగ


కోడిపుంజుకు నీటిలో శిక్షణ

నమూనాగా తెనాలి తహసీల్దార్ కార్యాలయం

● ఐఎస్‌వో ధ్రువీకరణ అందడం అరుదైన గౌరవం ● తహసీల్దార్ గోపాలకృష్ణ, దాతల కృషి అభినందనీయం ● కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి నాదెండ్ల

తెనాలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధునికీకరించిన తెనాలి తహసీల్దార్ కార్యాలయం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, అన్ని శాఖల అధికారులకు ఒక నమూనాగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉన్న తరుణంలో ప్రభుత్వం నుంచి నిధుల కోసం ఎదురు చూడకుండా దాతల సహకారంతో 1882 నాటి ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దటం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. రూ. కోట్లు ఖర్చుపెట్టి విలాసవంతమైన ఇళ్లు నిర్మించుకుంటున్న అధికారులు కనిపిస్తున్న ఈ రోజుల్లో విధి నిర్వహణ శాశ్వతం కాదని తెలిసి కూడా ఒక మంచి సంకల్పంతో ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన తహసీల్దార్ గోపాలకృష్ణ అధికారులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. తెనాలి తాలూకా ప్రాంగణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం 1882లో నిర్మించినది కావటం, దీంతోపాటు మరో రెండు భవనాలు రెండు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావటంతో అవి శిధిల స్థితికి చేరాయి. వాటిని దాతల సహకారంతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ 8 నెలల నుంచి మరమ్మతులు చేయించి, ఆధునికీకరించారు. ఈ భవనాలను సోమవారం మంత్రి మనోహర్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, గుంటూరు జేసీ అశుతోష్ శ్రీవాత్సవ, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తర్వాత జరిగిన అభినందన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, ఒక అధికారి స్వలాభం ఆశించకుండా మంచి ఆలోచనతో సంకల్పిస్తే అద్భుతాలు జరుగుతాయనడానికి తెనాలి తహసీల్దార్ కార్యాలయ భవనం ఒక ఉదాహరణ అవుతుందన్నారు. ఆయన ఆలోచనకు దాతలు ముందుకొచ్చి సహకారం అందించటం గొప్ప విషయమన్నారు. కార్యాలయానికి వచ్చే జనాలకు అవసరాలు ఏమున్నాయనేది గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించడం మంచి ఆలోచన అని అన్నారు. ముఖ్యంగా చంటి పిల్లలకు పాలిచ్చే తల్లులకు ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

● కార్పొరేట్‌కు దీటుగా కార్యాలయం: జేసీ

రాష్ట్రంలో ఏ కార్యాలయం ఈ తరహా ఆధునిక హంగులతో ఉండటం చూడలేదని జేసీ శ్రీవాత్సవ చెప్పారు. తన సర్వీసులో ఈ తరహా ప్రభుత్వ కార్యాలయాన్ని చూడటం ఇదే మొదటిసారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా కార్యాలయాన్ని తీర్చిదిద్దినందుకు గోపాలకృష్ణ అభినందనీయులన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా ఆశించకుండా దాతల సహకారంతో ఇంతటి పనిని పూర్తిచేయడం మామూలు విషయం కాదన్నారు. అనంతరం దాతలు సూర్యదేవర భువన్‌కుమార్, మొవ్వా సత్యన్నారాయణ, నలజాల లోకేష్, న్యాయవాది కుమారస్వామి, తదితరులను మంత్రి మనోహర్, జేసీ శ్రీవాత్సవ, సబ్ కలెక్టర్ సంజనా సింహాను సత్కరించారు. హైదరాబాద్ ఐఎస్‌వో కార్యాలయం నుంచి వచ్చిన ఆ సంస్థ ఆడిటర్ డాక్టర్ రామాంజనేయులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలకు గుర్తింపుగా ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రిటైర్డ్ ఆర్డీవో ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన తీరును పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఐజీ త్రిపాఠి, జేసీ శ్రీవాత్సవ

మొదలైన ఏకీకృత సర్వే

● డిసెంబరు 15 నుంచి జనవరి 12 వరకు నిర్వహణ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా సమగ్ర డేటా (సమాచారం)ను సేకరించేందుకు ఏకీకృత కుటుంబ ప్రయోజనాల సర్వే ప్రారంభించింది. డిసెంబరు 15 నుంచి జనవరి 12వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

● పథకాలు దరి చేర్చేందుకు..

ప్రజల వాస్తవ అవసరాలు ఏమిటో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోంది. అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేదో తెలుసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఈ సమాచారం ఉపయోగ పడుతుందని భావిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించటం ద్వారా సంబంధిత కుటుంబానికి ప్రభుత్వ పథకం పొందేందుకు అర్హత ఉందా లేదా అన్న విషయం కూడా తెలుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మొబైల్ యాప్ ద్వారా జరగనున్న ఈ సర్వే ద్వారా వంద శాతం ఈ-కేవైసీని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు.

● ఆదాయం.. ఆస్తులు పక్కా..

నూతన సర్వేలో ఆ గ్రామంలో నివసిస్తున్న వ్యక్తికి ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి. ఆదాయం ఎంత, అసలు ఏమి చేస్తారు అనే సమాచారం పక్కాగా సేకరిస్తారు. సమాచారం దాచి పెట్టటం లేదా చెప్పకపోవటం వల్ల సంబంధిత వ్యక్తులకే నష్టం జరుగుతుందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి అడగవలసిన ప్రశ్నల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

● కుటుంబ సమగ్ర సమాచారం కోసం



గతంలో జరిగిన హౌస్ హోల్డ్ సర్వేలో అనేక వివరాలు లేవు. ప్రస్తుతం జరగనున్న ఏకీకృత కుటుంబ ప్రయోజనాల సర్వేలో జిల్లాలోని ప్రతి కుటుంబం పూర్తి వివరాలు ఉండేలా ప్రశ్నవలి రూపొందించారు. ఈ సర్వే వల్ల దారిద్ర్య రేఖకు దిగువన ఎన్ని కుటుంబాలు ఉన్నాయి అనే సంఖ్య పూర్తిగా తెలుతుంది. కాబట్టి ప్రజలు గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందికి పూర్తిగా సహకరించి ఈ సర్వేలో పాల్గొనాలి. వారు అడిగిన సమాచారం తెలియజేయాలి.

-చొప్పర కృష్ణ, జిల్లా సచివాలయాల అధికారి, గుంటూరు

గుంటూరులో ఓఆర్ఆర్ ఆమోదం

(5వ పేజీ తరువాయి)

సూచించింది. ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ ప్రాజెక్టుకి గుంటూరు జిల్లాలో కాంపిటెంట్ అథారిటీ అయిన జాయింట్ కలెక్టర్ అశోతోష్ శ్రీవాస్తవకు నివేదించాలని కోరింది. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది. అభ్యంతరాలపై జేసీ విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకొంటారని స్పష్టం చేసింది.

నెల క్రితం పల్నాడు జిల్లాలో అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దానికి కొనసాగింపుగా గుంటూరు జిల్లా గజిట్‌ని కేంద్ర ప్రభుత్వం న్యూఢిల్లీలో విడుదల చేసింది. గుంటూరు జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో భూసేకరణ చేయాల్సి ఉంది. మొత్తం 39 గ్రామాల మీదగా ఈ ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుండటంతో ఎన్‌హెచ్‌ఏఐ ఇచ్చిన అలైన్‌మెంట్ ఆధారంగా సర్వే నంబర్లు, అందులో ఎంత భూమి సేకరించేది, భూమి కేటగిరి, స్వభావం వంటి వివరాలను గజిట్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది. కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ ప్రకటించడంతో రెండు, మూడు రోజుల్లోనే ఎన్‌హెచ్‌ఏఐ పీఐయూ అమరావతి విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్‌ని ప్రచురించనుంది. గుంటూరు జిల్లాలో 4,763 సర్వే నంబర్లలో సుమారుగా 5,789 ఎకరాల భూమిని సేకరించనున్నారు.

త్వరలోనే భూసేకరణ కార్యాలయం ఏర్పాటు

ఈ భూసేకరణ ప్రాజెక్టు ఎంతో కీలకమైంది కావడంతో త్వరలోనే గుంటూరు కలెక్టరేట్‌లో భూ సేకరణ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. జాయింట్ కలెక్టర్ కాంపిటెంట్ అథారిటీగా వ్యవహరిస్తారు. ఈ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఇతర సిబ్బందిని పోస్టింగ్ చేస్తారు. భూసేకరణ ప్రక్రియలన్నీ ఈ కార్యాలయమే చూసుకొంటుంది. నష్టపరిహారం చెల్లింపు, కోర్టు వివాదాలు వంటివి పర్యవేక్షిస్తుంది.

మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్

● చిలకలూరిపేట హైస్కూలుకు కంప్యూటర్ల బహూకరణ ● పాఠశాలలో అధునాతన స్కిల్ ల్యాబ్ ప్రారంభం

చిలకలూరిపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల చిలకలూరిపేట పర్యటన సందర్భంగా జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఆయన పర్యటించి పది రోజులైనా కాకముందే పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.25 లక్షల సొంత నిధులతో 25 కంప్యూటర్లు, రివాల్వింగ్ కుర్చీలు, పుస్తకాలు, వాటిని పెట్టుకోవడానికి ర్యాక్‌లు పంపారు. వాటిని సోమవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ ఎంవీ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా విద్యార్థులకు అందజేశారు. అనంతరం హైస్కూల్‌లో 25 కంప్యూటర్ల అధునాతన స్కిల్ ఎడ్యుకేషన్ ల్యాబ్‌ను, లైబ్రరీని వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లైబ్రరీని బహు భాషా పుస్తకాలతో నింపేశారు. చిన్నారుల కోసం పెద బాలశిక్ష నుంచి కాశీ మజిలీ కథల వరకు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు, బహుభాషా ప్రావీణ్యాన్ని పెంచే విధంగా స్పోకెన్ ఇంగ్లీష్, హిందీతోపాటు తమిళం, కన్నడ, ఒడియా తదితర భాషల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ, మాట ఇస్తే నిలుపుకునే నాయకుడిగా పవన్ కల్యాణ్ పేరు పొందారని, ఆయన గొప్పతనం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని అన్నారు. హైస్కూల్ విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులు నేర్పేందుకు త్వరలోనే ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థి కె.సునీల్ తాను స్వయంగా గీసిన జిల్లా కలెక్టర్ చిత్రాన్ని కలెక్టర్‌కు అందజేశాడు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, హైస్కూల్ హెచ్‌ఎం రత్న జ్యోతి, విద్యా కమిటీ ఛైర్మన్ పిల్లి ధనలక్ష్మి, జనసేన నాయకులు తోట రాజారమేష్, మండలనేని చరణ్ తేజ పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ పంపిన కంప్యూటర్లను ఉపయోగిస్తున్న విద్యార్థులు


కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ ఎంవీ కృష్ణతేజ, కలెక్టర్ కృతికా శుక్లా

కౌలు కష్టమే..!

(5వ పేజీ తరువాయి)

నిరంతరం ప్రక్రియని వ్యవసాయశాఖ చెప్పడం గమనార్హం. సీజన్‌లు వెళ్లిపోయాక తమకు సీసీఆర్ కార్డుల జారీ చేసి ఏం ప్రయోజనం అని కౌలు రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇంకా లక్ష్యాలు చేరుకోలేదు...

ఈ ఆర్థిక సంవత్సరానికి బాపట్ల జిల్లాలో లక్ష సీసీఆర్ కార్డులు కౌలు రైతులకు అందించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 68 వేల కార్డుల జారీతోనే సరిపెట్టింది. గుంటూరు జిల్లాలో 55 వేలు, పల్నాడు జిల్లాలో 68 వేలు కౌలు కార్డుల మంజూరు లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 70 శాతం జారీకే యంత్రాంగం పరిమితమైంది. గత ప్రభుత్వంతో పోలిస్తే కార్డులు అందించే విషయంలో దాదాపు రెట్టింపు లక్ష్యాలను ప్రస్తుత పాలకులు నిర్దేశించారు. భూ యజమానులకు గ్రామాల వారీగా అవగాహన సదస్సులు అపోహలను తొలగించాలని ప్రభుత్వం సూచించింది. సీసీఆర్‌ కార్డు రెన్యువల్ గడువు దాటి నెలలు గడుస్తున్నా, తమకు కార్డు జారీ చేయలేదని కౌలు రైతులు అంటున్నారు. కార్డుల జారీకి ముగింపు గడువు లాంటిదేమి ఉండదనేది యంత్రాంగం మాటగా ఉంది.

తెలుసుకుందాం

కాఫీ ఇలా తాగాలి

ఉదయం నిద్ర లేవగానే కాఫీ తాగనిదే మనకు రోజు మొదలవదు. అయితే ఆ కాఫీని ఎలా తయారు చేసుకుంటున్నాం? డికాక్షన్‌కు పాలు, చక్కెర కలిపి తాగితే, కాఫీ ప్రయోజనాలు అందే అవకాశం ఉండదు. కాఫీలోని మహత్తర ప్రయోజనాలు దక్కాలంటే ఇదిగో ఇలా తాగాలి

కప్పు కాఫీలో 220 నుంచి 250 మిల్లీగ్రాముల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అలాగే కాఫీ రకాన్ని బట్టి 15 నుంచి 325 మిల్లీగ్రాముల క్లోరోజెనిక్ ఆమ్లాలు కూడా ఉంటాయి. అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ అలర్జిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలున్న ఫెర్యూలిక్ ఆమ్లం కూడా కాఫీలో ఉంటుంది. ఈ గుణాలకు తోడు మరిన్ని ఆరోగ్యకరమైన పోషకాలను శరీరానికి అందించాలనుకుంటే, బ్లాక్ కాఫీకి ఇంకొన్ని పదార్థాలు అదనంగా జోడించుకోవాలి. అవేంటంటే...



సోయా లేదా బాదం: సోయా పాలలో గుండె, మూత్రపిండాలు, కాలేయాల ఆరోగ్యాలకు తోడ్పడే సహజసిద్ధ కాంపౌండ్స్ ఉంటాయి. బాదం పాలలో గుండెకు మేలు చేసే మోనోశాచురేటెడ్ కొవ్వులుంటాయి. కాబట్టి ఈ రెండింట్లో ఏదో ఒకదాన్ని బ్లాక్ కాఫీలో కలుపుకోవాలి

దాల్చిన చెక్క: రక్తంలోని చక్కెరను నియంత్రించి, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం దాల్చిన చెక్కకు ఉంటుంది. కాబట్టి బ్లాక్ కాఫీలో కొద్దిగా దాల్చిన చెక్క పొడిని కలుపుకోవాలి

కోకో పౌడర్: దీన్లోని క్యాటెచిన్స్, ప్రొసయానిడిన్స్ అనే పాలీఫెనాల్స్ మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి గుండెకు మేలు చేస్తాయి.పాలీఫెనాల్స్ పేగుల్లోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారి పేగుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది

ఎమ్‌సిటి ఆయిల్: మెదడు పనితీరును మెరుగుపరిచి, ఏకాగ్రతను సమకూరుస్తుంది. కొబ్బరి, పామ్ నూనెల నుంచి సేకరించే ఈ ఎమ్‌సిటి నూనె, పేగుల్లో కాఫీ అరుగుదలను, పోషకాల శోషణను పెంచుతుంది.

అధ్యయనం

నిద్రతో దీర్ఘాయుష్షు



ఆహారం, వ్యాయామం, ఒత్తిడి లేని జీవితం... దీర్ఘాయుష్షుకు దోహదపడతాయని ఇప్పటివరకూ భావించాం. కానీ కంటి నిండా నిద్ర, ఆయుష్షును పెంచుతుందనే ఒక అధ్యయనం ఇటీవల 'స్లీప్ అడ్వాన్సెస్' అనే జర్నల్‌లో ప్రచురితమైంది.

సగటున ఏడు గంటలకంటే తక్కువ సమయం పాటు నిద్రపోయే వాళ్ల ఆయుష్షు 7 నుంచి 9 గంటలు నిద్రపోయేవాళ్ల ఆయుష్షు కంటే తక్కువగా ఉంటున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. నిద్రలేమి గుండె ఆరోగ్యాన్నీ, వ్యాధినిరోధకశక్తినీ, శరీరం శక్తిని ఖర్చు చేసే తీరునూ, మెదడు ఆరోగ్యాన్నీ కుంటు పరచడమే ఇందుకు ప్రధాన కారణం. నిద్ర కేవలం శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. ఇదొక భౌతిక అవసరం. నిద్ర తగ్గినప్పుడు, మెదడు పనితీరు కుంటుపడడం వల్ల అల్జీమర్స్‌కు గురయ్యే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ప్రతి రాత్రీ 7 నుంచి 9 గంటలకు తగ్గకుండా కంటి నిండా నిద్రపోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి రోజూ ఒకే సమయానికి నిద్రకు ఉపక్రమించడం, చీకటి పడిన తర్వాత కాఫీలకు దూరంగా ఉండడం, నిద్రకు ముందు స్ర్కీన్ సమయాన్ని తగ్గించడం, రాత్రి భోజనం మితం చేయడం, నిద్రపోయే గది, పడక సౌకర్యంగా ఉంచుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా కంటి నిండా నిద్రపోగలిగే వీలుంటుంది.



చలి... చర్మాన్ని ఇబ్బంది పెడుతుంది. మరీ ముఖ్యంగా పొడిచర్మం కలిగిన వాళ్లనూ, ముందు నుంచే చర్మ సమస్యలున్నవాళ్లనూ ఈ కాలం అసౌకర్యానికి లోను చేస్తుంది. కాబట్టి ఈ కాలంలో చర్మ రక్షణ చర్యలు తప్పనిసరి అంటున్నారు చర్మ వైద్యులు.

మాయిశ్చరైజర్ మాత్రలు

తీవ్రమైన పొడి చర్మం కలిగిన వాళ్లకు ఇప్పుడు ఓరల్ మాయిశ్చరైజర్లు కూడా అందుబాటులోకొచ్చాయి. ప్రత్యేకించి చలికాలంలో మాత్రల రూపంలోని ఈ మాయిశ్చరైజర్లను వాడుకోవాలి.

ఎన్నిసార్లు?

చలికాలం ఉదయం, రాత్రి.. రెండు సార్లు మాయిశ్చరైజర్ వాడితే సరి పోదు. స్నానం చేసిన వెంటనే ఒంటి మీద తడి ఆరేలోగా మాయిశ్చరైజర్ పట్టించాలి. అలాగే అవసరాన్ని బట్టి మాయిశ్చరైజర్‌ను ఎన్నిసార్లైనా అప్లై చేసుకోవచ్చు. తీవ్రమైన పొడిచర్మం కలిగిన వాళ్లు, ఎక్కువగా పొడిబారిపోయే శరీర భాగాల్లో రోజుకు పదిసార్లు మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవచ్చు.

స్కిన్ కేర్

చలికి చర్మం చెక్కుచెదరకుండా...

చలికాలంలో చర్మంలోని తేమ మొత్తం ఆవిరైపోయి పొడిబారిపోయి, చిట్లిపోతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా వాతావరణానికి బహిర్గతమయ్యే ముఖం, చేతులు, పాదాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. పిల్లలు, వృద్ధులు, చర్మ సమస్యలున్న వారికి ఈ కాలంలో ఇబ్బందులు మరింత ఎక్కువ. ముఖ్యంగా చలికాలం ప్రారంభంలో చల్లని వాతావరణానికి చర్మం సంసిద్ధంగా ఉండదు కాబట్టి సమస్యలు మరింత తీవ్రమవుతూ ఉంటాయి. అయితే చలి ప్రభావానికి చర్మం దెబ్బతినకుండా ఉండడం కోసం మనం కొన్ని జాగ్రత్తలు పాటించవచ్చు. అవేంటంటే...

కొబ్బరినూనె మర్దన: సాధారణంగా తలకు వాడుకునే కొబ్బరినూనె ఒంటికి పూసుకుని, చర్మంలోకి ఇంకుతుందనే ఆలోచనతో ఎండలో కూర్చుంటూ ఉంటాం. ఇలా చేయడం వల్ల చర్మం నల్లబడిపోతుంది. మంగు సమస్య తలెత్తుతుంది. కాబట్టి బదులుగా గోరువెచ్చని కోల్డ్ ప్రెస్డ్ కొబ్బరినూనెను ఒంటికి పూసుకుని, సున్నితంగా మర్దన చేసి, స్నానం చేయాలి. మొటిమలు తలెత్తే గుణం కలిగిన చర్మం ఉన్నవాళ్లు, కొబ్బరినూనె ముఖానికి పూసుకున్నప్పుడు మొటిమలు పెరిగే అవకాశం ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి.



స్నానం నీళ్లు: చలి వల్ల మసిలే నీళ్లతో స్నానం చేస్తూ ఉంటాం. కానీ ఇంత వేడికి చర్మంలోని తేమంతా పూర్తిగా ఆవిరైపోయి, మరింత పొడిబారిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి స్నానానికి గోరువెచ్చని నీళ్లే వాడుకోవాలి. మరీ చల్లని, మరీ వేడి నీళ్లు చర్మానికి చేటు చేస్తాయి

జిడ్డు ఉండాలి: చర్మానికి పట్టించిన నూనె జిడ్డును వదిలించాలనే తాపత్రయంతో అవసరానికి మించి సబ్బును పట్టించకూడదు. ఇలా చేయడం వల్ల చర్మంలోని తేమ మొత్తం వదిలిపోయి, పొడిబారిపోతుంది. కాబట్టి స్నానానికి సున్నితమైన సబ్బులనే వాడుకోవాలి

సబ్బు/బాడీవాష్: ఈ రెండింట్లో ఏదైనా వాడుకోవచ్చు. అయితే సబ్బు పిహెచ్ 5.5 ఉండేలా చూసుకోవాలి. చర్మంలోని తేమను పట్టి ఉంచే ఎన్ఎమ్‌హెచ్ ఫ్యాక్టర్ ఎక్కువగా ఉండే గ్లిసరిన్, ఓట్‌మీల్, అలోవేరా సబ్బులను వాడుకోవాలి. ప్రత్యేకించి గంధం ఆధారిత సబ్బులు ఈ కాలంలో వాడుకోకూడదు. సబ్బు వాడిన తర్వాత చర్మం మీద తెల్లని పొర ఏర్పడితే, ఆ సబ్బు వాడకూడదని అర్థం. ఈ కాలంలో సున్నితమైన జిండెట్ సబ్బులు వాడుకోవాలి. సాధారణంగా బాడీ వాష్ పిహెచ్ 5.5 ఉంటుంది కాబట్టి ఈ కాలంలో వీటిని నిరభ్యంతరంగా వాడుకోవచ్చు

స్నానం ఎంత సేపు: ఐదు నుంచి పది నిమిషాల్లో స్నానం ముగించాలి. సమయం పెరిగేకొద్దీ చర్మంలోని తేమ అడుగంటిపోతూ ఉంటుంది. పొడిచర్మం కలిగిన వాళ్లు ఐదు నిమిషాల్లోపే స్నానం ముగించాలి

స్నానం తర్వాత: టవల్‌తో చర్మాన్ని రుద్దేసుకోకుండా, అద్దుకుని తుడుచుకోవాలి. చర్మం మీద తడి మొత్తం తొలగించే ప్రయత్నం చేయకుండా, కొంత తేమ మిగుల్చుకుని, వెంటనే మాయిశ్చరైజర్ పూసుకోవాలి. దాంతో చర్మం మీద మిగిలిన నీరు, మాయిశ్చరైజర్ రెండూ చర్మంలోకి ఇంకిపోతాయి

మాయిశ్చరైజర్ ప్రభావాన్ని బట్టి...

వీటిలో అక్లూజివ్స్, ఎమోలియంట్స్, హ్యూమెక్టెంట్స్ అనే రకాలుంటాయి. వీటి స్వభావాల ఆధారంగా చర్మ తత్వాన్ని బట్టి తగిన మాయిశ్చరైజర్‌ను ఎంచుకోవాలి.

షవర్ ఆయిల్స్

స్నానానికి ముందు నూనె పట్టించే అవసరం లేకుండా లిక్విడ్ సోప్‌లోనే నూనెలు కూడా కలిసి ఉంటాయి. వీటితో సమయం కలిసొస్తుంది. చర్మానికి తగిన తేమ కూడా దక్కుతుంది.

అక్లూజివ్: ఈ మాయిశ్చరైజర్లు చిక్కగా ఉంటాయి. కాబట్టి వీటిని పూసుకున్నప్పుడు చర్మం మీద ఒక పొర ఏర్పడి, చర్మంలోని తేమ ఆవిరైపోకుండా ఉంటుంది. మరీ ముఖ్యంగా పొడిచర్మం కలిగిన వారికి ఈ మాయిశ్చరైజర్ ప్రయోజనకరంగా ఉంటుంది. కార్నబా వ్యాక్స్, లనోలిన్, ఆలివ్ ఆయిల్, పెట్రోలేటమ్, సిలికాన్‌తో తయారయ్యే మాయిశ్చరైజర్లు ఈ కోవకు చెందినవే!

హ్యూమెక్టెంట్: నీటిని పీల్చి, చర్మం లోపలి పొర ఎపిడెర్మిస్ నుంచి నీటిని సంగ్రహించి చర్మాన్ని తేమగా ఉంచుతుంది. గ్లిసరిన్, ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్స్, హైల్యురోనిక్ యాసిడ్, సార్బిటాల్, యూరియా ఆధారిత మాయిశ్చరైజర్లు ఈ కోవకు చెందినవే!

ఎమోలియంట్: చర్మం మీద పగుళ్లను కార్నియోసైట్స్‌తో నింపి చర్మాన్ని నునుపుగా మారుస్తుంది. సెరమైడ్, కొల్లాజెన్, కొల్లాయిడల్ ఓట్‌మీల్, ఎలాస్టిన్, గ్లైసెరాల్ స్టెరేట్, ఐసోప్రొపైల్ పాల్మిటేట్, షియా బటర్, స్టెరియ్ యాసిడ్ మాయిశ్చరైజర్లు ఈ కోవకు చెందినవే!



జిడ్డు చర్మం ఉంటే?

జిడ్డు చర్మం కాబట్టి మాయిశ్చరైజర్ అవసరం లేదనుకుంటే పొరపాటు. ఎలాంటి చర్మానికైనా కచ్చితంగా మాయిశ్చరైజర్ అవసరమే! అయితే చర్మ తత్వాన్ని బట్టి మాయిశ్చరైజర్ రకం కూడా మారుతుంది. కాబట్టి తగినది ఎంచుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు చిక్కని మాయిశ్చరైజర్‌కు బదులుగా తక్కువ నూనె కలిగిన నీటి ఆధారిత మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. పొడిచర్మం కలిగిన వాళ్లు నూనె ఎక్కువ, నీరు తక్కువగా ఉండే మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. అలాగే క్రీమ్, ఆయింట్‌మెంట్ ఆధారిత మాయిశ్చరైజర్లను పొడిచర్మం కలిగిన వాళ్లు, లోషన్ ఆధారిత మాయిశ్చరైజర్‌ను జిడ్డు చర్మం కలిగినవాళ్లు వాడుకోవాలి. ఆకర్షణీయమైన ప్యాకింగ్, సువాసనలను బట్టి మాయిశ్చరైజర్లను ఎంచుకోకూడదు. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు, ప్యాక్ మీద నాన్ కొమెడోజెనిక్ అనే లేబుల్ కోసం వెతుక్కోవాలి. యూరియా ఆధారిత మాయిశ్చరైజర్లను ప్రధానంగా పాదాలకే వాడుకోవాలి. తీవ్రమైన పొడి చర్మం కలిగిన వాళ్లు మొదట అక్లూజివ్, తర్వాత ఎమోలియెంట్.. ఈ రెండు రకాల మాయిశ్చరైజర్లనూ కలిపి వాడుకోవాలి. అలాగే రోజులో పలుసార్లు అప్లై చేసుకుంటూ ఉండాలి.

చిట్కాలు శ్రేయస్కరమేనా?

అలోవెరా: ఇది చర్మం తేమను పెంచే మాట వాస్తవమే అయినా. ప్రత్యేకించి చలి కాలంలో దీని మీదే ఆధారపడడం సరి కాదు. చర్మంలోని తేమను నిలిపి ఉంచే సామర్థ్యం కలబందకు ఉండదు కాబట్టి ఈ కాలంలో అప్పటికప్పుడు తయారుచేసుకుని, లేదా ఫ్రిజ్‌లో నిల్వ చేసుకుని ముఖానికి పట్టించే కలబందతో సరిపెట్టుకోకుండా, అదనంగా నాణ్యమైన మాయిశ్చరైజర్ కూడా వాడుకోవాలి

గ్లిజరిన్: గ్లిజరిన్ నీటిని పీల్చుకునే తత్వం కలిగి ఉంటుంది. చలికాలంలో గాల్లో తేమ లేనప్పుడు, గ్లిజరిన్ చర్మంలోని తేమను పీల్చుకునే ప్రయత్నం చేస్తుంది. కాబట్టి పొడి ప్రదేశాల్లో నివసించేవాళ్లు చలికాలం గ్లిజరిన్‌ను వాడుకోకపోవడమే మంచిది.

కాలానికి తగినట్టు

రెటినాల్స్, సాల్సిలిక్ యాసిడ్స్, మొటిమల క్రీమ్స్ వాడుకుంటున్న వాళ్లు ఈ కాలంలో ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఇవన్నీ చర్మాన్ని మరింత పొడిబారుస్తాయి. కాబట్టి చలికాలంలో చర్మ వైద్యులను సంప్రతించి, చలికాలానికి తగిన వాటిని ఎంచుకోవాలి.

హైల్యురోనిక్ యాసిడ్: ఈ సీరమ్‌ను ఎవరికి వారు కొని వాడుకునే ధోరణి పెరిగింది. అయితే వీటిలో కూడా రకాలుంటాయి. తక్కువ మాలిక్యులర్ వెయిట్ ఉన్న సీరమ్స్ చర్మంలోని పైపొరకు మాత్రమే తేమను అందిస్తాయి. కాబట్టి ఈ కోవకు చెందిన సీరమ్స్ కూడా చలి కాలానికి సరిపోవు. వీటికి అదనంగా మాయిశ్చరైజర్లు కూడా వాడుకోవాలి

ఈ లక్షణాలను గమనిస్తూ...

- స్నానం చేసిన తర్వాత, చర్మం మీద తెల్లని పొర ఏర్పడడం
- చల్లగాలికి బహిర్గతమైనప్పుడు, చర్మం చిటపటమనడం
- మంట, దురద
- గోకినప్పుడు చర్మం చిట్లి నీరు కారడం
- ముడతలు పెరగడం
- పొట్టు రాలడం

డాక్టర్ స్వప్నప్రియ
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్, హైదరాబాద్



లైఫ్ స్టైల్

యూరిక్ ఆమ్లం అదుపులో...

యూరిక్ ఆమ్లం పెరుగుతున్న సందర్భాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. అస్తవ్యస్థ జీవనశైలి, ఆహారపుటలవాట్లే ఇందుకు ప్రధాన కారణం. ఈ ఆమ్లం మోతాదు... గుండె, మూత్రపిండాలు, కాలేయాలను దెబ్బ తీస్తుంది. కాబట్టి సంబంధిత లక్షణాలను బట్టి కారణాలను సరిదిద్దుకుంటూ, వైద్యుల సూచనలను పాటించాలి

యూరిక్ ఆమ్లం, తగ్గినా, పెరిగినా ఆరోగ్య సమస్యలు తప్పవు. మన ఆహారపుటలవాట్లు, జీవనశైలులు ఈ ఆమ్లం పెరుగుదలకు దోహపడుతూ ఉంటాయి. సాధారణంగా మనకు ఈ ఆమ్లం గురించిన అవగాహన తక్కువ. పెరిగిన యూరిక్ ఆమ్లం వల్లే కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయని వైద్యులు చెప్పినప్పుడు, ఇలాంటి ఒక ఆమ్లం ఒకటి మన శరీరంలో ఉంటుందని మొదటిసారి తెలుసుకుంటూ ఉంటాం. ఈ ఆమ్లం పెరుగుదల వల్ల మూత్రపిండాలు, పిత్తాశయంలో రాళ్లు ఏర్పడడం లాంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. అయితే ఈ సమస్య కొన్ని లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటుంది. అవేంటంటే..

- ఒళ్లు నొప్పులు
- తేలికపాటి జ్వరం



- పాదాలు, మోకాళ్లలో నొప్పులు
- పిక్కల్లో నొప్పులు

కారణాలు లెక్కలేనన్ని

కొందరు పుట్టుకతో ఎంజైమ్ లోపాన్ని వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి అరుదైన పరిస్థితి ఉన్నవారిలో యూరిక్ ఆమ్లం మోతాదు పెరుగుతూ ఉంటుంది. అలాగే ఈ ఆమ్లం పెరుగుదలకు మరెన్నో కారణాలున్నాయి. అవేంటంటే...

- **నీళ్లు:** కొంతమంది చాలా తక్కువ నీళ్లతో సరిపెట్టుకుంటూ ఉంటారు. సరిపడా నీళ్లు తాగని వారిలో డీహైడ్రేషన్ మూలంగా యూరిక్ యాసిడ్ మోతాదు పెరిగిపోతుంది
- **అధిక ప్రొటీన్:** ఎక్కువ మాంసకృత్తులతో కూడిన ఆహారం తీసుకునే వాళ్లలో కూడా ఈ సమస్య తలెత్తుతుంది
- **మూత్రపిండాల సమస్య:** మూత్రపిండాల సమస్యలు ఉన్నవారిలో కూడా యూరిక్ యాసిడ్ మోతాదు పెరుగుతుంది
- **గుండె జబ్బు మందులు:** హృద్రోగాల మందుల ప్రభావంతో కూడా ఈ సమస్య పెరుగుతుంది
- **క్యాన్సర్లు:** కొన్ని రకాల క్యాన్సర్లు సోకినప్పుడు కూడా ఈ సమస్య వేధిస్తుంది

గౌట్

కాలి బొటనవేలిలో తలెత్తే తీవ్రమైన నొప్పి ఇది. ఈ సమస్య రాత్రికి రాత్రే మొదలవుతుంది. కీలు ఎర్రగా మారి, భరించలేని నొప్పితో ఇబ్బంది పెడుతుంది. చేత్తో తాకలేని పరిస్థితి ఉంటుంది. జ్వరం కూడా ఉంటుంది. అయితే రక్తంలో యూరిక్ యాసిడ్ పెరగడం మూలంగానే గౌట్ వస్తుందనుకోవడం పొరపాటు. ఈ యాసిడ్ సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ గౌట్ వచ్చే అవకాశాలుంటాయి.

ఈ సమస్య ఎవరిలో ఎక్కువ?

యూరిక్ ఆమ్లం మోతాదు పెరిగే సమస్య కొంత మందిలో ఎక్కువ.

- మద్యపానం
- మధుమేహం
- అధిక రక్తపోటు
- రక్తం పలుచన చేసే ఎకోస్ప్రిన్ వాడకం

ఎవరికి వారు గ్రహించవచ్చు

మధుమేహులు, అధిక రక్తపోటుతో బాధపడేవారు, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఎకోస్ప్రిన్ మందులు వాడుకుంటున్నవాళ్లలో యూరిక్ యాసిడ్ మోతాదు పెరిగే అవకాశం ఉంది. అలాగే నీళ్లు తక్కువగా తాగే అలవాటున్న వాళ్లలో కూడా ఈ సమస్య పెరుగుతుంది. కాబట్టి, ఈ కోవలకు చెందిన వాళ్లందరూ పెరిగిన యూరిక్ యాసిడ్ తాలూకు లక్షణాలైన ఒళ్లు నొప్పులు, జ్వరం, కీళ్ల నొప్పులు బయల్పడినప్పుడు, అందుకు మూల కారణాన్ని ఎవరికి వారు గమనించుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటు మందులు సక్రమంగా వాడుకుంటున్నారో లేదో, ఆ మందుల మోతాదు పెంచవలసిన అవసరం ఉందేమో గమనించుకోవాలి. అవసరాన్ని బట్టి ప్రత్యామ్నాయ మందులు ఎంచుకోవాలి. మద్యపానం తర్వాత కీళ్ల నొప్పులు వేధిస్తుంటే, ఆ అలవాటుకు దూరంగా ఉండాలి. అలాగే ఎకోస్ప్రిన్‌కు బదులుగా ప్రత్యామ్నాయ మందులు వాడుకోవాలి. ఏ కారణం లేకుండా లక్షణాలు వేధిస్తే, నీళ్లు సరిపడా తాగడం లేదేమో చూసుకోవాలి. అలాగే ఆ రోజు మాంసాహారం ఎక్కువగా తీసుకున్నామా అని కూడా ఆలోచించాలి. ఇలా ఎవరికి వారు కారణాలను గమనించుకుని, జాగ్రత్త పడాలి.

ఆహార నియమాలు

యూరిక్ ఆమ్లం అదుపులోకి వచ్చేవరకూ మాంసాహారం మానేయడం మంచిది. వృక్షాధారిత మాంసకృత్తులైన పప్పుధాన్యాలు తినాలి. అయితే మినప్పప్పు, రెడ్ కిడ్నీ బీన్స్ యూరిక్ ఆమ్లాన్ని పెంచుతాయి కాబట్టి వీటి వాడకం తగ్గించి, క్రూసిఫెరస్ కూరగాయలైన కాలిఫ్లవర్, క్యాబేజీ తీసుకోవాలి. నట్స్ తినాలి. పాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు తీసుకోవచ్చు.

చికిత్స తేలికే..

రక్త పరీక్షతో శరీరంలో పెరిగిన యూరిక్ యాసిడ్ మోతాదును తేలికగా గుర్తించవచ్చు. ఆ పెరిగిన మోతాదులను సమం చేయడం కోసం వైద్యులు సూచించే నోటి మాత్రలను వాడుకోవాలి. వైద్యులు సూచన మేరకు పరీక్షలు చేయించుకుంటూ, సమస్య అదుపులోకి వచ్చినప్పుడు మందులను ఆపేయవచ్చు. అయితే ఎంజైమ్ లోపాన్ని పుట్టుకతో వెంట తెచ్చుకోవడం మూలంగా శరీరంలో యూరిక్ యాసిడ్ నిల్వలు పెరిగిపోయే వ్యక్తులు జీవితాంతం మందులు వాడుకోక తప్పదు. యూరిక్ యాసిడ్ అదుపులో ఉంచుకోవడానికి అనుసరించవలసిన అత్యంత ముఖ్యమైన అంశం... సరిపడా నీళ్లు తాగడం.

ప్రధాన అవయవాలు కుదేలు

యూరిక్ యాసిడ్, శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను సృష్టించి, అన్ని అవయవాలనూ ప్రభావితం చేయగలిగే సామర్థ్యం కలిగి ఉంటుంది. కాబట్టి దీంతో స్వల్ప అస్వస్థలే కాకుండా తీవ్ర రుగ్మతలూ తలెత్తుతాయి. మరీ ముఖ్యంగా యూరిక్ యాసిడ్‌కూ కొలెస్ట్రాల్ పెరుగుదలకూ, మూత్రపిండాల సమస్యలకూ సంబంధం ఉంటుంది. రక్తంలో కలిసి ఉండే యూరిక్ యాసిడ్ మోతాదు పెరిగితే, అది మొదట స్ఫటికాల్లా మారి, తర్వాత రాళ్ల రూపం దాలుస్తుంది. ఏ అవయవంలో ఈ యాసిడ్ ఎక్కువగా చేరుకుంటే, ఆ అవయవం ఎక్కువగా ప్రభావితమవుతుంది. యూరిక్ యాసిడ్ పెరుగుదల ప్రభావం గుండె మీద కూడా పడుతుంది. అలాగే మూత్రపిండాల పనితీరు, కాలేయం, పిత్తాశయం పనితీరులు కూడా దెబ్బతింటాయి. కీళ్లతో పాటు, మస్క్యులోస్కెలెటల్ వ్యవస్థ ప్రభావితమవుతుంది. అలాగే పెరిగే యూరిక్ యాసిడ్ మోతాదు మధుమేహానికి కూడా దారి తీస్తుంది.

డాక్టర్ రాజేష్ ఉక్కాల
సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
టిఎక్స్ హాస్పిటల్స్, బంజారాహిల్స్
హైదరాబాద్



ఆహారం - ఆరోగ్యం

రక్తలేమి నివారణ కోసం...



రక్తలేమిని దూరం చేయడం కోసం దానిమ్మ, బీట్‌రూట్, క్యారట్ రసాలను తాగుతూ ఉండాలి. ఈ మూడింటినీ కలిపి రసం తీసుకుని 14 రోజుల పాటు క్రమం తప్పకుండా తాగడం వల్ల హిమోగ్లోబిన్ 23% పెరుగుతుంది. ఆక్సిజన్ కణాల్లోకి సమృద్ధిగా చేరుకుంటుంది.

ముత్యాల ముగ్గు



17 చుక్కలు, సరిచుక్క 5 వచ్చేవరకు

టి.సింధూజ
నెల్లిమర్ల, విజయనగరం



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

ఎస్‌బీఐ.. యోనో 2.0 యాప్

మార్చిలోగా 10,000 మంది నియామకం

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ తన డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగా యోనో 2.0 పేరుతో కొత్త యాప్‌ను విడుదల చేసింది. బ్యాంకు శాఖల్లో ఈ యాప్ వినియోగంపై ఖాతాదారులకు అవగాహన కల్పించేందుకు వచ్చే ఏడాది మార్చిలోగా 10,000 మంది ప్రత్యేక ఎగ్జిక్యూటివ్‌లు లేదా ఫ్లోర్ మేనేజర్లను నియమిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఇందులో ఇప్పటికే 3,500 మంది నియామకం పూర్తయినట్టు తెలిపారు. యోనో 2.0 యాప్ ద్వారా గూగుల్ పే, ఫోన్‌పే వంటి దిగ్గజ పేమెంట్ యాప్స్‌తో పోటీపడబోతున్నట్టు చెప్పారు. తమ సరికొత్త యోనో 2.0 యాప్‌ను ట్యాబ్లెట్, మొబైల్, డెస్క్‌టాప్ ద్వారా ఉపయోగించవచ్చన్నారు.

సూచీలకు స్వల్ప నష్టం

సెన్సెక్స్ 54 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం స్వల్పంగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, రూపాయి సరికొత్త కనిష్ఠానికి క్షీణించడం ఇందుకు కారణమయ్యాయి. ఆరంభంలో నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒకదశలో 427.34 పాయింట్ల వరకు పతనమై 84,840.32 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం కోలుకున్నప్పటికీ, చివరికి సూచీ 54.30 పాయింట్ల నష్టంతో 85,213.36 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.65 పాయింట్లు కోల్పోయి 26,027.30 వద్ద స్థిరపడింది.

చిన్న నోట్లకు తీవ్ర కొరత

న్యూఢిల్లీ: దేశంలో రూ.10, రూ.20, రూ.50 నోట్లకు తీవ్ర కొరత ఏర్పడిందని అఖిల భారత రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐఆర్‌బీఈఏ) పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో అసలు ఈ నోట్లు దొరకటమే గగనంగా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉందని పేర్కొంది. దీంతో సామాన్యులతో పాటు చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దాలని కోరింది. బ్యాంకుల ఏటీఎంల్లోనూ రూ.100, రూ.200, రూ.500 నోట్లు తప్ప అంతకంటే చిన్న నోట్లు రావడం లేదని తెలిపింది. బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ఏఐఆర్‌బీఈఏ పేర్కొంది.

ఐదు నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు

నవంబరులో ఎగుమతుల పునరుజ్జీవం ● రూ.3.43 లక్షల కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: కొన్ని నెలలుగా నిస్తేజంగా ఉన్న ఎగుమతుల రంగం నవంబరు నెలలో మంచి జోరందుకుంది. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతులు ఇందుకు దోహదపడ్డాయి. ఫలితంగా ఎగుమతులు 19.37% వృద్ధితో 3,813 కోట్ల డాలర్లకు (రూ.3.43 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇది ఆరు నెలల గరిష్ఠ స్థాయి. కాగా వాణిజ్య లోటు మాత్రం ఐదు నెలల కనిష్ఠ స్థాయి 2,453 కోట్ల డాలర్లుగా (రూ.2.21 లక్షల కోట్లు) దిగి వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో నమోదైన కనిష్ఠ స్థాయి 1,878 కోట్ల డాలర్ల (రూ.1.69 లక్షల కోట్లు) తర్వాత మరో కనిష్ఠ స్థాయి ఇదే. ఈ లోటు అక్టోబరులో 4,168 కోట్ల డాలర్లుగా (రూ.3.75 లక్షల కోట్లు) ఉంది.

ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 1.88% తగ్గి 6,266 కోట్ల డాలర్లకు (రూ.5.64 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. ప్రధానంగా బంగారం, క్రూడాయిల్, బొగ్గు, కోక్ దిగుమతులు క్షీణించాయి. క్రూడాయిల్ దిగుమతులు 11.27% క్షీణించి 1,411 కోట్ల డాలర్లకు (రూ.1.27 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి.

ఇతర ప్రధానాంశాలు..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో ఎగుమతులు 2.62 శాతం వృద్ధితో 29,207 కోట్ల డాలర్లుగా (రూ.26.29 లక్షల కోట్లు) నమోదు కాగా దిగుమతులు 5.59 శాతం వృద్ధితో 51,521 కోట్ల డాలర్లకు (రూ.46.37 లక్షల కోట్లు) చేరాయి.
- ఈ 8 నెలల కాలంలో వాణిజ్య లోటు 22,314 కోట్ల డాలర్లుగా (రూ.20.08 లక్షల కోట్లు) ఉంది.
- నవంబరులో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 11.65 శాతం తగ్గి 393 కోట్ల డాలర్లకు చేరాయి. టీ, కాఫీ, ఇనుప ఖనిజం, జీడిపప్పు, ఆయిల్ మీల్, డెయిరీ, హస్తకళ ఉత్పత్తులు, మెరైన్ ఉత్పత్తులు, లెదర్ ఉత్పత్తుల రంగాలు ఎగుమతుల్లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి.
- సేవల రంగం ఎగుమతులు గత ఏడాది నవంబరుతో పోల్చితే 3,211 కోట్ల డాలర్ల నుంచి 3,586 కోట్ల డాలర్లకు చేరాయి. ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో ఇవి 27,000 కోట్ల డాలర్లుగా ఉన్నాయి.

బంగారం దిగుమతులు 60% డౌన్

బంగారం దిగుమతులు నవంబరు నెలలో 59.15% తగ్గి 400 కోట్ల డాలర్లకు (రూ.36,000 కోట్లు) దిగి వచ్చాయి. అయితే ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో మాత్రం 3.3% వృద్ధితో 4,526 కోట్ల డాలర్లకు (రూ.4.07 లక్షల కోట్లు) చేరాయి. మొత్తం దిగుమతుల్లో బంగారం వాటా 5% ఉంటుంది. బంగారం దిగుమతుల్లో క్షీణత వాణిజ్య లోటు తగ్గడానికి కూడా దోహదపడింది. చైనా తర్వాత రెండో పెద్ద పసిడి వినియోగ దేశం మనదే. ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసం మనం బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ ఉంటాం. అయితే వెండి దిగుమతులు మాత్రం 125.40% పెరిగి 107 కోట్ల డాలర్లకు చేరాయి. ఎలక్ట్రానిక్స్, ఆటో, ఫార్మా రంగాల్లో వెండిని ఉపయోగిస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,34,730	1,23,500	2,13,000
విజయవాడ	1,37,000	1,27,000	1,98,600
విశాఖపట్నం	1,37,600	1,27,000	2,15,000
రాజమండ్రి	1,34,730	1,23,500	1,93,000
ప్రొద్దుటూరు	1,32,400	1,21,160	1,91,000
ముంబై	1,33,249	1,22,056	1,93,417

ఆర్‌సీ ప్లాస్టో నుంచి ట్యాంక్ స్టాండ్



హైదరాబాద్: ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. వాటర్ స్టోరేజీ ట్యాంకుల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన ట్యాంక్ స్టాండ్‌ను మార్కెట్లోకి తీసుకు వచ్చింది. వంద శాతం ఫుడ్-గ్రేడ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన ఈ స్టాండ్.. వాటర్ ట్యాంకులను పటిష్ఠంగా ఉంచడంతో పాటు వాటి మన్నికను పెంచుతుందని వెల్లడించింది. ఈ స్టాండ్ 160ఎంఎం ఎత్తుతో ఉండటంతో ట్యాంక్ కింది భాగం సహా చుట్టుపక్కల వెంటనే శుభ్రం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. 500, 750, 1000 లీటర్ల ట్యాంకుల కోసం అందుబాటులో ఉండే ఈ స్టాండ్‌ను 10 ఏళ్ల వారంటీని అందిస్తున్నట్లు ఆర్‌సీ ప్లాస్టో వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్‌సీ ప్లాస్టో డీలర్ల వద్ద ఈ ట్యాంక్ స్టాండ్ అందుబాటులో ఉంటుందని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	671	విజయవాడ	700
వరంగల్	673	గోదావరి	675
చిత్తూరు	688	విశాఖపట్నం	675
		డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	122
కర్నూలు	114	నెల్లూరు	127
విశాఖపట్నం	111	అనంతపురం	127
గోదావరి	120		

కొత్త కనిష్ఠానికి రూపాయి

- మరో 29 పైసలు పతనం
- రూ.90.78 వద్ద ముగింపు



ముంబై: మన రూపాయి మరింత పతనమైంది. అమెరికన్ డాలర్‌తో భారత కరెన్సీ మారకం విలువ సోమవారం ఒక దశలో 31 పైసలు క్షీణించి రూ.90.80 వద్ద ఆల్‌టైమ్ ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 29 పైసల నష్టంతో రూ.90.78 వద్ద ముగిసింది. ఇది సరికొత్త కనిష్ఠ ముగింపు కూడా. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటం, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోతుండటం, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరుగుతున్న డిమాండ్ ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గత నెలకు వాణిజ్య లోటు (ఎగుమతుల ఆదాయం- దిగుమతుల వ్యయం మధ్య అంతరం) అంచనాల కంటే తగ్గినప్పటికీ రూపాయికి మద్దతు లభించలేదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ అన్నారు. దాంతో మన రూపాయి మరో కొత్త కనిష్ఠానికి జారుకోవడంతో పాటు ఈ ఏడాది ఆసియాలో అత్యధికంగా క్షీణించిన కరెన్సీగా మిగిలిందన్నారు. ముమ్ముందు సెషన్లలోనూ రూపాయిపై ఒత్తిడి కొనసాగే అవకాశాలున్నాయని, మారకం రేటుకు రూ.90.95 వద్ద నిరోధం, రూ.90.50 వద్ద మద్దతు లభించవచ్చన్నారు.

కొత్త గరిష్ఠానికి బంగారం

- ఒక్కరోజులో రూ.4,000 జంప్
- రూ.1.37 లక్షలకు 10 గ్రా. ధర
- రూ.2 లక్షలకు కిలో వెండి రేటు



న్యూఢిల్లీ: పసిడి మళ్లీ కొండెక్కుతోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.4,000 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,37,600కు చేరింది. క్రితం గరిష్ఠ స్థాయి ధర రూ.1,34,800 ఈ అక్టోబరు 17న నమోదైంది. కాగా, కిలో వెండి మాత్రం గత వారాంతం ముగింపుతో పోలిస్తే ఏమార్పు లేకుండా రూ.1,99,500 ధర పలికింది. మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లోనూ గోల్డ్ ఫ్యూచర్స్ 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు ధర రూ.1,874 పెరుగుదలతో రూ.1,35,496 వద్ద కొత్త ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు మరింత ఎగబాకడంతో పాటు రూపా యి క్షీణత ఇందుకు ప్రధాన కారణమని బులియన్ విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 4,350 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 63.96 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. 2024 డిసెంబరు 31న రూ.78,950 పలికిన 10 గ్రాముల బంగారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.58,650 లేదా 74.30 శాతం పెరిగింది. గత ఏడాది చివరి రోజున రూ.89,700గా నమోదైన కిలో వెండి రేటు.. 2025లో ఇప్పటివరకు రూ.1,09,800 లేదా 122.41 శాతం ఎగబాకింది.

రూ.100 కోట్లతో రఘువంశీ ఏరోస్పేస్ కొత్త ప్లాంట్

6 యూఏవీలు, రక్షణ ఉత్పత్తుల ఆవిష్కరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్.. హార్డ్‌వేర్ పార్క్‌లో డీప్‌టెక్ డిజైన్, ఉత్పత్తి, ఇంటిగ్రేషన్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. అలాగే దేశీయంగా అభివృద్ధి చేసిన ఆరు మానవ రహిత విమానాలు (యూఏవీ), అటానమస్ రక్షణ ఉత్పత్తులను ఆవిష్కరించింది. రఘువంశీ గ్రూప్‌నకు చెందిన ఏరోబోట్.. హైదరాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్‌లో రూ.100 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండీ వంశీ వికాస్ వెల్లడించారు. ఈ ప్లాంట్‌లో కామికేజ్ యూఏవీలు, యూజీవీలు, మైక్రో టర్బో జెట్ ఇంజన్లు సహా నిఘా డ్రోన్లు, ఎయిర్ బేస్డ్ మిస్సైల్ లాంచర్స్, డీప్ స్ట్రైక్, రోబోటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ సొల్యూషన్స్ డిజైన్, అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఉత్పత్తులన్నీ 600 కిలోమీటర్ల వేగంతో 300 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణిస్తాయని తెలిపారు.

కాగా ఈ ఉత్పత్తుల కోసం భారతీయ సైన్యం, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఏఆర్‌సీఐ సహా ఐఐటీ హైదరాబాద్‌తో రఘువంశీ గ్రూప్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం రఘువంశీ అమెరికా, యూకే, భారత్‌ల్లో మొత్తం 10 మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ రూ.1,500 కోట్లుగా ఉండగా టర్నోవర్ రూ.500 కోట్లకు పైగా ఉందని వంశీ వివరించారు. కాగా హార్డ్‌వేర్ పార్క్‌లో రూ.300 కోట్ల పెట్టుబడితో నెలకొల్పుతున్న రక్షణ ఉత్పత్తుల తయారీ ప్లాంట్ వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికల్లా అందుబాటులోకి రానుందని వంశీ వెల్లడించారు.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సరికొత్త హెక్టర్

ప్రారంభ ధర రూ.11.99 లక్షలు



హైదరాబాద్: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త ఎంజీ హెక్టర్‌ను తీసుకువచ్చింది. హైదరాబాద్‌లోని రామ్ ఎంజీ, ఆటోమోటివ్ ఎంజీ షోరూమ్‌ల్లో జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఐటీ హెడ్ సుధీర్ కటారియా, ఏఎస్ఎం అభినయ్ ఆకుల ఈ కారును విడుదల చేశారు. ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.11.99 లక్షలు. కొత్తగా ఫ్రంట్, రియర్ బంపర్ డిజైన్, అల్లాయ్ వీల్స్, 5 సీట్ల ట్రిమ్ వేరియంట్ సహా 6,7 సీట్లతో డ్యూయల్ టోన్ అర్బన్ టాన్‌తో దీన్ని రూపొందించినట్లు పేర్కొంది.

స్పోర్ట్స్

మళ్లీ వస్తా..

బైబై భారత్
ముగిసిన మెస్సీ పర్యటన
చివరి రోజు ఢిల్లీలో సందడి



వెలకట్టలేని ప్రేమను తీసుకెళ్తున్నా

న్యూఢిల్లీ: దిగ్గజ ఫుట్‌బాలర్, అర్జెంటీనా సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ మూడు రోజుల సుడిగాలి పర్యటన ముగిసింది. 'ది గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఈనెల 13న మెస్సీ కోల్‌కతాలో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తొలి రోజు సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వహణాలోపంతో ఈవెంట్ రసాభాస అయినప్పటికీ.. అదే రోజు రాత్రి హైదరాబాద్‌లో.. ఆదివారం ముంబైలో మాత్రం మెస్సీ ఈవెంట్ సక్సెస్ అయ్యింది. ఎలాంటి అడ్డంకులు లేకుండా అభిమానులతో పాటు సెలెబ్రిటీలు, అధికారులు, క్రీడా ప్రముఖులు అతడిని ప్రత్యక్షంగా తిలకించి మురిసిపోయారు. ఇక చివరి అంచెలో భాగంగా సోమవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో అడుగుపెట్టిన మెస్సీ బృందం తరగని ఉత్సాహంతో అరుణ్ జైట్లీ మైదానంలో ప్రేక్షకులను అలరించింది.

కాస్త ఆలస్యంగా..: షెడ్యూల్ ప్రకారం ముంబై నుంచి మెస్సీ ప్రత్యేక విమానం ఉదయం 10.45కు ఢిల్లీ చేరుకోవాలి. కానీ అధిక మంచు ప్రభావంతో మధ్యాహ్నం 2.30 గంటలకు మెస్సీ స్థానిక ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టాడు. నేరుగా అక్కడి నుంచి లీలా ప్యాలెస్ హోటల్‌కు వెళ్లిన అతను కాస్త సేద తీరాక ఎంపిక చేసిన పలువురితో మీట్ అండ్ గ్రీట్ సెషన్‌లో గడిపాడు.

గంటకుపైగా స్టేడియంలోనే..: ఉదయం నుంచే అభిమానులు వయస్సు తేడా లేకుండా జైట్లీ స్టేడియానికి పోటెత్తారు. మెస్సీ రాకకు కొన్ని గంటల ముందుగానే 25వేల మందికి పైగా ప్రేక్షకులతో స్టేడియం నిండిపోయింది. ముందుగా 20 నిమిషాలపాటు సెలెబ్రిటీ మెస్సీ ఆల్ స్టార్స్- మినర్వా మెస్సీ ఆల్ స్టార్స్ మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. ఆ తర్వాత సాయంత్రం 4.30 గంటలకు మెస్సీ తన సహచరులు సువారెజ్, డి పాల్‌తో కలిసి స్టేడియంలో అడుగుపెట్టడంతో ఒక్కసారిగా సందడి నెలకొంది. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదలగా.. మెస్సీ ప్రతి కదలికను కూడా ఫ్యాన్స్ తమ మొబైల్ ఫోన్స్‌లో బంధించడం కనిపించింది. అలాగే మ్యాచ్ ఆటగాళ్లను కలిసి వారితో మెస్సీ ఫొటో దిగాడు. ఇక్కడ కూడా స్టేడియంలో కలియదిరుగుతూ బంతులను స్టాండ్స్‌లోకి పంపి వారిలో మరింత జోష్ నింపాడు. ఈ క్రమంలో చిన్నారులతో కాసేపు ఆడి ఫొటోలు దిగిన సాకర్ స్టార్.. వారి జెర్సీలపై సంతకం చేసి మరింత ఆనందంలో ముంచెత్తాడు.

గంటకు పైగా స్టేడియంలో సందడి చేసిన మెస్సీ చివర్లో తన మాటలతో మరింత ఉద్రూతలూగించాడు. ఏదో ఒకరోజు మళ్లీ భారత్‌కు వస్తానని అన్నాడు. 'ఈ మూడు రోజుల పాటు భారత్‌లో నేను తక్కువ సమయమే ఉన్నప్పటికీ మీరంతా చూపిన ప్రేమ, ఆదరణకు కృతజ్ఞతలు. నన్నిక్కడ అభిమానిస్తారని ముందే తెలుసు. కానీ ప్రత్యక్షంగా ఆ అనుభూతిని పొందడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు మీ వెలకట్టలేని ప్రేమనంతా తీసుకెళుతున్న నేను భవిష్యత్‌లో మరోసారి కచ్చితంగా ఇక్కడికి వస్తా' అని స్పానిష్‌లో మెస్సీ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



టీ20 వరల్డ్‌కప్‌నకు ఆహ్వానం

స్టేడియంలో మెస్సీని కలిసేందుకు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీతో పాటు ఐసీసీ చైర్మన్ జైషా తరలివచ్చారు. మైదానం మధ్యలో ఏర్పాటు చేసిన వేదికపై మెస్సీని టీ20 వరల్డ్‌కప్‌నకు ఆహ్వానిస్తూ భారత్-యూఎస్ఏ ఆరంభ మ్యాచ్ టిక్కెట్‌ను మెస్సీకి జైషా అందించారు. ఆ తర్వాత క్రికెటర్ల సంతకాలతో కూడిన బ్యాట్‌తో పాటు క్రికెట్ జెర్సీలను జైషా బహూకరించారు. మాజీ ఫుట్‌బాలర్ బైచుంగ్ భూటియా తన కుటుంబ సభ్యులతో కలిసి మెస్సీతో ఫొటో దిగాడు.

కరచాలనానికి కోటి!

న్యూఢిల్లీ: చివరిరోజు మెస్సీ పాల్గొన్న ఢిల్లీ ఢిల్లీ కార్యక్రమాల్లో 'మీట్, గ్రీట్' కూడా ఒకటి. ఈ ఈవెంట్‌లో మెస్సీని కలిసి అతడితో కరచాలనం చేసేందుకు కార్పొరేట్ సంస్థల వ్యక్తులు, వీఐపీలు రూ. కోటి చెల్లించినట్టు సమాచారం. ఈ కార్యక్రమం స్థానిక లీలా ప్యాలెస్ హోటల్‌లో జరిగింది. అయితే కోల్‌కతా, హైదరాబాద్‌లో ఈ 'మీట్, గ్రీట్' ఈవెంట్‌కు ఒక్కొక్కరికి రూ. 10 లక్షలే చార్జ్ చేయడం గమనార్హం.

మెస్సీ..ఊపిరితిత్తులకు బీమా ఉందా..?

దేశ రాజధానిని దట్టమైన పొంగమంచు, కాలుష్యం కమ్మేశాయి. ఈ తరుణంలో మెస్సీ న్యూఢిల్లీలో అడుగుపెట్టాడు. దాంతో ఇక్కడి కాలుష్యం నేపథ్యంగా నెటిజన్లు మెస్సీపై సరదాగా చేసిన కామెంట్లు, మీమ్‌లు సోషల్‌మీడియాను ముంచెత్తుతున్నాయి. 'ఢిల్లీలో మెస్సీకి స్వాగతం. నీ ఎడమ పాదాన్ని రూ. 8వేల కోట్లకు బీమా చేయించావని విన్నా. కానీ నీ ఊపిరితిత్తుల పరిస్థితి ఏమిటి' అని ఒకరు.. 'మెస్సీ కెరీర్‌లో 896 గోల్స్ చేశాడు. కానీ రేపటి ఢిల్లీ కాలుష్య సూచీ దానిని దాటేస్తుంది' అని మరొకరు పోస్టులు చేశారు.

ఇంత ఆర్భాటమేల?

అభినవ్ భింద్రా



న్యూఢిల్లీ: దేశ క్రీడా రంగం మౌలిక సదుపాయలతో సతమతమవుతున్న తరుణంలో మెస్సీ పర్యటనకు అంత భారీ మొత్తం వెచ్చించడం సమంజసమేనా? అని మాజీ షూటర్, ఒలింపిక్ చాంపియన్ అభినవ్ భింద్రా ప్రశ్నించాడు. మెస్సీ అంటే తనకు ఎనలేని గౌరవమని, బాల్యంలో ఎదురైన ఆరోగ్య సమస్యలను అధిగమించి దిగ్గజ ఫుట్‌బాలర్‌గా అతడు ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమని సోషల్ మీడియాలో కొనియాడాడు. అదే సమయంలో భారత క్రీడా రంగంలో లోపలి కోణాలను కూడా చూడాలని హితవు పలికాడు. 'యువ అథ్లెట్లకు దేశంలో ఇప్పటికీ మైదానాలు, నాణ్యమైన కోచ్‌ల కొరత ఉంది. ఇంత పెద్దస్థాయి ఈవెంట్లకు ఖర్చు చేసిన భారీ మొత్తంలో కొంచెమైనా దేశ క్రీడా రంగంలో సమస్యలపై వచ్చిస్తే మెరుగైన ఫలితాలు రాబట్టగలం' అని భింద్రా అభిప్రాయపడ్డాడు.

గ్రీన్ అయ్యేనా హాట్‌కేక్!

నేడే ఐపీఎల్ మినీ వేలం

- చెన్నై, కోల్‌కతా మధ్య బిడ్డింగ్ వార్?
- వెంకటేష్, బిష్ణోయ్ ఏ గూటికో?



అబుధాబి: ఐపీఎల్ మినీ వేలం ఎప్పుడూ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ జరిగే వేలంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌కు భారీ డిమాండ్ నెలకొనే అవకాశం ఉంది. భారీ మొత్తంతో ఉన్న కోల్‌కతా, చెన్నై ఫ్రాంచైజీలు.. గ్రీన్‌ను దక్కించుకొనేందుకు పోటీపడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా 10 జట్లలో ఖాళీగా ఉన్న 77 స్థానాల కోసం మినీ వేలం జరగనుంది. ఇందుకోసం 359 మందితో కూడిన జాబితాను బీసీసీఐ విడుదల చేసింది. అన్ని ఫ్రాంచైజీల వద్దనున్న మొత్తం రూ. 237.5 కోట్లు. అయితే, అత్యల్ప మొత్తం రూ. 2.75 కోట్లు మాత్రమే కలిగి ఉన్న ముంబై వేలంలో పెద్దగా పోటీపడే చాన్సులేదు. ప్రతిభగల అన్‌క్యాప్డ్ ప్లేయర్లను ఆ జట్టు కొనుగోలు చేయవచ్చు. గ్రీన్‌తోపాటు రూ. 2 కోట్ల కనీస ధర కేటగిరీలో ఉన్న భారత ఆటగాళ్లు వెంకటేష్ అయ్యర్, రవి బిష్ణోయ్, విండీస్ ప్లేయర్ హోల్డర్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడొచ్చు. ఈసారి సరికొత్త జట్టును తయారు చేసుకొనేందుకు కోల్‌కతా ఎక్కువ మంది ఆటగాళ్లను వదిలేసింది. ముఖ్యంగా ఇద్దరు టాపార్డర్ బ్యాటర్లు, ఆల్‌రౌండర్ ఆ జట్టుకు ఎంతో అవసరం. గత సీజన్‌లో వెంకటేష్ అయ్యర్‌ను రూ. 23.75 కోట్లకు ఖరీదు చేసిన కోల్‌కతా.. ఈసారి అతడిని తక్కువ ధరకే దక్కించుకోవాలనుకొంటోంది. అయితే, రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) అవకాశం లేదు.

గరిష్ఠంగా రూ. 18 కోట్లే?: గత మినీ వేలంలో ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ (రూ. 24.75 కోట్లు) అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈమారు గ్రీన్ సరికొత్త రికార్డు నెలకొల్పుతాడని క్రికెట్ పండితులు లెక్కలు వేస్తున్నారు. ఒకవేళ బిడ్డింగ్‌లో గ్రీన్ రూ. 25 కోట్లు పలికినా.. ఐపీఎల్ 'గరిష్ఠ ఫీజు' నిబంధన కింద అతడికి రూ. 18 కోట్లు మాత్రమే చెల్లిస్తారు. మిగతా మొత్తం బీసీసీఐకి చేరుతుంది. ఈ నిబంధన ప్రకారం మినీ వేలంలో విదేశీ ఆటగాళ్ల అత్యధిక ఫీజు.. మెగా వేలంలో గరిష్ఠ ధర (రిషభ్ పంత్ రూ. 27 కోట్లు), అత్యధిక రిటైన్ స్లాబ్ (రూ. 18 కోట్లు) మధ్య ఏది తక్కువైతే అదే చెల్లించాలనే పరిమితి విధించారు. వేలంలో విదేశీ క్రికెటర్ల కోసం భారీగా కాసులు కుమ్మరిస్తుండడంతో.. ఫ్రాంచైజీల విజ్ఞప్తి మేరకు ఈ రూల్‌ను ప్రవేశపెట్టారు. ఇంగ్లండ్ క్రికెటర్ లివింగ్ స్టోన్, సౌతాఫ్రికా కీపర్ డికాక్ కోసం ఆయా జట్లు ఆసక్తి ప్రదర్శించొచ్చు. గత వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పృథ్వీ షా, సర్ఫరాజ్‌లు ఈసారైనా అవకాశం దక్కుతుందనే ఆశతో ఉన్నారు. చెన్నై వదిలేసిన శ్రీలంక పేసర్ మతీశ పతిరన కోసం లఖ్‌నవూ పోటీపడే అవకాశం లేకపోలేదు. అన్‌క్యాప్డ్ భారత ఆటగాళ్లు అశోక్ శర్మ, ప్రశాంత్ వీర్, ముకుల్ చౌదరిలు ఫ్రాంచైజీల దృష్టిలో ఉన్నారు.

జట్టు	ఉన్న డబ్బు	ఖాళీలు
కోల్‌కతా	రూ. 64.30 కోట్లు	13 (6 విదేశీ)
చెన్నై	రూ. 43.40 కోట్లు	9 (4 విదేశీ)
హైదరాబాద్	రూ. 25.50 కోట్లు	10 (2 విదేశీ)
లఖ్‌నవూ	రూ. 22.95 కోట్లు	6 (4 విదేశీ)
ఢిల్లీ	రూ. 21.80 కోట్లు	8 (5 విదేశీ)
బెంగళూరు	రూ. 16.40 కోట్లు	8 (2 విదేశీ)
రాజస్థాన్	రూ. 16.05 కోట్లు	9 (1 విదేశీ)
గుజరాత్	రూ. 12.90 కోట్లు	5 (4 విదేశీ)
పంజాబ్	రూ. 11.50 కోట్లు	4 (2 విదేశీ)
ముంబై	రూ. 2.75 కోట్లు	5 (1 విదేశీ)

అక్షర్ అవుట్

టీ20 సిరీస్ జట్టులోకి షాబాజ్



న్యూఢిల్లీ: అనారోగ్యం కారణంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌కు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ దూరమయ్యాడు. మిగిలిన రెండు మ్యాచ్‌లకు అతడి స్థానంలో షాబాజ్ అహ్మద్‌ను ఎంపిక చేసినట్టు బీసీసీఐ సోమవారం తెలిపింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ధర్మశాలతో జరిగిన మూడో మ్యాచ్‌కు అక్షర్ దూరమయ్యాడు. అతడి స్థానంలో కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకొన్నారు. 'ప్రస్తుతం అక్షర్ జట్టుతోనే ఉన్నాడు. వైద్యులు అతడిని పర్యవేక్షిస్తున్నారు. లఖ్‌నవూ, అహ్మదాబాద్‌లో జరిగే టీ20లకు అక్షర్ స్థానాన్ని షాబాజ్‌తో భర్తీ చేశామ'ని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా చెప్పాడు. 31ఏళ్ల షాబాజ్ 2 టీ20లు, 3 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు.

అర్జున రణతుంగ సోదరుడి అరెస్ట్

కొలంబో: శ్రీలంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ అన్న, మాజీ క్రికెటర్ ధమ్మిక రణతుంగను ఆ దేశ అవినీతి నిరోధక కమిషన్ సోమవారం అరెస్ట్ చేసింది. అనంతరం అతడు బెయిల్‌పై విడుదలయ్యాడు. మాజీ టెస్ట్ క్రికెటర్ అయిన 63 ఏళ్ల ధమ్మిక 2017లో ప్రభుత్వ అధీనంలోని సిలోన్ పెట్రోలియం కార్పొరేషన్ (సీపీసీ) చైర్మన్‌గా ఉన్నాడు. ఆ సమయంలో క్రూడ్ ఆయిల్ కొనుగోళ్ల టెండర్లలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో రెండో నిందితుడైన అర్జున రణతుంగ విదేశాల్లో ఉండడంతో ఆయనను అరెస్ట్ చేయలేకపోయినట్టు కమిషన్ తెలిపింది. ధమ్మిక సీపీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు అర్జున రణతుంగ దేశ పెట్రోలియం, పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరించారు.

బీసీసీఐకి ఎన్‌ఎస్‌ఎఫ్ గుర్తింపు లేదు

కేంద్ర క్రీడాశాఖ

న్యూఢిల్లీ: బీసీసీఐ..గుర్తింపు పొంది న జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్) కాదని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య లోక్‌సభకు స్పష్టంజేశారు. జాతీయ క్రీడా పరిపాలన చట్టం వచ్చే ఏడాది అమలులోకి వచ్చాక బీసీసీఐకి ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మాలా రాయ్ సోమవారం అడిగిన ప్రశ్నకు మాండవ్య బదులిచ్చారు.

హజారేలో అందరూ ఆడాల్సిందే: బీసీసీఐ

న్యూఢిల్లీ: ప్రస్తుత భారత జట్టులోని ఆటగాళ్లంతా విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సిందేనని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈనెల 24 నుంచి ఈ వన్డే టోర్నీ జరుగనుంది. ఈనేపథ్యంలో జాతీయ జట్టులోని ప్లేయర్లు కనీసం రెండు మ్యాచ్‌ల్లోనైనా పాల్గొనాలని ఆదేశించింది. కోహ్లీ ఢిల్లీకి, రోహిత్ ముంబైకి ఆడబోతున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

24.32 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రజా పంపిణీ అవసరాల కోసం ఈ ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే రైతుల నుంచి రూ.5,768.61 కోట్ల విలువైన 24,32,639 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు సగం లక్ష్యాన్ని చేరుకుంది. ఇప్పటి వరకు 3,85,005 మంది రైతులు ధాన్యాన్ని విక్రయించగా.. వారిలో 3,70,049 మంది ఖాతాల్లో రూ.5,544.65 కోట్లు జమ చేసినట్లు పౌరసరఫరాల సంస్థ ప్రకటించింది.

'మిషన్‌వాత్సల్య'లో 53 పోస్టులకు అనుమతి

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం కింద మహిళలు, పిల్లల సంరక్షణకు 53 కాంట్రాక్టు పోస్టుల సృష్టి, భర్తీకి అనుమతి ఇచ్చింది. రాష్ట్ర మహిళాశిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం కింద ఎస్ఏఆర్ఏ(స్టేట్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ)లో అదనపు ప్రోగ్రాం అధికారి పోస్టు ఒకటి, జిల్లాల వారీగా జిల్లా బాలల సంరక్షణ విభాగాల్లో అదనపు సంరక్షణ అధికారుల పోస్టులు 26, జిల్లా శిశు సంరక్షణ యూనిట్లలో సోషల్ వర్కర్ పోస్టులు 26 మంజూరయ్యాయి.

డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎరువుల డీలర్లు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దు చేస్తాం. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం' అని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నేడు రాయలసీమకు వర్షసూచన

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు వీస్తుడడంతో మంగళవారం తమిళనాడును ఆనుకుని ఉన్న రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఇక, రాష్ట్రంలో సోమవారం అనేకచోట్ల చలి గాలుల ప్రభావం కొనసాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కిలగాడలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఉపాధి వేతనాలకు 988 కోట్లు విడుదల

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనాల కోసం రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.988 కోట్లు విడుదల చేసింది. సకాలంతో ఉపాధి కార్మికులకు వేతనాల చెల్లింపునకు, వారి జీవనోపాధి భద్రతకు ఈ నిధులు విడుదల చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఏపీకి ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు రూ. 7,669 కోట్లు ఇచ్చింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చడం, అభివృద్ధి అందరికీ చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు పేర్కొంది.

ఆరోగ్యశాఖలో ఏఐ టెక్నాలజీ: సౌరభ్ గౌర్

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలోని హెల్త్ డేటా ఆధారంగా ఏఐను అనుసంధానం చేయనున్నట్టు ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడించారు. సోమవారం విజయవాడలో 'రీజినల్ మల్టీ స్టేక్ హోల్డర్స్ కన్వర్షన్ వర్క్‌షాప్ ఆన్ నేషనల్ ఏఐ స్ట్రాటజీ ఫర్ హెల్త్' అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. డబ్ల్యూహెచ్‌వో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, కేంద్ర ప్రభుత్వం సయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ నుంచి ఆరోగ్యశాఖ, ఐటీ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆరోగ్యశాఖలో ఏఐ వినియోగం ద్వారా అత్యుత్తమ ఫలితాలు వస్తాయని సౌరబ్ గౌర్ అన్నారు. ఏఐ వినియోగంపై ఫిబ్రవరిలో ముసాయిదా పాలసీని తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జోనల్ స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని తెలిపారు.



విద్యుత్ బిల్లులు తగ్గాయి..
ప్రభుత్వ సేవలూ మెరుగయ్యాయి!

తహసీల్దార్, ఎంపీడీవోలకు కృతజ్ఞతలు చెప్తున్న శ్యామ్‌కుమార్

అధికారులకు ప్రభుత్వ ఉద్యోగి కృతజ్ఞతలు

అద్దంకి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లుల భారం తగ్గించటం, ప్రభుత్వ సేవలు వేగవంతం కావటాన్ని అభినందిస్తూ బాపట్ల జిల్లా అద్దంకిలో ప్రభుత్వ ఉద్యోగి అయిన శ్యామ్‌కుమార్ సోమవారం అధికారులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా తమ ఇంటి కరెంటు బిల్లు నెలకు సరాసరిన రూ.2,200 నుంచి రూ.2,300 వచ్చేదని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల భారం తగ్గిందని, నెలకు రూ.500 వరకు ఆదా అయ్యిందని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ సేవలు మెరుగయ్యాయని, తన కుమారుడికి అవసరమైన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే నాలుగు రోజుల్లోనే అందించారంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో వరూధినిలను కలిసి పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.

'పదోన్నతి' తీర్పు అమలు చేస్తాం!

- ప్రస్తుతం మంత్రివర్గ ఉపసంఘం చూస్తోంది
- పరిష్కార మార్గాన్ని మంత్రులు పరిశీలిస్తున్నారు
- 4 వారాల టైమ్ ఇవ్వండి: హైకోర్టుకు ఏజీ వినతి

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతి కల్పించే విషయంపై 2018లో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని, అయితే.. దీనికి మరో నాలుగువారాల గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఇది రెండు గ్రూపుల మధ్య వ్యహారమని, పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం(జీవోఎం) ఏర్పాటు చేసిందని, ఈ వ్యవహారం తుది దశలో ఉందని తెలిపారు. గతంలో కార్యదర్శులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికలో పదోన్నతులు కల్పించేందుకు ఎన్ని సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలనే విషయంపై సరైన లెక్క లేదని, ఆ అంశాన్ని తేల్చాల్సి ఉందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం విచారణను జనవరి 20కి వాయిదా వేసింది. తదుపరి విచారణకు సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి హాజరుకు మినహాయింపు ఇచ్చింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు 2016, 2017లో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు పదోన్నతుల్లో అన్ని వర్గాల ఉద్యోగులకు తగినంత ప్రాతినిధ్యం ఉందా? లేదా? అనే విషయాన్ని కనీస అధ్యయనం చేయకుండా రిజర్వేషన్ కల్పించారని తప్పుబట్టింది. బాధిత ఉద్యోగుల వాదనలు విని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కి అనుగుణంగా ప్రతి ఉద్యోగి పదోన్నతిని సమీక్షించాలని 2018, డిసెంబరు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో 'ది సెక్రెటేరియట్ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయిస్' అసోసియేషన్, మరికొందరు ఉద్యోగులు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లు ఇటీవల విచారణకు రాగా పదోన్నతుల కల్పన విషయంలో జాప్యంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా తమ ముందు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం. నాయక్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ధర్మాసనం ముందు హాజరయ్యారు. విచారణ ప్రారంభమైన వెంటనే ఏజీ స్పందిస్తూ.. ఉత్తర్వుల అమలుకు చివరి అవకాశంగా మరో 4 వారాల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇది రెండు గ్రూపుల మధ్య వ్యవహారమన్నారు.

అలా అయితేనే గడువు

ఉద్యోగుల తరపు న్యాయవాదులు స్పందిస్తూ... సచివాలయ ఉద్యోగుల పదోన్నతి విషయంలో మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని 33శాఖల్లో ఉన్న ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టయితే ఏజీ కోరినట్లు 4 వారాల సమయం ఇస్తే అభ్యంతరం లేదన్నారు. తీర్పు అమలు చేయకుండా ప్రభుత్వం కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. పదోన్నతుల కల్పన విషయంలో ఉత్తర్వులు ఇచ్చి ఏళ్లు గడిచిందని గుర్తు చేసింది. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకుని విచారణను జనవరి 20కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.



ముహూర్తపు బంధాలపై
సోషల్ మీడియా పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్నాయి. దీంతో చాలామంది అబ్బాయిలు, అమ్మాయిలు.. పెళ్లి బంధంతో ఒక్కటవాలని నిర్ణయించుకోవడానికి ముందే ఎదుటివారి సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాను చూడబోయే అమ్మాయి ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను పరిశీలించాడు. అందులో అమె ఒక ఫిట్‌నెస్ ట్రైనర్‌తో ఎక్కువగా ఇంటరాక్ట్ అవ్వడం, అతని పోస్టులకు వరుసగా 'లైక్స్' పెట్టడం చూశాడు. పెళ్లి చూపుల్లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించగా.. "అతను నా చిన్ననాటి స్నేహితుడు, అందులో తప్పేముంది?" అని ఆమె బదులిచ్చింది. కారణమేదైనా అతడికి ఆ విషయం నచ్చకపోవడంతో ఆ సంబంధం వద్దనుకున్నాడు.

> ఒక బహుళజాతి కంపెనీలో పనిచేసే అంకితకు (పేరు మార్చాం).. అమెరికాలో స్థిరపడిన తెలుగు అబ్బాయి మోహిత్‌కు పెళ్లి నిశ్చయమైంది. కానీ.. ఆఫీసు వాళ్లు ఇచ్చిన ఒక పార్టీలో మోహిత్ తన సహోద్యోగితో సన్నిహితంగా ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో చూసింది. ఆ సహోద్యోగి పోస్ట్‌కి మోహిత్ పెట్టిన కామెంట్‌ను తప్పుగా అర్థం చేసుకుంది. ఎంతో మంది చెప్పినా వినకుండా పెళ్లి రద్దు చేసుకుంది.
>
> పెళ్లిళ్ల పెటాకులవడం కాదు... పెట్టుకున్న ముహూర్తానికి పెళ్లిపీటలు ఎక్కకముందే ఆ బంధాలు పెటాకులవుతున్న వైనమిది! పసుపు పారాణితో పచ్చటి పందిట్లో పెళ్లి బంధంతో ఒక్కటవ్వాల్సిన జంటల మధ్య సోషల్ మీడియా పెడుతున్న చిచ్చు ఇది!!

రూ.కోటి బడ్జెట్‌తో సంగీత్.. ఆగినపెళ్లి..

సికింద్రాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త కొడుకు పెళ్లి సందర్భంగా సంగీత్ వేడుకకు కోటి రూపాయలకు పైగా ఖర్చుచేశారు. వేడుక ఘనంగా జరిగింది. కానీ.. సంగీత్ అయిన మరుసటి రోజు ఉదయం వధువు తన పాత స్నేహితుడితో చాటింగ్‌లో ఉండటాన్ని వరుడు గమనించాడు. పెళ్లి రద్దు చేసుకున్నాడు. అలాగే.. ఖమ్మం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రియ.. నిత్యం ఇన్‌స్టాగ్రామ్‌లో సరదాగా రీల్స్ చేస్తుండేది. అందులో భాగంగా ఆమె కొందరు యువ స్నేహితులతో కలిసి డ్యాన్స్ చేసేది. సరదాగా నటించేది. ఆ అమ్మాయికి రాహుల్ అనే అబ్బాయితో పెళ్లి కుదిరింది. అయితే.. ఆమె రీల్స్ చూసిన రాహుల్.. 'పెళ్లయిన తర్వాత ఇలా చేయడం పద్ధతి కాదు. ఇవన్నీ నీ వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపిస్తాయి' అని చెప్పాడు. ఆమె సర్దిచెప్పడానికి ప్రయత్నించినా రాహుల్ సోషల్ మీడియాలో ఆమె ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతోందని నమ్మి ఆమెను పూర్తిగా అర్థం చేసుకోకుండానే పెళ్లిని రద్దు చేసుకున్నాడు. పెళ్లయిన జంటలనూ ఈ సోషల్ మీడియా సందేశాలు విడదీస్తున్నాయి. ఉదాహరణకు.. బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న వంశీ, లక్ష్మీలకు (పేర్లు మార్చాం) ఘనంగా పెళ్లయింది. ఆరు నెలల తర్వాత వంశీకి, లక్ష్మీ పాత ఫేస్‌బుక్ మెసేజ్‌లు కనిపించాయి. అందులో లక్ష్మి తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌తో పెళ్లికి ముందు చేసిన చాటింగ్ ఉంది. బాయ్‌ఫ్రెండ్ విషయం 'పెళ్లికి ముందు ఎందుకు నాకు చెప్పలేదు' అంటూ గొడవ మొదలుపెట్టాడు. దీంతో వారిద్దరూ విడాకులు తీసుకున్నారు.

చర్చనీయాంశంగా స్మృతి మందన్న పెళ్లి రద్దు

భారత మహిళా క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన స్మృతి మందన్నకు.. సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో వివాహం ఖరారై.. చివరిని మిషంలో రద్దయిన సంగతి తెలిసిందే. ఇద్దరూ కలిసి నిర్వహించిన అనేక ప్రీవెడ్డింగ్ షూట్‌లు, సంగీత్ ఈవెంట్లు.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తీరా.. పెళ్లికి కొన్ని గంటల ముందు స్మృతి తండ్రి ఆసుపత్రిలో చేరడంతో పెళ్లి వాయిదా వేసి.. ఆ తర్వాత రద్దు చేసుకున్నారు. పలాష్ గతంతో ఇతరులతో సన్నిహితంగా ఉన్న చాటింగ్, చిత్రాలు బయటికి రావడంతోనే ఈ పెళ్లి రద్దయిందనే వాదనా ఉంది. వీరి పెళ్లి రద్దయిన సంగతి.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

అనుమానాలు వద్దు..

బంధాలు బీటలువారడానికి కారణమవుతున్న సోషల్ మీడియా ముప్పు నుంచి తప్పించుకోవాలంటే.. పెళ్లితో ఒక్కటి కావాలనుకుంటున్న అమ్మాయిలు, అబ్బాయిలు, వారి కుటుంబాలు పరిపక్వతతో వ్యవహరించాలని మానసిక ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎదుటివారి సోషల్ మీడియా కామెంట్లు, వాటిలో పెట్టే ఫొటోలు, వీడియోలు.. ఇలా ప్రతిదాన్నీ అనుమానాస్పద దృష్టితో చూడకూడదని చెబుతున్నారు. ఒకవేళ గతంలో ఎవరితోనైనా బంధంలో ఉండి, దాన్నుంచి బయటపడితే.. పెళ్లి కుదిరే సమయంలోనే ఆ విషయాన్ని నిజాయితీగా చెప్పడం అనుమానాలను నివారించడానికి ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. అలాగే.. ఇద్దరూ ఎంత సమయం ఫోన్‌లో గడపాలి? ఎలాంటి పోస్టులు పెట్టాలి? ఎవరితో చాట్ చేయాలి? అనే విషయాలపై ఇద్దరూ కలిసి ముందే మాట్లాడుకోవాలని.. ఒక డిజిటల్ సరిహద్దును ఏర్పరచుకోవాలని సలహా ఇస్తున్నారు. జీవితభాగస్వామి మొబైల్‌ను.. వారి అనుమతి లేకుండా, అనుమానంతో తరచుగా చెక్ చేయకూడదని, ఇది వారి వ్యక్తిగత గోప్యత హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టుల వల్ల అనుమానాలు పెరిగి గొడవలకు దారితీస్తే.. విడాకులు, పెళ్లి రద్దు వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదని, కౌన్సిలింగ్ నిపుణులను ఆశ్రయించడం ఉత్తమం అని వారు సూచిస్తున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఆద్యంతం హాస్య భరితం



విష్వక్సేన్ కథానాయకుడిగా 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. 'మా చిత్రం నవ్వుల విందుకు సిద్ధమైంది. ముందుగా అనుకున్నట్లు వేసవికి కాకుండా ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 13న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం' అని పేర్కొన్నారు. స్వచ్ఛమైన కామెడీతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులను గిలిగింతలు పెడుతుందని తెలిపారు. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో విష్వక్సేన్ దర్శకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: సురేశ్ సారంగం, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



కొత్త చిత్రం ప్రారంభం

బాబీ సింహా, హెబ్బా పటేల్ జంటగా మెహర్ యరమతి దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త చిత్రం సోమవారం ప్రారంభమైంది. యువ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యువ కృష్ణ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఎస్‌కేఎన్ క్లాప్ కొట్టారు. మరో నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు తనికెళ్ల భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్మాత యువకృష్ణ మాట్లాడుతూ 'మెహర్ ఈ కథ చెప్పిన వెంటనే నచ్చింది. నటనకి మంచి ఆస్కారమున్న చిత్రమిది' అని అన్నారు. హీరో బాబీ సింహా మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఈనెల 22 నుంచి వైజాగ్‌లో షూటింగ్ ప్రారంభించబోతున్నాం' అని చెప్పారు.

పది రోజుల్లో రూ. 500 కోట్లు!



రణ్‌వీర్‌సింగ్ నటించిన 'దురంధర్' చిత్రం బాలీవుడ్ బాక్సాఫీసు దుమ్ము దులుపుతోంది. ఈ నెల 5న విడుదలైన ఈ యాక్షన్ స్పై డ్రామా రోజురోజుకీ కలెక్షన్లు పెంచుకుంటూ ఇప్పుడు పది రోజుల్లో ఏకంగా రూ. 552 కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించింది. మరికొన్ని రోజుల్లో రూ. వెయ్యి కోట్లు వసూలు చేసినా ఆశ్చర్యపడనక్కర్లేదని ట్రేడ్ పండితులు అంటున్నారు. మూడో వారంలోకి అడుగుపెడుతున్నా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదని చెబుతున్నారు. సోమవారం సైతం బుక్ మై షో లో గంటకు 20 వేల టికెట్లు తెగడం చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ నెలలో థియేటర్లకు కానీ, ఓటీటీలో కానీ వచ్చే సినిమాలు ఏవీ లేకపోవడం కూడా ఈ కలెక్షన్ల సునామీకి ఓ కారణం. 'ఈ రోజుల్లో ఇంత నిడివి(మూడున్నర గంటలు) ఉన్న సినిమాను ఎవరు చూస్తారబ్బా' అని విసుక్కున్న వాళ్లే 'దురంధర్' చిత్రాన్ని చూడడానికి థియేటర్లకు పోటెత్తుతున్న ప్రేక్షకులను చూసి నివ్వెరపోతున్నారు. కథాంశం బాగుంటే నిడివి ఎక్కువైనా ప్రేక్షకులు పట్టించుకోరని 'దురంధర్' చిత్రంతో మరోసారి రుజువైంది. 2025లో అత్యధిక కలెక్షన్లు వసూలు చేసిన చిత్రాల్లో 'దురంధర్' ది ప్రస్తుతానికి నాలుగో స్థానం. 'కాంతార చాప్టర్ 1', 'ఛావా', 'సయారా' చిత్రాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. వరుస అపజయాలతో సతమతమవుతున్న హీరో రణ్‌వీర్ సింగ్‌కు 'దురంధర్' చిత్రం భారీ ఉపశమనం. ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించిన అక్షయ్ ఖన్నాకు కూడా మంచి పేరు వచ్చింది.

ఆ పాకిస్థానీ సినిమాను కాపీ కొట్టారా?

కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీసిన ఈ సినిమాను చూసి భారతీయులు సంబరపడుతుంటే పాకిస్థాన్ మాత్రం రుసురుసలాడుతోంది. అక్కడి కళాకారులు, సినీ ప్రముఖులు 'దురంధర్' చిత్రం గురించి రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. 2022లో వచ్చిన పాకిస్థానీ చిత్రం 'చౌదరి అస్లామ్' చూసి ప్రేరణ పొంది 'దురంధర్' చిత్రాన్ని తీశారని నటుడు ఖుమర్ రెజా అన్నారు. అస్లామ్ ఓ పోలీస్ ఆఫీసర్, 2014లో జరిగిన కారు బాంబ్ బ్లాస్ట్‌లో ఆయన మరణించారు. ఆయన జీవిత కథ ఆధారంగా రూపొందిన 'చౌదరి అస్లామ్' చిత్రంతో ప్రేరణ పొంది 'దురంధర్' సినిమా తీశారని రెజా ఆరోపణ. 'దురంధర్' చిత్రంలో సంజయ్ దత్ చౌదరి అస్లామ్ పాత్ర పోషించిన సంగతి విదితమే. పాకిస్థాన్ ఏడుపు ఎలా ఉన్నా తిరుగులేని ఆధిక్యంతో దూసుకుపోతోంది 'దురంధర్' చిత్రం. విమర్శల్ని పట్టించుకోకుండా ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందించే పనిలో బిజీగా ఉన్నారు దర్శకుడు ఆదిత్య ధర్.

కోర్టు తీర్పుపై బాధిత నటి పోస్టు

● షేర్ చేసిన పృథ్వీరాజ్ సుకుమారన్



మలయాళ నటిపై లైంగిక దాడి కేసులో ఎర్నాకుళం సెషన్స్ కోర్టు ఇటీవలె తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. నటుడు దిలీప్‌ను నిర్దోషిగా ప్రకటించింది న్యాయస్థానం. ఆరుగురిని దోషులుగా తేల్చి.. వారికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుపై బాధిత నటి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. '8 ఏళ్ల 9 నెలల 23 రోజుల బాధాకరమైన ఈ ప్రయాణంలో ఇప్పుడు ఉపశమనం కలిగినట్లుగా ఉంది. అంతా అనుకుంటున్నట్లు ఏ1 అనుమానితుడు నా వ్యక్తిగత డ్రైవర్ కాదు. నా ఉద్యోగి కూడా కాదు. అదంతా అసత్యం. అప్పట్లో నేను నటించిన ఓ సినిమా నిర్మాణ సంస్థ తరపు డ్రైవర్ ఆయన. ఆ ఘటన ముందు ఆయన్ను ఒకట్రెండు సార్లు చూశానంతే. వదంతులు వ్యాప్తి చేయడం ఆపండి. ఈ తీర్పు నన్నేమి ఆశ్చర్యపరచలేదు. ఈ కేసులో ఏదో పొరపాటు జరుగుతోందని నాకు 2020లోనే అనిపించింది. ఈ కేసు విషయంలో హైకోర్టు, సుప్రీం కోర్టును పలుసార్లు ఆశ్రయించి.. ట్రయల్ కోర్టుపై నమ్మకం లేదని చెప్పా. ప్రతిసారీ.. నా విజ్ఞప్తి తిరస్కరణకు గురయ్యేది. ఈ ప్రయాణంలో చట్టం ముందు అందరూ సమానులు కారని అర్థమైంది. ఇప్పటివరకూ నాకు అండగా నిలబడిన వారందరికీ కృతజ్ఞతలు' అని ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సుదీర్ఘ పోస్టు ద్వారా పేర్కొన్నారు. ఈ పోస్టును నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ షేర్ చేసి నటికి మద్దతుగా నిలిచారు. దిలీప్ మాజీ భార్య, నటి మంజు వారియర్ కూడా ఈ పోస్టుపై స్పందించారు. 'నేరం చేసిన వారికి శిక్ష పడింది. కానీ, ఈ దారుణానికి సూత్రధారి అయిన వ్యక్తి మాత్రం స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. ఈ నేరం వెనుక ఉన్న వారందరికీ శిక్ష పడినప్పుడే పూర్తి న్యాయం దక్కినట్లు అవుతుంది' అని పేర్కొన్నారు.

ఎమ్మెస్ సుబ్బలక్ష్మిగా సాయిపల్లవి?





ఆవిడ పాడిన భక్తి పాటలు ప్రతిరోజు వింటూ ఎంతో మంది పరవశించిపోతుంటారు ఆధ్యాత్మిక సంగీతంలో తిరుగులేని పాటవాన్ని ప్రదర్శించిన కర్నాటక సంగీత విద్వాంసురాలు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి తన జీవిత కాలంలో లెక్కలేనన్ని పురస్కారాలు పొందారు. సంగీత విభాగంలో భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న పొందిన తొలి గాయకురాలు ఆవిడే! 'సంగీత రాణి'గా ప్రశంసలు అందుకున్న సుబ్బలక్ష్మి జీవిత కథను తెరకెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయా అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. అగ్ర నిర్మాత అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మించే ప్రయత్నంలో ఉన్నారనీ, దర్శకుడిగా గౌతమ్ తిన్ననూరిని ఎంపిక చేశారనీ వార్తలు వినిపిస్తున్నాయి. సుబ్బలక్ష్మి పాత్ర కోసం నటి సాయిపల్లవిని సంప్రదిస్తే ఆమె ఆనందంగా అంగీకరించారని చెబుతున్నారు. అయితే ఈ వార్తను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. వినిపిస్తున్న వార్తలు కార్యరూపం దాలిస్తే సాయిపల్లవి ఖాతాలో మరో మంచి పాత్ర పడినట్లే. ప్రస్తుతం 'రామాయణ' చిత్రంలో ఆమె సీతగా నటిస్తున్న సంగతి విదితమే.

టైటిల్ ఖరారు



శ్రీవిష్ణు కథానాయకుడిగా యదునాథ్ మారుతి రావు తెరకెక్కిస్తోన్న చిత్రం టైటిల్ ఖరారు అయింది. ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణేశ్వర సినిమాస్ బ్యానర్‌పై జి.సుమంత్ నాయుడు నిర్మిస్తున్నారు. కామెడీ ప్రధానంగా రూపొందుతున్న ఈ సినిమా టైటిల్‌ను 'విష్ణు విన్యాసం'గా మేకర్స్ ఖరారు చేశారు. ఈ మేరకు టీజర్‌ని కూడా విడుదల చేశారు. 'చరిత్ర, సంఖ్యాశాస్త్రం, జ్యోతిషం అన్నీ అతని కోసమే కనుగొన్నారు' అంటూ వినిపించే వాయిస్ ఓవర్ చిత్రంపై ఆసక్తిని కలిగిస్తోంది. ఈ చిత్రంలో నయన సారిక కథానాయికగా నటిస్తుండగా, సత్య, బ్రహ్మాజీ, శ్రీకాంత్ అయ్యంగార్, శ్రీనివాస్ వడ్లమాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

కడుపుబ్బా నవ్వించే బ్యాడ్ గాళ్స్



రోహన్ సూర్య, మొయిన్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ఉపశీర్షిక. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' ఫేమ్ ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మించారు. ఈ నెల 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'జాతిరత్నాలు', 'మ్యాడ్' లాంటి చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నమే ఈ 'బ్యాడ్ గాళ్స్'. అందర్నీ కడుపుబ్బా నవ్విస్తుంది' అని ఫణి ప్రదీప్ ధూళిపూడి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: బొంతల నాగేశ్వర రెడ్డి, సినిమాటోగ్రఫీ: ఆర్లి గణేశ్, సంగీతం: అనూప్ రూబెన్స్.

ఆ చెరువు నేపథ్యం ఏమిటి?

భూతనాల చెరువు నేపథ్యం ఏమిటి, కాలేజీలో దాగున్న మిస్టరీ ఏమిటీ.. అనే ఆసక్తికరమైన అంశాలతో రూపుదిద్దుకున్న హారర్ చిత్రం 'జిన్' ఈ నెల 19న విడుదలవుతుందని చిత్ర నిర్మాత నిఖిల్ ఎం.గౌడ చెప్పారు.



అమ్మిత్ రావు, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తుమినాద్ తదితరులు నటించిన ఈ చిత్రానికి చినమయ్ రామ్ దర్శకత్వం వహించారు. 'దెయ్యాలు, ప్రేతాత్మలను ముస్లీం మతంలో జిన్ అంటారు. మా సినిమా చాలా కొత్తగా ఉంటుంది' అని చిత్రంలో మౌళ్వి పాత్ర పోషించిన అమిత్‌రావ్ చెప్పారు. సోమవారం జరిగిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత రాజ్ కందుకూరి, వీరభద్రం చౌదరి, నటుడు సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంటుంది



మురళీకాంత్

'దండోరా' టైటిల్ వినగానే ఎన్నో ఊహాగానాలు వచ్చి ఉంటాయి. కథ అలా ఉంటుందా? ఇలా ఉంటుందా? దర్శకుడు ఈ పాయింట్‌నే చెబుతున్నాడా? అని ఎవరికి వారు ఊహించుకుంటారు. కానీ, సినిమా చూసిన తర్వాత ప్రతీ ఒక్కరూ ఆశ్చర్యానికి లోనవుతారు. ఈ చిత్రంలోని స్క్రీన్‌ప్లే అంత అద్భుతంగా ఉంటుంది' అని తెలిపారు దర్శకుడు మురళీకాంత్. శివాజీ, నవదీప్, నందు ప్రధాన పాత్రధారులుగా ఆయన తెరకెక్కించిన చిత్రమిది. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మురళీకాంత్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.'గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల్ని పూడ్చేందుకు కులాల వారీగా, మతాల వారీగా కొంత మందికి భూమిని కేటాయిస్తారనే విషయం నాకు అంతగా తెలియదు. నాకు ఎదురైన ఓ అనుభవంతో ఈ కథను రాసుకున్నాను. మలయాళంలో ఎక్కువగా కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తాయని అంటుంటారు. మన దగ్గర ఎందుకు రావు? అనే ఆలోచన నుంచే ఈ కథ పుట్టింది. ఈ చిత్రంలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది. పాత్రలన్నీ శివాజీ క్యారెక్టర్‌తో లింక్ అయి ఉంటాయి. బిందు మాధవి శక్తిమంతమైన మహిళ పాత్రలో కనిపిస్తారు' అని అన్నారు.

నానో కాంక్రీట్‌తో అణు రియాక్టర్ల నిర్మాణం

- రేడియేషన్‌ను నిరోధించేందుకు అవకాశం
- బార్క్‌తో కలిసి పరిశోధనలకు అంగీకారం
- 'ఇన్‌స్వారెబ్' డైరెక్టర్ ఎన్.కాళిదాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్వారెబ్ డైరెక్టర్ కాళిదాసు. పక్కన పరిశోధకురాలు భానుమతి

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అణు రియాక్టర్ల నిర్మాణాలలో ఏర్పడే పగుళ్లను నానో కాంక్రీట్‌తో తగ్గించవచ్చని, దీనికి ఫ్లైయాష్ ఉపయోగపడుతుందని ఇనిస్టిట్యూట్ ఫర్ సాలిడ్ వేస్ట్ రిసెర్చ్ అండ్ ఎకలాజికల్ బ్యాలెన్స్ (ఇన్‌స్వారెబ్) వ్యవస్థాపక డైరెక్టర్ ఎన్.కాళిదాసు వెల్లడించారు. విశాఖపట్నంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో... ఈ పరిశోధనలు నిర్వహించిన తన భార్య భానుమతితో కలిసి ఆయన మాట్లాడారు. రియాక్టర్ ప్లాంట్ల నిర్మాణంలో పిక్క, ఇసుకతో కూడిన సిమెంట్ కాంక్రీట్‌ను ఉపయోగిస్తున్నారని, రేడియేషన్ వల్ల కాంక్రీట్‌లో క్రిస్టలైన్ అనే పదార్థం ఎమార్ఫస్‌గా మారి దాని పరిమాణం పెరుగుతుందని, అందుకే పగుళ్లు వస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ టోక్యో పరిశోధనల్లో వెల్లడైందన్నారు. 35 ఏళ్లుగా పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే ఫ్లైయాష్‌పై పరిశోధనలు చేస్తున్న భానుమతి.. ఎమార్ఫస్‌తో కూడిన ఫ్లైయాష్‌ను సిమెంట్‌తో కలిపితే కాంక్రీట్ బలం, మన్నిక పెరుగుతాయని గుర్తించారన్నారు. దేశంలో విస్తృతంగా అణు రియాక్టర్ల తయారీకి అనుమతిస్తున్న నేపథ్యంలో ఈ పరిశోధన ఫలితాలను కేంద్ర ప్రభుత్వంలో కీలక వ్యక్తులకు తెలియజేయగా, బాబా అణుశక్తి పరిశోధన సంస్థ (బార్క్)తో కలిసి పనిచేయాలని వారు సూచించారని చెప్పారు. దీనిపై బార్క్‌తో కలిసి పరిశోధనలు చేయడానికి ప్రతిపాదించామన్నారు. ఇప్పటివరకూ రియాక్టర్లలో షీల్డ్ వాల్‌ను కాంక్రీట్‌తో నిర్మిస్తున్నారని, దానికి బదులుగా నానో కాంక్రీట్ టెక్నాలజీని వినియోగిస్తే రేడియేషన్‌ను నిరోధించవచ్చని భానుమతి పరిశోధనల్లో నిర్ధారణ అయిందని కాళిదాసు చెప్పారు.



2 పవర్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- శ్రీసత్యసాయి జిల్లాలో 1700 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు
- అనంతపురం జిల్లాలో 300 మెగావాట్ల హైబ్రిడ్ ప్రాజెక్టు
- కుప్పంలో 10 టీపీడీ బయోగ్యాస్ ప్రాజెక్టుకూ ఓకే
- ప్రభుత్వం ఉత్తర్వులు.. 24 నెలల్లో పూర్తిచేయాలని గడువు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం తీసుకొచ్చిన ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024లో భాగంగా రాయలసీమ ప్రాంతంలో రెండు విద్యుత్తు ప్రాజెక్టులు, ఒక కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, గుడిబండ మండలాల్లోని గుడిబండ, కేకతి తదితర గ్రామాల్లో చింతా గ్రీన్ ఎనర్జీ సంస్థ 1700 మెగావాట్ల ఏసీ సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తుంది. సోలార్ ప్రాజెక్టుతోపాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్‌ను కూడా ఇక్కడ అభివృద్ధి చేస్తారు. అనంతపురం జిల్లా కనేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో గనేకో త్రీ ఎనర్జీ సంస్థ 300 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 152 మెగావాట్ల పవన, 148 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు.

కుప్పంలో బయోగ్యాస్ ప్రాజెక్టు.. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కృష్ణదాసనపల్లిలో శ్రేష్ఠ రెన్యువబుల్స్ సంస్థ 10 టీపీడీ (టన్స్ పర్ డే) సామర్థ్యంతో బయోగ్యాస్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక్కడ సీబీజీతో పాటు 80 టీపీడీ ఫాస్ఫేట్ రిచ్ ఆర్గానిక్ మెన్యూర్ (పీఆర్ఓఎం)ను ఉత్పత్తి చేస్తారు. దీనికి 120 టీపీడీ నేపియర్ గ్రాస్‌ను, కుప్పం నియోజకవర్గంలో ఉత్పత్తయ్యే 30 టీపీడీ తడి చెత్తను బయోగ్యాస్ ఉత్పత్తిలో వినియోగిస్తారు. ఈమేరకు ప్రభుత్వం సోమవారం జీవోలు విడుదల చేసింది. ఈ ప్రాజెక్టులను 24 నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించింది.



కార్పొరేట్ కళాశాల విద్యార్థులు యూనిఫాంతో వైసీపీ జెండాలను చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

వైసీపీ ర్యాలీలో 'ప్రైవేటు' విద్యార్థులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో వైసీపీ నిర్వహించిన కోటి సంతకాల ర్యాలీలో ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థులు తరలిరావడం చర్చనీయాంశమైంది. సోమవారం కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ నుంచి వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో నగరంలో రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన ఓ కార్పొరేట్ కళాశాల విద్యార్థులు వైసీపీ జెండాలను చేత పట్టుకుని తిరిగారు. ఇదిలా ఉండగా ర్యాలీకి వచ్చిన కళాశాల విద్యార్థుల చేతికి పార్టీ జెండాలు బలవంతంగా ఇచ్చి, ర్యాలీలో పాల్గొనేలా వైసీపీ నాయకులు వ్యవహరించారని సమాచారం. ఇదే అంశంపై నగరవ్యాప్తంగా చర్చ సాగుతోంది.

బడుల్లో బోధనేతర పనులు బంద్

- టెన్త్ పరీక్షలపైనే దృష్టి .. ప్రతి రోజూ స్లిప్ టెస్టులు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై పాఠశాల విద్యాశాఖ దృష్టి పెట్టింది. ఇప్పటికే వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో స్కూళ్లలో ఇకపై ఎలాంటి బోధనేతర పనులు ఉండకూడదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి. విజయరామ రాజు అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఆర్జేడీలు, డీఈవోలతో సమావేశం నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్నందున బడుల్లో ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. టెన్త్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, ప్రాథమిక బడుల్లో 'గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ' కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. కాగా, అన్ని జిల్లాల్లో ఉన్నత పాఠశాలకు ఒక గెజిటెడ్ అధికారిని కలెక్టర్లు నియమించారు. ఆ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులపై పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించారు. టెన్త్ ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారు. అలాగే టెన్త్ విద్యార్థులకు ప్రతిరోజూ స్లిప్ టెస్టులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, ఈ ఏడాది స్లిప్ టెస్టులకు పాఠశాల స్థాయిలోనే ప్రశ్నపత్రాలు రూపొందించుకునే వెసులుబాటు కల్పించింది. గతేడాది ఈ ప్రశ్నపత్రాలను పైస్థాయి నుంచి పంపించారు.

ఉత్తమ ఫలితాలు రాబట్టాలి: మంత్రి సవిత

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు రాబట్టాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే విద్యార్థులను సమాయత్తం చేయాలని ఏబీసీడబ్ల్యూఈఓలు, డీబీటీడబ్ల్యూఈఓలు, ఎంజేపీ కన్వీనర్లు, ప్రిన్సిపాళ్లను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి ఆమె జూమ్‌కాన్ఫరెన్స్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు తాజా, వేడి ఆహారం, వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలన్నారు. విశ్రాంత, తరగతి గదులకు దోమతెరలు వాడాలన్నారు. అధికారులు తరచుగా హాస్టళ్లు, గురుకులాలను సందర్శించాలని ఆదేశించారు. రాత్రిళ్లు హాస్టళ్లలో లేని వార్డెన్లను ఉపేక్షించేది లేదని, విద్యార్థుల భద్రత ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. మొత్తంగా ఫలితాలతో పాటు విద్యార్థులంతా ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలన్నారు. అంతకు ముందు సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సవిత... పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నల్లమలసాగర్ వ్యవహారమూ జైదీప్ గుప్తాకే!

- కృష్ణా ట్రైబ్యునల్‌లో ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది ఈయనే

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేస్తే.. దానిని సమర్థంగా తిప్పికొట్టేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ సిద్ధమైంది. కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫున ఇప్పటికే వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాకే ఆ బాధ్యత ఇవ్వాలని నిర్ణయించింది. ప్రాజెక్టు వివరాలను రాష్ట్ర అధికారులు సోమవారం ఆయనకు అందజేశారు. డీపీఆర్‌ను తయారు చేసుకునే అధికారం రాష్ట్రానికి ఉంటుందని, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు ఇతర రాష్ట్రాలకు ఉండదని గుప్తా బృందం గట్టిగా వాదనలు వినిపిస్తుందని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా.. కృష్ణా జలాల పునఃపంపిణీని వ్యతిరేకిస్తూ బుధ, గురువారాల్లో ట్రైబ్యునల్ ముందు రాష్ట్రం తన వాదనలు వినిపించనుంది.

భోగాపురంలో దేశంలోనే తొలి ఏఏడీ ఎడ్యుసిటీ

- జీఎంఆర్-మాన్సాస్ ఆధ్వర్యంలో 160 ఎకరాల్లో నిర్మాణం
- ఎడ్యుసిటీకి నేడు మంత్రి లోకేశ్ శ్రీకారం

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురంలో మరో ప్రఖ్యాత ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. విమానయాన రంగంలో నిపుణుల కొరత తీర్చే లక్ష్యంతో దేశంలోనే తొలి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ (ఏఏడీ) ఎడ్యుకేషన్ సిటీని స్థాపించేందుకు జీఎంఆర్-మాన్సాస్ శ్రీకారం చుట్టాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో 160ఎకరాల్లో ఏఏడీ ఎడ్యుసిటీని స్థాపించనున్నాయి. విమానయానం, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో నిపుణులను తయారుచేసేందుకు ప్రముఖ అంతర్జాతీయ యూనివర్సిటీలు ఇక్కడ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్రాజెక్టును మంత్రి లోకేశ్ మంగళవారం విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దేశవ్యాప్తంగా 200విమానాశ్రయాల్లో ప్రయాణికుల రాకపోకలు 700 మిలియన్లకు చేరుకున్నాయి. ఈ సంఖ్య 2030 నాటికి 1,700 మిలియన్‌లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ మార్కెట్ విలువ 2024లో 28.7 బిలియన్ డాలర్ల నుంచి 2034 నాటికి 57 బిలియన్ డాలర్లకు చేరుతుందని విమానయానరంగ నిపుణులు చెబుతున్నారు. ఈ వేగానికి తగ్గట్లు నైపుణ్యం ఉన్న మానవ వనరులు అందుబాటులో లేవు. దేశంలో విమానయాన రంగంలో తీవ్రమైన నిపుణుల కొరత ఉంది. అర్హత కలిగిన పైలెట్లు, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు (ఏఎంఈ)లు, విమాన భద్రతా నిపుణుల కొరత విమానయానరంగాన్ని వేధిస్తోంది. ఏరోస్పేస్ డిజైన్, సుస్థిర విమానయానం, ఏఐ/సైబర్ సెక్యూరిటీ యూఏవీ వ్యవస్థలు, స్పేస్ టెక్నాలజీలో ఉన్నత కోర్సులు దేశంలో చాలా తక్కువగా అందుబాటులో ఉన్నాయి. మొత్తం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో కేవలం 0.5 శాతమే ఏవియేషన్‌రంగం నుంచి వస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఏవియేషన్ రంగం ఎదుర్కొంటున్న నిపుణుల కొరతను అధిగమించేందుకు వీలుగా అర్హత, సామర్థ్యం కలిగిన వారిని సిద్ధం చేసేందుకు జీఎంఆర్-మాన్సాస్ ముందుకొచ్చాయి. దేశంలోనే తొలి సమగ్ర విద్య ఆవిష్కరణ కేంద్రంగా ఏఏడీ ఎడ్యుకేషన్ సిటీని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో స్థాపించేందుకు ఆ సంస్థలు సంయుక్తంగా సిద్ధమయ్యాయి. ఏఏడీ రంగానికి అంకితమైన తొలి సమీకృత విద్య, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో అంతర్జాతీయంగా పేరుగాంచిన యూనివర్సిటీల బ్రాంచ్ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. అడ్వాన్స్‌డ్ రీసెర్చ్, ఇన్నోవేషన్ సెంటర్లు, అప్లయిడ్ టెక్నాలజీస్‌పై అవి దృష్టి సారిస్తాయి. స్టార్టప్‌లు, పరిశ్రమలకు సహకారం కోసం ఇంక్యుబేషన్ ప్రొటో టైప్ సదుపాయాలను కల్పిస్తాయి. పైలట్లతో పాటు సాంకేతిక సమస్యలను ఛేదించగలిగే ఇంజనీరింగ్ విద్యార్థులను కూడా ఏఏడీ తయారు చేస్తుంది.

3 వారాల్లో 7 కోట్లు కట్టండి

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన ఇసుక అక్రమాలకు సంబంధించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) విధించిన రూ.18 కోట్ల జరిమానాలో రూ.7 కోట్లను ఇప్పుడు చెల్లించాలని జయప్రకాశ్ వెంచర్స్ పవర్ లిమిటెడ్(జేపీ వెంచర్స్)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లో చెల్లించడం పూర్తిచేయాలని తేల్చిచెప్పింది. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి ఎన్‌జీటీ రూ.18 కోట్ల జరిమానా విధించడాన్ని సవాల్ చేస్తూ జేపీ వెంచర్స్ 2023 మే 15న సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. జరిమానా చెల్లింపుపై కోర్టు జూలై 14న స్టే విధించింది. అయితే.. గత విచారణ సందర్భంగా 18 ఇసుక క్వారీల్లో ఏడు క్వారీలకు మాత్రమే తాము పర్యావరణ అనుమతులు తీసుకున్నామని.. 11 ఇసుక క్వారీలకు అప్పడు అధికారంలో ఉన్న ప్రభుత్వమే అనుమతులు తీసుకుందని జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఏడింటికి మాత్రమే తాము జరిమానా చెల్లిస్తామని, మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్ దాఖలుచేసింది. ఈ వ్యాజ్యం సోమవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఎన్‌జీటీ విధించిన జరిమానాలో రూ.7కోట్లు చెల్లించేందుకు జేపీ వెంచర్స్ అంగీకరించడంతో ఆ మొత్తాన్ని 3 వారాల్లో చెల్లించాలని కోర్టు స్పష్టంచేసింది. మిగిలిన జరిమానాపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటామంది. విచారణను జనవరి 23కి వాయిదా వేసింది.



ఏఐ విస్తరణకు సహకరించండి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రి లోకేశ్, రామ్మోహన్ నాయుడు, కంభంపాటి, కలిశెట్టి, భరత్, లావు, మహేశ్, సానా సతీశ్, శబరి, కనకమేడల

కేంద్ర మంత్రులకు మంత్రి లోకేశ్ వినతులు

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పలు ప్రాజెక్టులు సాధనే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి లోకేశ్ సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించారు. కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో లోకేశ్ భేటీ అయ్యారు. ఇండియా ఏఐ (కృత్రిమ మేధ) మిషన్ కింద రాష్ట్రంలో ఏఐని వేగంగా విస్తరింపజేసేందుకు మద్దతు అందించాలని అశ్వినీ వైష్ణవ్‌కు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణనకు కేంద్ర సహాయం కావాలన్నారు. ఏపీలో నైపుణ్య గణన కోసం అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రూపొందించిన నైపుణ్యం పోర్టల్ గురించి కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటుచేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ (ఎంఈఐటీవై) స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీఐహెచ్‌లో ఏవీజీసీ-ఎక్స్ఆర్, వేవెక్స్ ఫ్రేమ్‌వర్క్ కింద ఐఎన్ఎం ఎక్స్‌ఆర్ యానిమేషన్, ఏఆర్/వీఆర్, ఇమ్మెర్సివ్ టెక్నాలజీస్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర మంత్రిని లోకేశ్ కోరారు.

155 స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయండి

ఏపీలో విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకారం అందించాలని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో భేటీ సందర్భంగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 11 జవహర్ నవోదయ విద్యాలయాల (జేఎన్‌వీ) మంజూరుతో పాటు, రాష్ట్రంలో 12 కేవీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష సంస్కరణల్లో భాగంగా స్టార్స్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రానికి రూ. 4,400 కోట్ల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ. 1,270 కోట్ల అదనపు నిధుల మంజూరుకు ఆమోదం తెలపాలన్నారు. పీఎం పోషణ్ పథకం కింద పైలట్ ప్రాతిపదికన రాష్ట్రంలో 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతించాలన్నారు. గుంటూరు జిల్లా చినకాకానిలో అభివృద్ధి చేసిన మోడల్ ఆటిజం సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను లోకేశ్ ఆహ్వానించారు.

ఎన్ఎస్‌టీఐకి 5 ఎకరాలు

విశాఖపట్నంలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ (ఎన్ఎస్‌టీఐ) ఏర్పాటు చేయాలని కేంద్ర నైపుణ్య శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరికి రాష్ట్ర మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం మధ్యాహ్నం పార్లమెంటులోని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి, లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. విశాఖ జిల్లా పెదగంట్యాడలో 5 ఎకరాల స్థలాన్ని జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా గుర్తించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న పరిమితిని మించి ఎస్‌బీటీఈటీ-ఏపీ ద్వారా ఎన్‌సీవీఈటీ అర్హతలను స్వీకరించేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో మంత్రి లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంపీలు సానా సతీశ్, కలిశెట్టి అప్పలనాయుడు, బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పుట్టా మహేశ్, అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, తెన్నేటి కృష్ణప్రసాద్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శ్రీభరత్, వల్లభనేని బాలశౌరి తదితరులు ఉన్నారు.



లంకేవానిదిబ్బలో ప్రధానమంత్రి ఆవాస్ గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి

అర్హులందరికీ ఇళ్లు

4 లక్షల గృహ లబ్ధిదారులకు మొండిచెయ్యి చూపించిన జగన్: కొలుసు, అనగాని

రేపల్లె, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'కూటమి పాలనలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు నిర్మిస్తాం. ఐదేళ్ల పాలనలో 9 లక్షల గృహాలు నిర్మించి ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది' అని బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల జిల్లా లంకేవానిదిబ్బ గ్రామంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, వీఆర్వో సంస్థ సంయుక్త సహకారంతో నిర్మితమవుతున్న 39 పీఎంఏవై గృహాలకు సోమవారం మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో 9 లక్షల గృహాలను నిర్మించి పేదవారిని ఆదుకుంటుంది' అని అన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 'జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన తప్పులు ఒక దాని తరువాత ఒకటి వెలుగు చూస్తున్నాయి. వీటిపై ప్రజలు చర్చించుకుంటున్నారనే భయంతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది' అన్నారు. అనంతరం గిరిజనుల సామాజిక సభామందిరాన్ని ప్రారంభించారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పక్కన మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా

3 వేల కోట్లతో పనులు

జనవరి చివరి నాటికి గుంతలు లేని రోడ్లు: మంత్రి జనార్దన్‌రెడ్డి

మదనపల్లె, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జనవరి చివరి నాటికి గుంతలు లేని రహదారులుగా మారుస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా గుంతలు పడిన రోడ్లు ఉండకూడదన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు పని చేస్తున్నారన్నారు. సోమవారం మదనపల్లెకు విచ్చేసిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషాతో కలిసి రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'రాష్ట్రంలో 27 వేల కి.మీ. రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులకు ప్రభుత్వం రూ.3,000 కోట్లు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే కొన్ని పనులు పూర్తిచేయగా, మిగిలిన పనులను కూడా గడువులోగా పూర్తిచేస్తాం. అన్నమయ్య జిల్లాలో 2,148 కి.మీ. మేర గుంతల పూడ్చివేతకు రూ.123 కోట్లు మంజూరు చేశాం. స్థానిక ఎమ్మెల్యే వినతి మేరకు మదనపల్లె నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు, మరమ్మతులకు రూ.18 కోట్లు మంజూరు చేశాం. అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తాం' అని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఆశాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



హెల్మెట్‌పై పోలీసుల అవగాహన ర్యాలీ

నో హెల్మెట్.. నో పెట్రోల్..

- తిరుపతిలో కలెక్టర్, ఎస్పీ అవగాహన ర్యాలీ
- మంచి ఆలోచనంటూ ప్రశంసించిన సీఎం

తిరుపతి (నేరవిభాగం), అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ప్రతి ద్విచక్ర వాహనదారుడి బాధ్యత అని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. హెల్మెట్ లేకుంటే బంకుల్లో పెట్రోలు నింపరని స్పష్టం చేశారు. ప్రజలకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రిజర్వు పోలీసు గ్రౌండు నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఎస్పీ హెల్మెట్ ధరించి స్వయంగా వాహనం నడపగా.. కలెక్టర్ వెనక కూర్చున్నారు. కుటుంబ భవిష్యత్తు కోసం హెల్మెట్ ధరించాలని కలెక్టర్ సూచించారు. హెల్మెట్ ధరించడం పోలీసుల కోసం కాదని, అది మీ ప్రాణాల రక్షణ కోసమేనని ఎస్పీ స్పష్టం చేశారు.



తిరుపతిలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు

మంచి ఆలోచన: సీఎం

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు తిరుపతి జిల్లా పోలీసు శాఖ చేపట్టిన చర్యలు హర్షణీయమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం 'నో హెల్మెట్-నో పెట్రోల్' నిబంధనను తీసుకురావడం మంచి ఆలోచన అని అభిప్రాయపడ్డారు. కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మంచి సందేశాన్ని ఇచ్చారన్నారు.

మహిళా క్రికెటర్ శ్రీచరణికి 2.5 కోట్లు

500 గజాల ఇంటి స్థలం.. గ్రూప్-1 ఉద్యోగం

క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిన తెలుగమ్మాయి ఎన్ శ్రీచరణి.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన భారీ నజరానాను త్వరలోనే అందుకోనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీచరణికి రూ.2.5 కోట్ల నజరానా, ఇంటి స్థలం, గ్రూప్-1 ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. ఈ ప్రతిపాదన ఇటీవలే క్యాబినెట్ ముందకు రాగా.. దానికి ఆమోదం లభించింది. దీన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు ప్రోత్సాహంతోపాటు విశాఖలో 500 గజాల ఇంటి స్థలం, గ్రూప్-1 ఉద్యోగం (శ్రీచరణి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత) ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పర్యాటక, క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



గిరిజన శాఖలో పెండింగ్ పూర్తి


మంత్రి సంధ్యారాణి ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖలో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. పథకాల అమలుపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. గిరిజన విద్య, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక సమీక్ష చేపట్టారు. గిరిజన విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

వైసీపీ పాలనలో 3914 ఎంఎస్ఎంఈల మూత

▸▸ పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 3,914 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడినట్టు కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నకు కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 2020 నుంచి ఇప్పటివరకు మొత్తం 1,21,604 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడగా, 7.22 కోట్ల కొత్త రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. అయితే, కేవలం నష్టాల వల్లే పరిశ్రమలు మూతపడలేదని, డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు, యాజమాన్యాల మార్పు, ఇతర కారణాల వల్ల కూడా పోర్టల్‌లో డీ- రిజిస్టర్ (రద్దు) చేసుకున్నారని స్పష్టతనిచ్చారు.



హాట్ మెటల్ ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ రికార్డు

▸▸ 24 గంటల వ్యవధిలో 21,012 టన్నులు

▸▸ చిత్తశుద్ధిని నిరూపించుకున్న ఉక్కు ఉద్యోగులు

విశాఖపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు హాట్ మెటల్ ఉత్పత్తిలో సరికొత్త రికార్డు నమోదుచేసింది. ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులు ఉండగా వాటి ద్వారా రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం నిర్దేశిస్తే.. ఆదివారం ఉదయం ఆరు నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు బ్లాస్ట్‌ఫర్నేస్ 1,2,3 విభాగాల్లో.. వరుసగా 7,058 టన్నులు, 6,558, 7,396 టన్నులు కలిపి మొత్తం (ఏ,బీ,సీ షిఫ్ట్‌లు) 21,012 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి జరిగింది. ఇంతకుముందు అంటే 2025 నవంబరు 30న ఇదే ప్లాంటులో 20,440 టన్నుల హాట్‌మెటల్ ఉత్పత్తి చేశారు. అదే ఇప్పటివరకూ రికార్డు. దానిని అధిగమించి ఇప్పుడు ఉత్పత్తి రావడం విశేషం. ఈ విభాగంలో అధిక మొత్తంలో ఉత్పత్తి సాధించడంతో స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్) విభాగంలో ఉత్పత్తి మరింత పెరగనుంది. సంస్థ పట్ల తమకున్న నిబద్ధతకు, భవిష్యత్తు పట్ల ఆశాభావానికి ఇదే సంకేతమని ఉద్యోగ వర్గాలు ఈ సందర్భంగా పేర్కొన్నాయి. సమష్టి కృషి వల్లనే సాధ్యమైందని, అన్ని విభాగాల సహకారంతోనే దీనిని సాధించామని ఉద్యోగ, కార్మిక వర్గాలు పేర్కొన్నాయి. సంస్థను మళ్లీ లాభాల బాటలోకి తీసుకురావడానికి సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు ఈ సందర్భంగా డిమాండ్ చేశాయి.

అమరావతిలో 'బలిదాన విగ్రహం'!

58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నామకరణం: సీఎం

పొట్టి శ్రీరాములును గుర్తించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. 1985లో తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరే పెట్టారు. ఆయన నెల్లూరు జిల్లాలో పుట్టడంతో ఆ జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు నేనే పెట్టాను.

తెలుగుజాతికి ఎంతోమంది మహనీయులు ఎంతో వన్నె తీసుకొచ్చారు. అయినా దురదృష్టవశాత్తూ మనం శాశ్వత చిరునామా లేకుండా తిరుగుతున్నాం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

▸▸ త్యాగ భవనంగా చెన్నైలోని ఆయన ఇల్లు

▸▸ వచ్చే మార్చి 16న ఘనంగా 125వ జయంతి

▸▸ 'ఆత్మార్పణ దినం' సభలో చంద్రబాబు వెల్లడి



విజయవాడలో జరిగిన ఆత్మార్పణ దినం కార్యక్రమానికి హాజరైన జనం, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మిస్తున్న? అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల నిలువెత్తు విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ (బలిదాన విగ్రహం)'గా నామకరణం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అన్నారు. చెన్నైలో శ్రీరాములు ఆత్మార్పణం చేసిన భవనాన్ని పునర్నిర్మించి దానికి త్యాగ భవనంగా పేరు పెడతామని తెలిపారు. సోమవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రకు సంబంధించి ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను వీక్షించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజధాని అమరావతిలో శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రదేశానికి సంబంధించిన ఏవీని ప్రదర్శించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. ఈ విగ్రహం ఏర్పాటుకు అమరావతిలో 6.8 ఎకరాల భూమి కేటాయించామన్నారు. శ్రీరాములు జీవిత విశేషాలను భావితరాలకు తెలియజేసేలా స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన తెలుగు జాతి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక నాయకుడని కొనియాడారు. 'తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి, ప్రాణాలు అర్పించారు. 124 ఏళ్ల క్రితం దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు లేవు. కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఉండేవి. 1952 డిసెంబరు 15న పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పొట్టి శ్రీరాములు మొదట స్వాతంత్ర్యం కోసం పోరాడారు. తర్వాత తెలుగు జాతి కోసం పోరాటం మొదలుపెట్టారు. 50 ఏళ్ల స్వప్నం ఆయన 58 రోజుల ఆమరణ దీక్షతో సాధ్యమైంది. ప్రత్యేక రాష్ట్రం కోసం 1952 అక్టోబరు 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. అందరూ దీనిని ఆషామాషీగా తీసుకున్నా 58 రోజులపాటు పట్టుదలతో దీక్ష చేసి డిసెంబరు 15న ప్రాణాలు విడిచారు. ఆ తర్వాత డిసెంబరు 19న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రకటన చేశారు. ఇది పొట్టి శ్రీరాములు సాధించిన ఘనవిజయం. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు నుంచి విశాలాంధ్ర, తర్వాత విభజన.. ఇలా అన్ని అంశాలపై చర్చించిన తర్వాత పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసిన డిసెంబరు 15వ తేదీని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం. 2026 మార్చి 16న ఆయన 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం. ఈ ఏడాది మార్చి 16 నుంచి వచ్చే మార్చి 16 వరకు జయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించుకుంటున్నాం. చెన్నైలో ఆయన ఆత్మార్పణం చేసిన భవనాన్ని పరిరక్షిస్తాం. దానికి త్యాగభవనం అని నామకరణం చేస్తాం. భావితరాలకు గుర్తుండేలా దానిని తయారు చేస్తాం.

ఆయన జన్మించిన ఇంటిని స్మారక భవనం చేస్తాం. ఆయన ప్రారంభించిన ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం' అని సీఎం వెల్లడించారు. పొట్టి శ్రీరాములు ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని, ఆయన తెలుగు ప్రజల ఆస్తి అని వ్యాఖ్యానించారు. 'ఆయన ఒక సెంటిమెంట్. అటువంటి వ్యక్తిని ప్రజలు గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది' అని చెప్పారు.

పెనుగొండ దివ్యక్షేత్రం కావడం ఖాయం

ఆర్యవైశ్యుల అభ్యర్థనతో వాసవీమాత జన్మించిన పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చామని సీఎం గుర్తుచేశారు. ఇది పర్యాటక కేంద్రంగానే కాకుండా దివ్యక్షేత్రంగానూ మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అమ్మవారికి అద్భుతమైన ఆలయం కట్టాలని ఆర్యవైశ్య సమాజాన్ని కోరారు. 'ఆర్యవైశ్యులకు కుల ధ్రువీకరణ పత్రాలను శెట్టి, గుప్తా అని వేర్వేరుగా ఇచ్చేవారు. ఇక వాళ్లందరికీ ఆర్యవైశ్య అని కులధ్రువీకరణ జారీ చేసేలా చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు. ఈ సమయంలో వేదిక ముందు కూర్చున్న మహిళలు 'థాంక్యూ సీఎం సార్' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. నినాదాలు చేశారు. దీనికి స్పందించిన సీఎం.. 'ఈ ఘనత నా ఒక్కడిదే కాదు. నా మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ, ఎన్‌డీఏది.' అని వ్యాఖ్యానించారు.

శ్రీరాములు కుటుంబ సభ్యులకు సత్కారం

'ప్రపంచం మెచ్చే విధంగా అమరావతి, విశాఖపట్నం, తిరుపతి నగరాలను తయారు చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేసి తెలుగుజాతికి అందిస్తాం.' అని సీఎం తెలిపారు. కార్యక్రమం ప్రారంభంలో తొలుతగా విజయవాడ సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలకు చెందిన విద్యార్థులు 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు గునుపూడి హనుమంతరావు, గునుపూడి సత్యనారాయణ, ప్రతిభ, గునుపూడి నరసింహారావు, గునుపూడి సుబ్రహ్మణ్యంను చంద్రబాబు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

పీపీపీపై రాజకీయం: సీఎం

పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై కొంతమంది కావాలనే రాజకీయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. 'ఆస్పత్రులు, వైద్య కళాశాలల విషయంలో పీపీపీ విధానమే ఉండాలని కేంద్రమే పార్లమెంటులో చెప్పింది. నిర్వహించేది ప్రైవేటు వ్యక్తులే అయినా దానికి యజమానిగా ప్రభుత్వమే ఉంటుందని.. దానికే అన్ని హక్కులూ ఉంటాయి. పీపీపీలో అభివృద్ధి జరిగి, ఆదాయంపెరుగుతుంది' అని స్పష్టం చేశారు.



శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్‌లో రాకెట్‌కు అమర్చిన ఉపగ్రహం

24న బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగం

▸▸ శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి వ్యాబ్‌కు రాకెట్

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో వాణిజ్య ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన బ్లూబర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఈ నెల 24న రోదసిలోకి పంపే ఏర్పాట్లు చేస్తోంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చనుంది. వాణిజ్య పరంగా ఇస్రో ప్రయోగిస్తున్న అత్యంత భారీ ఉపగ్రహాల్లో ఇదీ ఒకటి. ఇప్పటికే ఈ ప్రయోగానికి సంబంధించిన పనులు షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్)లో శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్‌లో రాకెట్ శిఖర భాగాన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని అమర్చారు. అనంతరం ఉపగ్రహం చుట్టూ ఉష్ణకవచం అమర్చే ప్రక్రియను పూర్తిచేసి రాకెట్‌ను వ్యాబ్‌కు తరలించారు. ఇస్రో వర్గాల సమాచారం మేరకు.. ఈ నెల 24న ఉదయం 8.10 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. సమాచార రంగానికి చెందిన ఈ ఉపగ్రహాన్ని తొలుత ఈ నెల 21న ప్రయోగించాలని భావించినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా వేశారు.

వైసీపీ నాటకాలను ప్రజలు గమనించాలి

▸▸ పేద, మధ్యతరగతికి వైద్య కళాశాలల్లో 850 సీట్లు: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాకుండా పులివెందుల ఎమ్మెల్యేగా చరిత్రలో మిగిలిపోతున్న జగన్ పార్టీకి ప్రజా ఉద్యమాలు చేసే అర్హత లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మంత్రి ఓ ప్రకటన చేస్తూ వైసీపీ పాలనలో మెడికల్ కాలేజీలకు కేంద్రం ఇచ్చిన రూ.1,550 కోట్లే ఖర్చు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి ఖర్చు చేయలేదు. జగన్ కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తామంటే... అడ్డుపడుతున్నారు. వైసీపీ నాటకాలను ప్రజలు గమనించి, తిరస్కరించాలి. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం రెండేళ్లలో పూర్తవుతాయి. పీపీపీ విధానంలో మెడికల్ సీట్లు 500 నుంచి 2 వేల దాకా పెరుగుతాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు 850 సీట్లు కేటాయింపు ఉంటుంది.' అని అచ్చెన్న పేర్కొన్నారు. కాగా, చంద్రబాబు విజన్ కలిగిన నాయకుడైతే జగన్ విధ్వంసానికి మారుపేరని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఇక, కూటమి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయనడానికి ఆర్బీఐ నివేదికే నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. 'కూటమి ప్రభుత్వ చర్యలతో పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే ఏపీ నంబర్ వన్‌గా నిలిచింది. జగన్ హయాంలో నిరుద్యోగం దాదాపు 7 శాతానికి పెరిగింది. కూటమి ప్రభుత్వం దాన్ని గణనీయంగా తగ్గించగలిగింది' అని అశోక్ విమర్శించారు.

వైసీపీ హయాంలో ఆర్థిక విధ్వంసం: యనమల

'వైసీపీ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగింది. దీనిపై జగన్ బహిరంగ చర్చకు రాగలడా?' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయి వృద్ధి రేటు కుంటుపడిందన్నారు. రూ.10 లక్షల కోట్లకుపైగా జగన్ అప్పులు చేశారన్నారు.

పీపీపీ విధానానికి కేంద్రమూ గ్రీన్ సిగ్నల్!: నీలాయపాలెం

'దేశంలో ఎంబీబీఎస్ చదవాలనుకునే ప్రతి 10 లక్షల మందికి కేవలం 75 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ సంఖ్యను గణనీయంగా పెంచాలన్న ఆలోచనతో ఇకపై పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీలు ప్రారంభించాలంటూ పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. కేంద్రం దీనిని ఆమోదించింది' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ పేర్కొన్నారు. ఈ విధానంపై అవగాహన లేమితో జగన్... కోటి సంతకాలంటూ నాటకాలు ఆడుతున్నారని అని నీలాయపాలెం ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు టీడీపీ కార్యాలయానికి సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయానికి వచ్చి 5 గంటల వరకు అక్కడే ఉంటారు.

వైసీపీ 'సోషల్ మీడియా' నేతకు నోటీసులు

▸▸ బాబు, పవన్ కుటుంబాలపై అప్పట్లో అసభ్యకర పోస్టులు, దూషణలు

▸▸ 2024లో గుడివాడలో కేసు.. షార్జా నుంచి రావడంతో చర్యలు



విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డికి గుడివాడ టూ టౌన్ పోలీసులు నోటీసులు అందజేశారు. విచారణకు రావాలని పేర్కొన్నారు. కడప జిల్లా పులివెందులకు చెందిన అర్జున్‌రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి కనుసన్నల్లో పనిచేశాడు. నాటి విపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టడమే కాకుండా దూషణలకు దిగాడు. తర్వాత కూటమి ప్రభుత్వం రావడంతో గుడివాడకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త ఖాజాబాబు, అర్జున్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ఖాజాబాబుతోపాటు మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అర్జున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆయనకు 41ఏ కింద నోటీసు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి అర్జున్‌రెడ్డి గుడివాడ పోలీసులకు చిక్కడం లేదు. సోమవారం షార్జా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని, బయటకు వస్తుండగా విమానాశ్రయ సిబ్బంది అడ్డుకుని గుడివాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గుడివాడ పోలీసులు 41ఏ నోటీసు అందజేశారు.

జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గరిష్ఠంగా లబ్ధి పొందుతున్న రాష్ట్రం ఏపీ. గ్రామాల ప్రగతికి ఈ పథకం నిజంగానే ఒక హామీగా నిలిస్తే, పనిని కోరుకునే చేతులకు ఉపాధి ఒక హక్కుగా రాష్ట్రంలో అమలవుతోంది. అందువల్లే ఈ పథకంలో కేంద్రం తలపెట్టిన మార్పులు ఏపీనే అధికంగా ప్రభావితం చేయనున్నాయి. పథకం అమలులోని 'పరిమితులు' రాష్ట్ర ప్రయోజనాలకు గండి కొట్టనున్నాయి. ఇప్పటివరకు కేంద్ర పథకం అండతో రూ.వేల కోట్ల విలువైన పనులు రాష్ట్రంలో జరిగాయి. ఇకపై సొంతంగా ఇన్ని పనులు చేపట్టడం ఏపీకి పెను భారం కానుంది. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఏపీ మరింతగా కష్టాల్లో పడనుంది.



ఉపాధి మేలు ఆవిరి!

▸▸ ఏపీ గ్రామాల ప్రగతికి కొత్త బిల్లు గండి

▸▸ ఇప్పటిదాకా ఉపాధి పేదల హక్కు

▸▸ లేబర్ కాంపోనెంట్‌లో కేంద్రం 100% నిధులు

▸▸ మెటీరియల్ కాంపోనెంట్‌లో 75 శాతం కేంద్రం వాటా

▸▸ ఇకపై కేంద్రం, రాష్ట్రం 60:40 నిధుల వాటా

▸▸ మిగతా కేంద్ర పథకాల స్థాయికి ఈ స్కీమ్ కుదింపు

▸▸ పథకంతో గరిష్ఠ లబ్ధి పొందుతున్న ఏపీ

▸▸ ఏటా 25 కోట్ల పనులు.. రూ. పది వేల కోట్ల నిధులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పనిని హక్కుగా ప్రకటించి, ఉపాధిని గ్యారంటీ చేసిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మసకబారనుంది. దాని పేరుతోపాటు, రాష్ట్రాలకు ఈ పథకం భారం కాకుండా కేంద్రం ఇప్పటివరకు అందిస్తున్న సహాయ సహకారాల్లోనూ కోత పడనుంది. ఈ మేరకు కేంద్రం సోమవారం తెచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. వాస్తవానికి ఉపాధి హామీ పథకం నుంచి గరిష్ఠంగా లబ్ధి పొందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. విభజన కష్టాలు, వైసీపీ పాలన మిగిల్చిన ఆర్థిక విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న ఏపీకి 'ఉపాధి' పథకంలో కేంద్రం తీసుకురానున్న తాజా మార్పులు శరాఘాతమే కానున్నాయి. లేబర్ కాంపోనెంట్ కింద జరుగుతున్న పనులకు ఇప్పటివరకు కేంద్రం పూర్తి నిధులు సమకూరుస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం 7 5 శాతం నిధులు అందిస్తోంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారడంతోపాటు శాశ్వత ఆస్తులు కూడా సమకూరే దారి పడింది. అయితే, తాజా బిల్లును అనుసరించి.. మిగతా కేంద్ర ప్రాయోజిత పథకాల మాదిరిగానే ఉపాధి పథకంలో రాష్ట్ర వాటా ఇకపై 40 శాతం ఉండనుంది. ఉదాహరణకు మన రాష్ట్రానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయిస్తే, అందులో రూ.3 వేల కోట్లు మాత్రమే కేంద్రం కేటాయిస్తుంది. మిగిలిన రూ.2 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. దీంతో ఈ పథకంతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శ్రామికులకు చెల్లింపు గడువును 15 రోజుల నుంచి వారానికి కుదించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామని కొత్త బిల్లులో చెప్పుకొచ్చారు. అయితే, దీనివల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఎందుకంటే, ఇందుకయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వం కూడా భరించాల్సి ఉంటుంది. కేంద్రమిచ్చే నిధులతో ఆయా కుటుంబాలకు రాష్ట్రాలు 100 రోజులు అయినా పని కల్పించే పరిస్థితి ఉంటుందా? అన్న సందేహం నెలకొంది. ఆర్థికంగా ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న ఏపీ వంటి రాష్ట్రాలు కేంద్ర ప్రాయోజిత పథకాలకు 40 శాతం వాటా చెల్లించడమే భారంగా ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధి పథకానికి కూడా ఇంతే మొత్తంలో నిధులు సమకూర్చడం మోయలేని బరువే కానుంది. దీంతో ఈ పథకం కింద నిధులు భారీగా అడిగే పరిస్థితి ఉండకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇకనుంచి శ్రామికుల అవసరం మేర కాకుండా కేంద్రం కేటాయించే నిధులను బట్టే పనుల పరిమాణం నిర్ణయం కానుంది.

ఉపాధి ఎలా?...

ఉపాధి పథకాన్ని నమ్ముకుని వేల మంది సిబ్బంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. గత ప్రభుత్వం వారికి జీతాలు పెంచకుండా వేధించింది. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులకు సంస్కరణలు అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఇటీవల హామీ ఇచ్చారు. అయితే తాజా మార్పుల వల్ల రాష్ట్రంలో ఈ పథకం ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

మౌలిక వసతులకు రాంరాం.....

కేంద్రం అందించే ఉపాధి నిధులతో గత 20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మారాయి. వలసలు తగ్గాయి. కేంద్ర ప్రభుత్వం డిమాండ్ ఆధారంగా నిధులివ్వడంతో పనులు విరివిగా చేపట్టగలిగారు. మారిన విధానంతో ఇక ఈ పనులను కోటా ఆధారంగా చేపడితే గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన మిథ్యేనంటున్నారు. ఏటా 25 కోట్ల పనిదినాలు కల్పించి దేశంలో ముందున్న మనకు, ఈ ఏడాది కేవలం 18 కోట్ల పనిదినాలు కల్పించారు. రాబోయే కాలంలో ఈ పనిదినాలు కూడా అందే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

ఏపీకి గోరుచుట్టుపై రోకలిపోటు..

మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆర్థికంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గోరుచుట్టుపై రోకటిపోటులాగా మారింది. ఏటా ఆంధ్రప్రదేశ్ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.10 వేల కోట్ల దాకా కేంద్రం నుంచి నిధులను రాబడుతోంది. అందులో సుమారు రూ.6 వేల కోట్ల దాకా శ్రామికులకు వేతనాల రూపంలోను, మరో రూ.4 వేల కోట్లు మెటీరియల్, అడ్మిన్ వ్యయం కింద అందుతున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా మెటీరియల్ నిధుల కోసం సుమారు రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్ల దాకా వెచ్చిస్తోంది. అంటే మొత్తంగా ఉపాధి నిధుల్లో కేవలం 10 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తోంది. ఇకపై రూ.10 వేల కోట్ల పనులకుగాను కేంద్రం తన వాటా కింద రూ. 6 వేల కోట్లు మాత్రమే ఇస్తుంది. మిగతా రూ.4 వేలకోట్లు రాష్ట్రం సమకూర్చుకోవాలి. ఇది ఏపీకి పెను భారమే కాగలదు.

ఆయుధాలు వదిలేద్దాం

▸▸ ఇక రహస్య ఉద్యమాలు చేయడం కష్టం

▸▸ వర్గపోరు తగ్గింది... దోపిడీల రూపు మారింది

▸▸ 2024లో మావోయిస్టు పొలిట్‌బ్యూరోలో చర్చ

▸▸ వెలుగులోకి సంచలన డాక్యుమెంట్



హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'ఆయుధాలు వదిలేద్దాం.. ఇలా రహస్యంగా ఉండి వర్గపోరుకు అవసరమైన ప్రజా మద్దతు కూడగట్టలేం. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రాంతాల రాష్ట్ర కమిటీలు రహస్యంగా ఉండి వర్గపోరు చేయలేమంటున్నాయి. జనజీవన స్రవంతిలోకి వస్తేనే ఉద్యమాలకు అవసరమైన ప్రజా మద్దతును కూడగట్టగలం అంటున్నాయి' అని మావోయిస్టుల్లోని ఒక వర్గం గత రెండేళ్ల నుంచే వాదించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన సంచలన డాక్యుమెంట్ సోమవారం వెలుగుచూసింది. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో 2024లో అన్ని స్థాయిల్లోని కమిటీలకు ఈ డాక్యుమెంట్‌ను పంపింది. రహస్య జీవితంలో ఉండి వర్గపోరు చేయలేమని ఆయా రాష్ట్రాల రాష్ట్ర కమిటీలు అన్నట్లుగా ఆ డాక్యుమెంట్‌లో పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఒకవైపు ప్రభుత్వ నిర్బంధం, బలగాల దాడులను తట్టుకోవడంలో కొంతమేర విఫలం కావడం, సమాజంలో నాటికి-నేటికి మారిన పరిణామాల దృష్ట్యా ఇక రహస్య జీవితం సాధ్యం కాదన్న వాదన పలు రాష్ట్రాల కమిటీలు లేవనెత్తాయి. 31 పేజీల ఈ డాక్యుమెంట్‌లో మూడున్నరేళ్ల కాలంలో పార్టీకి అనుకూలంగా, ప్రతికూలంగా పరిణమించిన అంశాలపై చర్చ జరిగింది. అయితే మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రాంతాల రాష్ట్ర కమిటీల వాదన సరైంది కాదని ఈ డాక్యుమెంట్ పేర్కొంది.

మూడేళ్లలో 683 మంది మావోయిస్టులు మృతి

ఈ డాక్యుమెంటులో 2024కు ముందు మూడేళ్లలో జరిగిన పరిణామాలను వివరించారు. '2024కు ముందు మూడేళ్లలో భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లో 683 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 190 మంది మహిళలున్నారు. మావోయిస్టులు చేసిన 669 దాడుల్లో 261 మంది పోలీసులు చనిపోగా, 516 మంది గాయపడ్డారు. మనం 25కు పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం. 2021 నుంచి పార్టీ కీలక నేతలను కోల్పోయింది. వీరిలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు లక్మ, అంబీఆర్, సాకేత్, ఆనంద్ అనారోగ్యంతో చనిపోయారు. భద్రతా బలగాల దాడుల్లో కొందరు చనిపోయారు. బలగాల చర్యలను తిప్పికొట్టడంలో కేంద్ర కమిటీతో పాటు స్టేట్, జోనల్ కమిటీలు విఫలమయ్యాయి... అని పేర్కొన్నారు.

పరిస్థితులు మారాయి

సమాజంలో వచ్చిన మార్పులపై లోతైన అంతర్మథనాన్ని డాక్యుమెంటులో వివరించారు. '2012లో కూడా ఒకసారి ఇలానే పార్టీకి తీవ్రమైన దెబ్బ తగిలింది. అయితే దాన్నుంచి మళ్లీ 2013 నాటికే కోలుకున్నాం. కానీ ఈ మూడున్నరేళ్లలో మాత్రం చాలా కోల్పోయాం. పార్టీ పనితీరులో లోపాలున్నాయి. గోప్యత తగ్గింది. కమిటీల మధ్య సమన్వయం లేదు. సమాజంలోనూ మార్పులొచ్చాయి. గతంలో ఉన్నట్లుగా భూస్వామ్య దోపిడీ ఇప్పుడు ప్రత్యక్షంగా లేదు. దోపిడీల రూపుమారింది. ప్రజలు బతకడం కోసం పోరాడాల్సిన పరిస్థితి అంతగా లేదు. మావోయిస్టు పార్టీలో కూడా బూర్జువా, భూస్వామ్య అభిప్రాయాలు, భావనలు చొరబడ్డాయి. కొత్త ప్రజా సంఘాలను ఏర్పాటుచేసుకుంటేనే పార్టీ కొనసాగుతుంది. పార్టీ కమిటీల్లో 3 తరాల వయసుల వారు ఉండేలా చూడాలి' అని అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ రాష్ట్ర కమిటీలు కూడా ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో విఫలమయ్యాయని డాక్యుమెంట్ పేర్కొంది. రహస్యంగా ఉంటూనే సమాజంలో ఉద్యమాలను నిర్మించాలన్నది పార్టీ లక్ష్యమైతే.. దానిని అర్థం చేసుకోకుండా రహస్యంగా ఉండిపోవడమే పని అనుకున్నారని విమర్శించింది.

నిధుల దుర్వినియోగం కేసులో.. ఐపీఎస్ సంజయ్‌కు షరతులతో బెయిల్

- ఏ-4 కొండలరావుకు కూడా.. బెజవాడ ఏసీబీ కోర్టు తీర్పు
- రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు
- కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు



విజయవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ, సీఐడీలో నిధుల దుర్వినియోగం కేసులో రిమాండ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌కు ఏసీబీ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న మరో నిందితుడు కొండలరావుకు కూడా బెయిల్ ఇచ్చింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో హైకోర్టు గతంలో ఆయనకు బెయిల్ మంజూరు చేయగా.. ఏసీబీ అధికారులు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టి తక్షణమే కోర్టులో లొంగిపోవాలని సంజయ్‌ను ఆదేశించింది. దీంతో ఆయన విజయవాడ ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. ఆయన 112 రోజులుగా జ్యుడీషియల్ రిమాండ్‌పై విజయవాడ జిల్లా జైల్లో ఉన్నారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోర్టు కొట్టేసింది. ఇదే కేసులో ఏ-4గా ఉన్న బిక్కిన కొండలరావును కొద్దిరోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 29 రోజులుగా ఆయన రిమాండ్‌లో ఉన్నారు. ఈ ఇద్దరి బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి సోమవారం తీర్పు ఇచ్చారు. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని.. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని.. పాస్‌పోర్టును కోర్టులో అప్పగించాలని షరతులు విధించారు.

కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించండి

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత కాకాణి



అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన కేసుల విచారణను సీబీఐ దర్యాప్తునకు అప్పగించేలా ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్, కృష్ణపట్నం పోర్టులో అక్రమాలు, కల్తీ మద్యం పంపిణీ, మద్యం తరలింపు, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు తదితర ఫిర్యాదులపై నెల్లూరు జిల్లా ముత్తుకూరు, వి. సత్రం, పొదలకూరు, ఇందుకూరుపేట ఎస్ఈబీ పోలీసులు కేసులు నమోదు చేశారని, అదేవిధంగా సీఐడీ కూడా 9 కేసులు నమోదు చేసినట్టు పిటిషన్‌లో వివరించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులు కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐ డైరెక్టర్ జనరల్, రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, సీఐడీ అదనపు డీజీలతో పాటు ఫిర్యాదుదారులకు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

ఏం బాగున్నామని!?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్న లక్ష్యాలూ అలాగే ఉన్నాయి. కానీ... ఈ గొప్పల లెక్కల వల్ల భారీ నష్టం జరుగుతోందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లకు గండి పడుతోందని పేర్కొంటున్నారు. ఉదాహరణకు... ఈ ఏడాది కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి రూ.7,500 కోట్లు వచ్చాయి. అదే సమయంలో బిహార్‌కు రూ.17,500 కోట్లు వెళ్లాయి. అంటే... సంవత్సరానికి పదివేల కోట్లు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం... మన జీఎస్డీపీ, వృద్ధి రేటు వెలిగిపోతోంది కాబట్టి, కేంద్ర పన్నుల్లో వాటా కూడా తక్కువగా వస్తోంది. నిజానికి... ఏపీ అప్పులు, ఖర్చులు బిహార్‌కంటే తక్కువేమీ లేవు. రాష్ట్రానికి ఆదాయం తక్కువే అయినప్పటికీ పన్నుల్లో వాటా ఉత్తరాది రాష్ట్రాలకు వచ్చిన స్థాయిలో రావడం లేదు. దీనికి కారణం కాగితాలపై మాత్రమే పెరుగుతున్న ఏపీ జీఎస్‌డీపీ, తలసరి ఆదాయమే!


ఇదేం చిత్రమో...

రాష్ట్ర ఆదాయంలో... కేంద్ర పన్నుల్లో వాటా చాలా కీలకం. గతంలో రాష్ట్రం నుంచి వసూలైన కేంద్ర పన్నుల్లో నేరుగా 42 శాతాన్ని తిరిగి ఇచ్చేవారు. 2005 నుంచి ఈ పద్ధతి మార్చారు. మోదీ వచ్చాక దీనిని మరిన్ని మార్పులతో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన కేంద్ర పన్నుల్లో 42 శాతం వాటా పరిగణనలోకి తీసుకుని... ఆయా రాష్ట్రాల ఆర్థిక వెనుకబాటు (ఇన్‌కమ్ డిస్టెన్స్) ఆధారంగా ఆ మొత్తాన్ని పంచుతున్నారు. అంటే.. ఆర్థికంగా బాగున్న రాష్ట్రాలకు తక్కువ వాటా! వెనుకబడిన రాష్ట్రాలకు ఎక్కువ వాటా! ఏపీ చెప్పుకొంటున్న లెక్కల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెలిగిపోతోంది. అందుకే... కేంద్ర పన్నుల్లో తక్కువ వాటా వస్తోంది. ఆర్థిక సంఘం విధి విధానాల ప్రకారమే ఈ వాటాలను నిర్ణయిస్తారు. జనాభా, అటవీ విస్తీర్ణం, ఆర్థిక అసమానతలు... ఇలా పలు ప్రాతిపదికల ఆధారంగా కేంద్ర పన్నుల్లో వాటాలను ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. ఇందులో... ఆర్థిక అసమానతలు అనే ప్రాతిపదికకు 45% వాటా ఇస్తోంది. 'వెనుకబడి ఉన్నాం' అని గణాంకాల్లో చెప్పుకోకపోవడంతో కేంద్ర పన్నుల్లో వాటాకు భారీగా కోత పడుతోంది. ఇప్పటికైనా గణాంకాల్లో అసలు పరిస్థితిని వివరిస్తున్నారా అంటే అదీ లేదు. ఆర్థిక సంఘం విధి విధానాలనే మార్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రానికి అదనపు వాటాలు సాధించేందుకు 16వ ఆర్థిక సంఘం చుట్టూ తిరుగుతున్నారు. 2026 ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయి. 2026-27 బడ్జెట్‌ను కేంద్రం ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతుంది. దీంతో... 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు మనకు అనుకూలంగా ఉండేలా, రాష్ట్రానికి ఎక్కువ నిధులు వచ్చేలా చేసేందుకు నానా తిప్పలు పడుతున్నారు. జనాభా నియంత్రణ, అటవీ విస్తీర్ణంలో ఏపీ పరిస్థితి మెరుగ్గా ఉంది కాబట్టి... ఆ కోటాలో ఎక్కువ వాటా ఇవ్వాలని, 'ఇన్‌కమ్ డిస్టెన్స్'కు ఇస్తున్న 45 శాతం వాటాను 30 శాతానికి తగ్గించాలని కోరుతున్నారు. ఇందుకు 16వ ఆర్థిక సంఘం స్పందన ఏమిటో తెలియదు. ఉత్తరాది రాష్ట్రాలకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకుంటారన్నది అనుమానమే!

క్యూ2లో దేశ సగటును దాటేశాం..

జగన్ సర్కారు దిగిపోయేనాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ సుమారు రూ.14 లక్షల కోట్లు! ఇప్పుడు ఏడాదికి రూ.2 లక్షల కోట్ల చొప్పున జీఎస్‌డీపీని పెంచి చూపిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే తలసరి ఆదాయమూ పెంచుతున్నారు. అన్నీ 'బాగున్నాక' ఆర్థిక సంఘం ఎందుకు పట్టించుకుంటుంది? జగన్ హయాంలో అప్పులకోసం ప్రతి ఏటా జీఎస్‌డీపీని పేపర్లపై పెంచుతూ వస్తున్నారు. ఇప్పుడు అప్పులతోపాటు ఏపీ బ్రాండ్ ఇమేజ్ కోసం అదే పని చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో ఏపీ జీఎస్‌డీపీ 11.28 శాతానికి చేరుకుంది. అదే సమయంలో దేశ జీడీపీ 8.7 శాతం మాత్రమే. దేశ సగటు కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలకే ఆర్థిక సంఘాలు ఎక్కువ నిధులు కేటాయిస్తాయి. ఏపీ మాత్రం దేశ సగటును దాటేసి ఎంతో ముందుకుపోయింది. ఇక... తలసరి ఆదాయం కూడా అంతే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,47,871గా చూపించారు. జాతీయ తలసరి ఆదాయం 2024-25లో రూ.2,05,324 మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ తలసరి ఆదాయం రూ.2.85 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. 'లెక్కల ప్రకారం' ఏపీ తలసరి ఆదాయం జాతీయ స్థాయి కంటే ముందంజలో ఉంది. ఇలా, రెండు కీలకమైన సూచీల్లో జాతీయ సగటు కంటే ఎంతో ముందున్నామని మనమే చెప్పుకొంటున్నాం! ఇక... కేంద్ర పన్నుల్లో వాటా పెరగడం ఎలా?

ఈ అంచనాలతో ఎవరికి ఉపయోగం?



రాష్ట్ర బడ్జెట్ రూ.3.22 లక్షల కోట్లు. కనీసం ఇందులో సగమైనా రాష్ట్ర సొంత ఆదాయం ఉండాలి. కానీ అలా లేదు. కాగ్ లెక్కల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన 8 నెలల్లో వచ్చిన పన్ను ఆదాయం రూ.68,102 కోట్లు మాత్రమే. కానీ... బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను ఆదాయం రూ.1,09,007 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.19,119 కోట్లు వస్తుందని అంచనా వేశారు. మొత్తం రూ.1,28,126 కోట్ల ఆదాయం రాష్ట్రం సొంతంగా సమకూర్చుకోగలదని అర్థం. ఇవే గణాంకాలను 16వ ఆర్థిక సంఘానికి సమర్పించారు. పన్నేతర ఆదాయం రూ.19,119 కోట్లు వస్తుందనడం గాలిలో మేడలు కట్టడమే. అది రూ.5,000 కోట్లు దాటితే అదే గొప్ప. ఏప్రిల్ నుంచి నవంబరు వరకు కేవలం రూ.3671 కోట్ల పన్నేతర ఆదాయం మాత్రమే వచ్చింది. ప్రభుత్వంలో అందరికీ ఇది తెలిసినా అంచనాలు విపరీతంగా పెంచి చూపిస్తున్నారు. పన్ను ఆదాయం నవంబరు నాటికే రూ.94,033.98 కోట్లు వచ్చినట్టు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. కానీ, ఇందులో కేంద్ర పన్నుల్లో నుంచి రూ.25,931 కోట్లు వాటాగా వచ్చింది. అంటే ఈ 8 నెలల్లో రూ.68,102 కోట్లు మాత్రమే రాష్ట్ర పన్నుల ద్వారా వచ్చాయి. ఇది కాకుండా కేంద్రం నుంచి ఇప్పటి వరకు రూ.7692 కోట్ల గ్రాంట్లు వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వ ఖర్చులు చూస్తే.. నవంబరు నాటికి రెవెన్యూ లోటు 163 శాతానికి చేరుకుంది. నవంబరు నాటికి ప్రభుత్వం రూ.1,59,753 కోట్లు ఖర్చు చేసింది. క్యాపిటల్ వ్యయం రూ.16,910 కోట్లు.

లోటుకూ 'సూటూ బూటు' వేసి!



కేంద్ర పన్నుల్లో వాటాలో నష్టం ఒక ఎత్తైతే... రెవెన్యూ లోటు గ్రాంటులో దెబ్బ ఒక ఎత్తు! నిబంధనల ప్రకారం... ఆర్థిక సంఘానికి రాబోయే ఐదేళ్ల బడ్జెట్ అంచనాలు సమర్పించాలి. అందులో రెవెన్యూ లోటు ఆధారంగా.. దానికి సంబంధించిన గ్రాంటును నిర్ణయిస్తారు. కానీ... మన బడ్జెట్ ఏటేటా పెరిగిపోతూనే ఉంది. లేని ఆదాయాన్ని చూపించడం కొన్నేళ్లుగా అలవాటుగా మారింది. దీంతో... రెవెన్యూ లోటును కూడా తక్కువ చేసి చూపిస్తున్నారు. వెరసి... కేంద్రం నుంచి రావాల్సిన సంబంధిత గ్రాంటుకు కోత పడుతోంది. ఉదాహరణకు... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వ్యయం రూ.2.56 లక్షల కోట్లు ఉంటుందని 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్రం వివరాలు సమర్పించింది. ఇందులో... జీతాలు, పెన్షన్లు, రాయితీలు, పథకాలు, రేషన్ బియ్యం... ఇలాంటివన్నీ ఉన్నాయి. అంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటాను కలపకుండా లెక్కిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెవెన్యూ లోటు 1,28,146 కోట్లు. నిజమైన లెక్కలు సమర్పిస్తే... ఈ లోటు మరో 20వేల కోట్లకు పైగానే ఉంటుంది. ఆ లెక్కలు చూపిస్తే గ్రాంటు మరింత పెరిగే అవకాశముంది. కానీ... లోటు లెక్కలకూ 'సూటూ బూటూ' వేసి కవర్ చేస్తుండటం వల్ల గ్రాంటు తగ్గుతోంది.

జీతాలకూ కటకటే!



డిసెంబరులో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ఇబ్బందిపడింది. డిసెంబరు 2న ఆర్‌బీఐలో రాష్ట్ర సెక్యూరిటీలు వేలం వేసి రూ.3,000 కోట్లు అప్పు తెచ్చారు. మూడో తేదీ నుంచి జీతాలు, పెన్షన్ల చెల్లింపులు మొదలుపెట్టారు. పదో తేదీ వరకు వేస్తూనే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు కావాల్సిన అప్పుల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నాలుగు నెలలకు కనీసం రూ.25,000 - రూ.30,000 కోట్ల అప్పులు అవసరమవుతాయని అంచనా. ఈ అప్పులకు అనుమతితోపాటు... 16 ఆర్థిక సంఘానికి వినతుల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ఢిల్లీలో తిరుగుతున్నారు.

తెలియదు.. గుర్తులేదు!

- ఏమడిగినా డీజీ సునీల్‌కుమార్ సమాధానమిదే
- రఘురామ టార్చర్ కేసులో విచారణకు హాజరైన సీనియర్ ఐపీఎస్

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏ ప్రశ్న అడిగినా.. తెలియదు, గుర్తులేదనే సమాధానమే. అప్పటి వైసీపీ నరసాపురం ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ప్రధాన నిందితుడైన నాటి సీఐడీ చీఫ్, డీజీ స్థాయి సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ విచారణకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. సోమవారం గుంటూరులోని సీసీఎస్ స్టేషన్‌లో జరిగిన విచారణకు ఆయన ఎట్టకేలకు హాజరయ్యారు. ఉదయం 10.45 గంటలకు సునీల్ గుంటూరు జిల్లా కోర్టు రోడ్డులోని సీసీఎస్ కార్యాలయానికి వచ్చారు. తర్వాత కాసేపటికి దర్యాప్తు అధికారి అయిన విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ వచ్చారు. 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 5 గంటల పాటు విచారణ కొనసాగింది. మధ్యలో మధ్యాహ్నం కొద్ది సమయం భోజన విరామం ఇచ్చారు. రఘురామను ఆనాడు (2021 మే 14న) హైదరాబాద్ నుంచి గుంటూరు సీఐడీ కార్యాలయానికి ఎందుకు తీసుకొచ్చారు.. ఎందుకు కొట్టారు.. ఎవరు కొట్టారు.. ఇలా ఎన్ని ప్రశ్నలడిగినా తెలియదు... గుర్తు లేదనే సునీల్‌కుమార్ చెప్పినట్లు సమాచారం. మళ్లీ పిలిచినప్పుడు రావలసి ఉంటుందని దామోదర్ ఆయనకు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు విచారణ ముగిశాక సునీల్‌కుమార్ కారులో వెళ్లిపోయారు. ఆయన గానీ, దామోదర్ గానీ మీడియాతో మాట్లాడలేదు. సీసీఎస్ స్టేషన్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయ ప్రాంగణంలోకి ఎవరూ వెళ్లకుండా గేటు మూసి ఆంక్షలు విధించారు. మీడియానూ అనుమతించలేదు. సునీల్‌కుమార్ వాహనం నేరుగా ప్రాంగణంలోకి వెళ్లింది.


కేసు పూర్వాపరాలు..

2021 మే 14న హైదరాబాద్‌లో జన్మదినం జరుపుకొంటున్న నాటి నరసాపురం ఎంపీ రఘురామరాజును గుంటూరు సీఐడీ పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఆరోజు రాత్రి సీఐడీ కార్యాలయంలో గుండెలపై కూర్చుని, లాఠీలతో కొట్టి.. ఆయన్ను చిత్రహింసలకు గురిచేశారు. గుండె ఆపరేషన్ చేయించుకుని ఉన్నానని, మందులు వేసుకోవాలని తాను ప్రాధేయపడినా వినిపించుకోకుండా తీవ్రంగా హింసించి హత్యాయత్నం చేశారని రఘురామ ఆ తర్వాతి రోజు కోర్టులో మేజిస్ట్రేట్‌కు తెలియజేశారు. వాచిన అరికాళ్లను చూపారు. దీంతో ఆయనకు వైద్య పరీక్షలు చేయించాలని న్యాయాధికారి ఆదేశించారు. అయితే ఆయన శరీరంపై ఎలాంటి గాయాల్లేవని నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి నివేదిక ఇచ్చారు. ఆమె భర్త రవికుమార్ వైసీపీ నేత కావడంతో ఆమెను నాటి ప్రభుత్వ పెద్దలు ప్రభావితం చేసి తప్పుడు నివేదిక ఇప్పించారని రఘురామ ఆరోపించారు. దీనిపై ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో చివరకు హైదరాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆయన శరీరంపై గాయాలు ఉన్నాయని ఆస్పత్రి వైద్యులు కోర్టుకు నివేదిక ఇచ్చారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వంలో తనకు న్యాయం జరగని భావించిన రఘురామ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నాటి సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ (ఏ-1), నాటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ-2), మాజీ సీఎం జగన్ (ఏ-3), అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ (ఏ-4), అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి (ఏ-5)లను నిందితులుగా చేర్చారు. ఐపీఎస్ అధికారి దామోదర్‌ను దర్యాప్తు అధికారిగా నియమించారు. విచారణలో భాగంగా విజయ్‌పాల్‌ను విచారించి అరెస్టు చేశారు. ఆ తర్వాత రఘురామరాజు ఇచ్చిన సమాచారంతో కస్టడీలో ఆయనపై దాడి చేసిన తులసిబాబును అరెస్టుచేశారు. దరిమిలా తనకు అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభావతి హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఉపశమనం లభించకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే పోలీసుల విచారణకు సహకరించాలని ఆమెకు సూచించిన కోర్టు.. ఆమెకు నోటీసులివ్వాలంటూ పోలీసులకు ఆదేశాలిచ్చింది. రఘురామను టార్చర్‌కు గురిచేసిన సమయంలో అక్కడే విధుల్లో ఉన్న నాటి సీఐడీ అదనపు ఎస్పీ సునీల్ నాయక్ ఆ తర్వాత తన కేడర్ రాష్ట్రమైన బిహార్‌కు వెళ్లిపోయారు. విచారణకు నోటీసులు జారీ చేయగా.. స్థానిక కోర్టును ఆశ్రయించి విచారణ నుంచి మినహాయింపు పొందారు. ఆ తర్వాత ఎస్పీ దామోదర్.. ఈ నెల 4న విచారణకు రావాలని సునీల్‌కుమార్‌కు నోటీసులు ఇచ్చారు. కుటుంబ సభ్యుల అనారోగ్యం కారణంగా ఆ రోజు రాలేనని, రెండు వారాల గడువు కావాలని సునీల్‌కుమార్ కోరారు. దీంతో 15న రావాలని రెండో దఫా నోటీసులివ్వడంతో ఆయన హాజరయ్యారు. అయితే విచారణకు సహకరించని నేపథ్యంలో దర్యాప్తు అధికారి తీసుకునే తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. మళ్లీ విచారణకు పిలిచి అరెస్టు చేస్తారని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.




సునీల్‌ను విచారించడానికి వెళుతున్న ఎస్పీ దామోదర్, విచారణ అనంతరం బయటికి వస్తున్న పీవీ సునీల్ కుమార్

పాల సముద్రంపై భానుడి కిరణాలు



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో వంజంగి హిల్స్‌లో సోమవారం ఉదయం మంచు మేఘాలు కనువిందు చేశాయి. కొండలను కప్పేసిన మంచు మేఘాలపై బంగారు కిరణాలను ప్రసరిస్తున్న భానుడిని చూసి పర్యాటకులు పరవశించిపోయారు. శని, ఆదివారాలకు కొనసాగింపుగా సోమవారం ఉదయం సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వంజంగి హిల్స్‌ను సందర్శించారు.
- పాడేరు/ఆంధ్రజ్యోతి

నకిలీ నెయ్యి కేసులో చిన్నప్పన్నకు షాక్

- వైవీ సుబ్బారెడ్డి పీఏ బెయిల్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు
- నెయ్యి సరఫరా కంపెనీల నుంచి కిలోకు రూ.25 కమీషన్ తీసుకున్న చిన్నప్పన్న
- ఎవరి ప్రోద్బలంతో వసూలు చేశారో తేలాల్సి ఉందన్న సిట్
- అప్పట్లో వాడిన ఫోన్లను ఆయన ఇవ్వడం లేదని వెల్లడి
- సిట్ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం



అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో వైసీపీ ఎంపీ, నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు హైకోర్టు గట్టిషాక్ ఇచ్చింది. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. నకిలీ నెయ్యి సరఫరా వ్యవహారంలో బెయిల్ కోరుతూ చిన్నప్పన్న దాఖలుచేసిన వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. నకిలీ నెయ్యి సరఫరాలో చిన్నప్పన్నకు ఎలాంటి పాత్రా లేదన్నారు. నెయ్యి సరఫరా కంపెనీల నుంచి కమీషన్ తీసుకోవడంతో పాటు టీటీడీ వ్యవహారాల్లో తలదూర్చారనేదే ఆయనపై ఆరోపణ అని.. చిన్నప్పన్నకు పోలీసు కస్టడీ ముగిసిందని.. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటామని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. సిట్ తరఫున సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నకిలీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా, ఇతర డెయిరీల నుంచి చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున కమీషన్ డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. హవాలాలో పిటిషనర్‌కు సొమ్ము అందిందని.. చిన్నప్పన్నకు ముడుపులిచ్చామని నెయ్యి సరఫరా కంపెనీలకు చెందినవారు వాంగ్మూలాలు ఇచ్చారని.. ఎవరి ప్రోద్బలంతో కమీషన్ వసూలు చేశారో దర్యాప్తులో తేలాల్సి ఉందని తెలిపారు. టీటీడీ అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డికి పిటిషనర్ పీఏగా ఉన్నారని.. ఆ సమయంలో వినియోగించిన ఫోన్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని వెల్లడించారు. చిన్నప్పన్నకు వైజాగ్‌లో 14 ఫ్లాట్లు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. ఆర్థిక లావాదేవీలు ముడిపడి ఉన్న కేసులలో నిందితులకు బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిందని.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. సిట్ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. చిన్నప్పన్న బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం నిర్ణయం వెల్లడించారు.

నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మదనపల్లె జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న తండ్రీ కొడుకులు బాలాజీ, సుదర్శన్‌లను ఎక్సైజ్ పోలీసులు విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. వారికి 18వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు సోమవారంఆదేశాలిచ్చారు. భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో బాలాజీ ఏ-3, సుదర్శన్ ఏ-29గా ఉన్నారు. ప్రస్తుతం మదనపల్లె జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని పీటీ వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు సోమవారం విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టుకు చెవిరెడ్డి... విచారణ 22కి వాయిదా

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రియాంక స్పందిస్తూ... వాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని, సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను ఈనెల 22కి వాయిదా వేశారు.

మద్యం కేసులో సుప్రీం విచారణ జనవరి 21కి వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో రిజాయిండర్ దాఖలుకు సమయం ఇవ్వాలని ముగ్గురు నిందితులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులు మాజీ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు ట్రయల్ కోర్టు మంజూరుచేసిన 'డీఫాల్ట్ బెయిల్'ను రాష్ట్ర హైకోర్టు రద్దుచేయడం.. నవంబరు 26లోగా కోర్టులో లొంగిపోవాలని ఆదేశించడం.. దానిపై వారు సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. అత్యవసరంగా సరెండర్ కావాల్సిన అవసరం లేదని హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులివ్వడం తెలిసిందే. ఆ ముగ్గురి పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.